ప్రతిపక్షం

www.prathipaksham.in

శుక్రవారం 23.01.2026 | Published From Hyderabad | సంపుటి: 18 సంచిక: 303 పేజీలు:12 | ₹5

@prathipaksham | prathipaksham tv telugu



సింధు చారిత్రక రికార్డు 12

కేటీఆర్‌కు సిట్ నోటీసులు

నేడు విచారణకు హాజరు కావాలని ఆదేశం

దూకుడు పెంచిన విచారణ బృందం

ఇప్పటికే హరీష్‌విచారించిన అధికారులు

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో



హైదరాబాద్, జనవరి 22: ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణలో సిట్ దూకుడు పెంచింది. ఈ కేసులో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌కు ప్రత్యేక దర్యాప్తు బృందం నోటీసులు జారీ చేసింది. నేడు శుక్రవారం ఉదయం 11 గంటలకు జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌కు హాజరై విచారణకు సహకరించాలని ఆ నోటీసుల్లో స్పష్టం చేసింది. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ పాలన సమయంలో అక్రమంగా ఫోన్ ట్యాపింగ్ జరిగిందన్న ఆరోపణలపై సిట్ అధికారులు 2024 మార్చి నెల నుంచి దర్యాప్తు కొనసాగిస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే ఈ వ్యవహారంలో పలువురిపై ప్రధాన అభియోగపత్రం

...:: మిగతా 2లో

నా ఫోన్ ట్యాప్ చేయట్లేదా?

- రేపు సిట్ విచారణలో అడుగుతా
- నన్ను పిలిచి టైంపాస్ ప్రశ్నలు వేస్తారు
- ఇదంతా రేవంత్ డైవర్షన్ లో భాగమే
- ప్రజల రక్షణ కోసం పోలీసులు ఫోన్లు ట్యాప్ చేస్తారు
- ఇప్పుడు కాంగ్రెస్ మంత్రులు, బీఆర్ఎస్ నేతల ఫోన్లను ట్యాప్ చేయట్లేదా.?
- మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

...:: 2లో



ఫ్యూచర్ సిటీలో ఏఐ డేటా సెంటర్

100 మెగావాట్ల సామర్థ్యం.. రూ.5వేల కోట్ల పెట్టుబడులు


సుమారు 4 వేల మందికి ఉపాధి.. యూపీసీ వోల్ట్ తో తెలంగాణ ఒప్పందం

- పర్యావరణ పరిరక్షణతో పాటు అభివృద్ధి లక్ష్యం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడి
- రైజింగ్ 2047 విజన్‌కు వరల్డ్ ఎకానమిక్ ఫోరం మద్దతు
- రూ.623 కోట్ల పెట్టుబడితో స్నైడర్ ఎలక్ట్రిక్ విస్తరణ
- గోద్రేజ్ ఇండస్ట్రీస్ చైర్మన్‌తో తెలంగాణ మంత్రుల భేటీ
- 150 కోట్ల పెట్టుబడితో గోద్రేజ్ క్రీమ్‌లైన్ డెయిరీ ప్లాంట్
- 'తెలంగాణ రైజింగ్' బృందం దావోస్ పర్యటన విజయవంతం

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, జనవరి 22: దేశంలోనే తెలంగాణను ఏఐ డేటా సెంటర్‌హబ్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక పెట్టుబడిని సాధించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని 'తెలంగాణ రైజింగ్' బృందం దావోస్‌లో యూపీసీ వోల్ట్ సంస్థతో అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకుంది. యూపీసీ వోల్ట్ సీఈవో హాన్ డీ గ్రూట్, యూపీసీ రిన్యూవబుల్స్ ఏపీఏసీ సహ వ్యవస్థాపకుడు స్టీవెన్ జ్వాన్, యూపీసీ రిన్యూవబుల్స్ ఇండియా సీఈవో అలోక్ నిగమ్ తో ముఖ్యమంత్రి ప్రత్యేకంగా

...:: మిగతా 2లో



ధాన్యం దిగుబడిలోనే కాదు... కొనుగోలులోనూ రికార్డు

- 25 సంవత్సరాలలో ఇదే అత్యధిక రికార్డ్
- సమన్వయంతో సాధించిన విజయం ఇది
- రైతుల భాగస్వామ్యంతోనే విజయం
- ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యంతో 14.20 లక్షల మంది రైతులకు లబ్ది
- బోనస్, మద్దతు ధర మొత్తం 18,532.98 కోట్లు చెల్లింపు
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, జనవరి 22: తెలంగాణా రాష్ట్రం ధాన్యం దిగుబడిలోనే కాకుండా ఖరీఫ్ సీజన్ లో ధాన్యం కొనుగోలులో దేశ చరిత్రలోనే ఆల్ టైం రికార్డ్ నమోదు చేసుకుందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. గడిచిన 25 సంవత్సరాల కాలంలో ఇదే అత్యధిక రికార్డ్ అని ఆయన చెప్పారు. 2025, 26 రబీ

...:: మిగతా 2లో



ఎన్ని నోటీసులు ఇచ్చినా.. వదలం

ఇచ్చిన హామీలు అమలు చేసేదాకా నిలదీస్తం

- ప్రశ్నిస్తున్నారనే రేవంత్ డైవర్షన్ టాక్టిక్స్
- బొగ్గు కుంభకోణంలో నిలదీసినందుకే నోటీసులు
- మాజీ మంత్రి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, జనవరి 22: ఎన్ని నోటీసులు ఇచ్చినా.. ఎన్ని అటెన్షన్ డైవర్షన్లు చేసినా నీ వెంటనే పడ్తమని మాజీ మంత్రి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు సీఎం రేవంత్ రెడ్డిని హెచ్చరించారు. మెదక్ జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీకి

...:: మిగతా 2లో

నైనీ కోల్ బ్లాక్ టెండర్ల రద్దుపై విచారణ

- రంగంలోకి దిగిన కేంద్ర ప్రభుత్వం
- ఇద్దరు కేంద్ర బొగ్గు శాఖ అధికారులతో కమిటీ
- మూ రోజుల్లో నివేదిక ఇవ్వనున్న విచారణ బృందం

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో



న్యూఢిల్లీ, జనవరి 22: నైనీ కోల్ బ్లాక్ టెండర్ల రద్దుపై కేంద్రం ఓ విచారణ కమిటీని ఏర్పాటు చేసింది. ఇద్దరు కేంద్ర బొగ్గు శాఖ అధికారులతో కూడిన ఈ బృందం త్వరలో రాష్ట్రానికి రానుంది. బొగ్గుశాఖ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ చేతనా శుక్లా, టెక్నికల్ డైరెక్టర్ మారపల్లి వెంకటేశ్వర్లు త్వరలో రాష్ట్రానికి వచ్చి నైనీ కోల్ బ్లాక్ టెండర్ల రద్దుపై విచారణ జరపనున్నారు. గత నవంబర్ 28న నైనీ కోల్ బ్లాక్‌లో బొగ్గు తవ్వకానికి సంబంధించి సింగరేణి జారీ చేసిన నోటిఫికేషన్, ఆ తర్వాత దాన్ని రద్దు చేయడానికి గల కారణాలపై ఈ కమిటీ దర్యాప్తు చేయనుంది. ఇతర బొగ్గు కంపెనీలు ఈ విధానంలో ఎలా అనుసరిస్తున్నాయనే అంశాలపై కమిటీ ఆరా తీయనుంది. ఇద్దరు సభ్యులతో కూడిన కమిటీ దర్యాప్తు అనంతరం 3 రోజుల్లో నివేదికను కేంద్రానికి సమర్పించనుంది. ఒడిశాలోని నైనీ ప్రాంతంలో సింగరేణికి బొగ్గు గనులు ఉన్నాయి. ఇక్కడ బొగ్గు గని అభివృద్ధి, నిర్వహణ ఎంపికకు టెండర్లు ఆహ్వానించింది. అయితే టెండర్ల స్వీకరణలో లోపాలెందుకు తలెత్తాయని బుధవారమే సింగరేణి సంస్థను కేంద్ర బొగ్గుగనుల శాఖ ప్రశ్నించింది. ఢిల్లీలోని శాస్త్రి భవన్లోని బొగ్గుగనుల కార్యాలయంలో ఆ శాఖ సంయుక్త కార్యదర్శి కె.సంజీవ్‌కుమార్ అత్యవసర వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నైనీ బొగ్గు గని టెండర్లపై సమీక్ష జరిపారు.

పాలకమండలి నిర్ణయాలపై అసంతృప్తి

సింగరేణి పాలకమండలి(బోర్డు)లో కృష్ణభాస్కర్ చైర్మన్ కాగా, కేంద్ర బొగ్గుశాఖ జాయింట్ సెక్రటరీతో పాటు రాష్ట్ర ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి, సింగరేణి డైరెక్టర్లు సభ్యులుగా ఉన్నారు. సంస్థ తీసుకున్న నిర్ణయాలకు పాలకమండలి ఆమోదం తప్పనిసరి. నైనీ గని ఎండీఓ టెండర్ల ప్రక్రియలో సంస్థ విధించిన నిబంధనలపై పాలకమండలి ముందే లోతుగా ఎందుకు చర్చించలేదని ఆయన ప్రశ్నించినట్లు సమాచారం. ఒకవేళ చర్చించి ఉంటే

...:: మిగతా 2లో



జార్ఖండ్‌లో భారీ ఎన్ కౌంటర్

- 15 మంది మావోయిస్టుల మృతి
- సారండా ఏజెన్సీలో ఎదురుకాల్పులు
- మృతుల్లో కేంద్ర కమిటీ సభ్యుడు అనల్

ప్రతిపక్షం నేషనల్‌బ్యూరో

రాంచీ, జనవరి 22 : జార్ఖండ్ లో భారీ ఎన్ కౌంటర్ జరిగింది. ఈ ఎన్ కౌంటర్‌లో 15 మంది మావోయిస్టుల మృతి చెందినట్లు అధికారులు తెలిపారు. జార్ఖండ్ పశ్చిమ సింగ్భూమ్ జిల్లాలోని జిల్లాలోని కిరీబురు పోలీస్ స్టేషన్ పరిధిలో సారండా అటవీ ప్రాంతంలో మావోయిస్టులు ఉన్నారన్న సమాచారంతో పోలీసులు, సీర్పీఎఫ్ కోబ్రా బలగాలు సంయుక్తంగా కూంబింగ్ ఆపరేషన్ చేపట్టాయి. ఈ క్రమంలో భద్రతా దళాలపై మావోయిస్టులు కాల్పులకు తెగబడటంతో, బలగాలు దీటుగా ప్రతిఘటించాయి. ఈ ఎకౌంటర్ 15 మంది మావోయిస్టులు మృతి చెందారు. మావోయిస్టులకు అడ్డాగా ఉన్న ఏవోబీలో నక్సల్స్ ఏరివేత ప్రక్రియ

...:: మిగతా 2లో



'గ్రూప్-1' తీర్పు వాయిదా

ఫిబ్రవరి 5 తీర్పు వెల్లడిస్తాం: హైకోర్టు

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, జనవరి 22: తెలంగాణ గ్రూప్ 1 నియామకాలకు సంబంధించి తీర్పును హైకోర్టు వాయిదా వేసింది. ఫిబ్రవరి 5 తీర్పు వెల్లడించనున్నట్లు హైకోర్టు వెల్లడించింది. తెలంగాణ గ్రూప్ 1 సర్వీసెస్ మెయిన్స్ పరీక్ష ఫలితాలను రద్దు చేస్తూ సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ దాఖలైన అప్పీళ్లపై హైకోర్టు తన తీర్పును వాయిదా వేసింది. ఈ కేసులో తుది తీర్పును ఫిబ్రవరి 5వ తేదీన వెల్లడించనున్నట్లు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్, జస్టిస్ జీఎం మొహియుద్దీన్‌లతో కూడిన ధర్మాసనం గురువారం ప్రకటించింది. తీర్పు కాపీ ఇంకా సిద్ధం కాలేదని, అందువల్ల వాయిదా వేస్తున్నట్లు కోర్టు పార్టీలకు తెలియజేసింది. ఈ అప్పీళ్లపై గత డిసెంబర్ 31న వాదనలు ముగించిన ధర్మాసనం, తీర్పును రిజర్వ్ చేసింది. గ్రూప్ 1 మెయిన్స్ మూల్యాంకన ప్రక్రియలో తీవ్రమైన లోపాలు

...:: మిగతా 2లో



విజయ్ పార్టీకి 'విజిల్'..

తమిళనాడు అసెంబ్లీకి కొన్ని నెలల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో నటుడు విజయ్ పార్టీ తమిళగ వెట్రి కళగం (టీవీకే)కు ఎన్నికల సంఘం గురువారం విజిల్ గుర్తును కేటాయించింది. కమల్‌హాసన్ పార్టీ మక్కల్ నీది మయ్యం (ఎంఎన్ఎం) కు 'బ్యాటరీ టార్చ్' గుర్తును కేటాయించినట్లు వెల్లడించింది.


11



ఐరాసకు సవాల్‌గా ట్రంప్ శాంతి మండలి

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గాజా శాంతి మండలిని ప్రారంభించారు దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సులో దీనిని అధికారికంగా ప్రకటించారు.

11



ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు?

ఉక్రెయిన్ యుద్ధం ముగింపు దిశగా అమెరికా చేస్తున్న ప్రయత్నాల్లో కీలక పరిణామం. రష్యా, ఉక్రెయిన్, అమెరికాలు తొలిసారి త్రైపాక్షిక భేటీకి సిద్ధమయ్యాయి. యూఏఈ వేదికగా మూడు దేశాల ప్రతినిధులు సమావేశంలో పాల్గొననున్నారు.

11



సజ్జన్ కుమార్‌కు భారీ ఊరట..

సిక్కు వ్యతిరేక అల్లర్లకు సంబంధించిన మరో రెండు కేసులలో కాంగ్రెస్ మాజీ ఎంపీ సజ్జన్ కుమార్‌కు ఊరట లభించింది. ఆయనను నిర్దోషిగా ఢిల్లీ కోర్టు గురువారం ప్రకటించింది.

11

రాష్ట్రీయం

కేటీఆర్‌కు సిట్ నోటీసులు

మొదటిపేజీ తరువాయి

దాఖలు చేసిన దర్యాప్తు సంస్థ, కేసును మరింత లోతుగా పరిశీలిస్తోంది. దీంతో ఈ కేసులో కీలక పరిణామాలు చోటు చేసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో విపక్ష నేతల ఫోన్లు ట్యాపింగ్ చేసినట్లు కేటీఆర్ ఇప్పటికే ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. తన రాజకీయ ప్రత్యర్థి అభ్యర్థుల కదలికలు తెలుసుకునేందుకు కేటీఆర్ ఫోన్లు ట్యాప్ చేయించినట్టు సిట్ ఆరోపిస్తోంది. ఈ నేపథ్యంలోనే ఆయన్ను ప్రశ్నించేందుకు సిట్ నోటీసులు జారీ చేసింది. రేపు సిట్ కార్యాలయంలో కేటీఆర్ విచారణకు హాజరు కాబోతున్నారు. ఇప్పటికే ఫోన్ ట్యాపింగ్ కేసులో మరో బీఆర్ఎస్ నేత హరీశ్ రావు కూడా సిట్ విచారణకు హాజరయ్యారు. ఇందులో హరీశ్‌రావుకు తన ఫోన్ ఎప్పుడు ట్యాప్ అయిందో సిట్ అధికారులు వివరాలు కూడా ఇచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. అలాగే కేటీఆర్ సోదరి కల్వకుంట్ల కవిత కూడా తన ఫోన్ ట్యాపింగ్ జరిగిందని ఆరోపించారు. బావ అని కూడా చూడకుండా తన భర్త ఫోన్ ను కూడా కేటీఆర్ ట్యాప్ చేయించారంటూ కవిత ఆరోపణలు చేశారు. ఈ నేపథ్యంలో కవితతో పాటు ఇతర బాధితుల ఫోన్లను ట్యాప్ చేసేందుకు కేటీఆర్ సహా ఇతర నేతలు ఎవరెవరికి ఆదేశాలు ఇచ్చారో తెలుసుకునేందుకు సిట్ నోటీసులు ఇచ్చింది. ఇప్పటికే జరిగిన విచారణలో సిట్.. బీఆర్ఎస్ పార్టీలో ఉన్న నేతల ఫోన్లు కూడా ట్యాపింగ్ చేసినట్లు గుర్తించినట్లు సమాచారం.

నా ఫోన్ ట్యాప్ చేయట్లేదా?



ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, జనవరి 22: 'రేపు సిట్ విచారణలో నా ఫోన్ ను ట్యాప్ చేయట్లేదా అని అడుగుతా.. ఎవరైనా సమాధానం చెబుతారా. ప్రస్తుతం కేంద్ర హోంశాఖ కూడా వేల మంది ఫోన్లను ట్యాప్ చేస్తోంది. అదంతా భద్రతలో భాగంగా చేస్తుంటారు. ఇందులో కొత్తదేం లేదు. రేపు నన్ను పిలిచి టైంపాస్ ప్రశ్నలు వేస్తారు. అంతకు మించి ఏమీ ఉండదు. ఇదంతా సీఎం రేవంత్ రెడ్డి డైవర్షన్ లో భాగమే' అని మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో తనకు నోటీసులు ఇవ్వడంపై మాజీ మంత్రి కేటీఆర్ స్పందించారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో కొత్తగా ఏమీ లేదని, సీఎం రేవంత్ రెడ్డి ఆడిస్తున్న ఆటలో భాగమే ఇదంతా అని కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ మంత్రులు తమ ఫోన్లను ట్యాప్ చేస్తున్నారని జర్నలిస్టులకు చెబితే, ఆ వార్తలను ప్రభుత్వం ఎందుకు ఖండించట్లేదని కేటీఆర్ ప్రశ్నించారు. 'ఫోన్ ట్యాపింగ్ అనేది ఇప్పుడు కొత్త కాదు. జవహర్ లాల్ నెహ్రూ ప్రధానమంత్రిగా ఉన్నప్పటి నుంచే చేస్తున్నారని అన్నారు. 'దేశ భద్రత కోసం కేంద్ర హోం శాఖ చేస్తుంది. ఇటు రాష్ట్రంలో పోలీస్ వ్యవస్థ చేస్తుంది. మా ప్రభుత్వం ఉన్నప్పుడు ఎవరైనా పోలీస్ అధికారులు చేశారేమో. అది మంత్రులకు తెలియదు. రాష్ట్ర ప్రజల రక్షణ, శాంతి భద్రతల కోసం అధికారులు, పోలీసులు ఫోన్లు ట్యాప్ చేస్తుంటారు. ఆ విషయం అప్పటి ఇంటెలిజెన్స్ చీఫ్‌గా పనిచేసిన శివధర్ రెడ్డి, అప్పటి డీజీపీలు మహేందర్ రెడ్డి, జితేందర్‌కు తెలుస్తుంది. మాకు ఆ విషయం తెలియదు' అంటూ కేటీఆర్ తెలిపారు. ఇప్పుడు కాంగ్రెస్ మంత్రుల ఫోన్లను, బీఆర్ ఎస్ నేతల ఫోన్లను ట్యాప్ చేయట్లేదని ఏ అధికారి అయినా చెప్పగలుగుతారా అంటూ ప్రశ్నించారు.

ఎన్ని నోటీసులు ఇచ్చినా.. వదలం

మొదటిపేజీ తరువాయి

చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు మాజీ మంత్రి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి ప్రజలు ప్రశ్నిస్తున్నారని డైవర్షన్ టాక్టిక్స్ చేస్తున్నాడు. నిన్న నాకు నోటీసులు ఇచ్చారని, నేడు కేటీఆర్‌కు ఇచ్చారని అన్నారు. 'కేటీఆర్ ఒకవైపు నుంచి నిలదీస్తున్నా, ఇంకోవైపు నుంచి నేను అడుగుతున్నా... సమాధానాల్లేవని, బొగ్గు కుంభకోణంలో నీబావమరిదికే నువ్వు సాయం చేసినవ్ నీ సంగతి ఏందంటే.. దాని మీద సమాధానం లేదు. సిట్ నోటీసులకు భయపడుతమనుకుంటున్నవా..? నువ్వు ఎన్ని నోటీసులు ఇచ్చినా బిడ్డా నిన్ను ప్రశ్నిస్తూనే ఉంటామని' హరీశ్ రావు స్పష్టం చేశారు. 'మహాలక్ష్మి ఇచ్చే దాకా అడుగుతాం. రైతు రుణమాఫీ అడుగుతాం. నువ్వు అవ్వా తాతలకు రూ.4వేలు ఇచ్చేదాకా అడుగుతం. నువ్వు తులం బంగారం ఇచ్చే దాకా అడుగుతనే ఉంటం. ఎస్సీ, ఎస్టీ, బీసీ పిల్లలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ డబ్బులు ఇచ్చేదాకా రేవంత్ రెడ్డి వెంట పడుతూనే ఉంటం. నీ వెంటనే పడ్తం' అని హరీశ్ రావు హెచ్చరించారు. ' మనం మున్సిపల్ ఎన్నికల్లో పనిచేసుకోవద్దు. ఈ సిట్ నోటీసులు ఇచ్చి దాని చుట్టూ తిరగాలే. సీఎం బావమరిది బొగ్గు కుంభకోణం భయటకు రావొద్దు. ఈ సిట్ నోటీసులమీద డైవర్షన్ పాలిటిక్స్ చేయాలే. ఈ డ్రామాలు నడవవు.. జనాలకు అన్నీ అర్థమైపోయినయి. నువ్వు ప్రజలను మోసం చేశావని' హరీశ్ రావు మండిపడ్డారు.

నైనీ కోల్ బ్లాక్ టెండర్ల రద్దుపై విచారణ

మొదటిపేజీ తరువాయి

ఇప్పుడు అవినీతి ఆరోపణలు ఎందుకు వస్తున్నాయన్నారు. దీంతోపాటు సైట్ విజిట్ వివాదాన్నికూడా ప్రస్తావించారు. సైట్ విజిట్ ధ్రువీకరణ పత్రాన్ని టెండర్ వేయదలచిన కంపెనీలకు ఎందుకు ఇవ్వడం లేదని కూడా ఆయన ప్రశ్నించినట్లు తెలుస్తోంది.

త్వరలో మళ్లీ టెండర్ల కోసం ఉత్తర్వులు...

అయితే టెండర్ల దాఖలుకు ఈ నెల 29 వరకూ సమయం ఇచ్చామని సింగరేణి అధికారులు వివరించినట్టు తెలుస్తోంది. టెండర్ల స్వీకరణ ప్రారంభమే కానందున, వాటిని తిరస్కరించే ప్రశ్న ఉత్పన్నం కాదని వారు చెప్పినట్లు సమాచారం. తమపై ఆరోపణలు చేస్తున్నారని వారు సమాధానమిచ్చారని తెలుస్తోంది. అయితే ఆరోపణలు రాగానే టెండర్ నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని నిర్ణయించినట్లు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రకటించారని వారు తెలిపారు. దీనిపై పాలకమండలి భేటీలో చర్చించి ఉత్తర్వులు జారీ చేస్తామని చెప్పినట్లు తెలుస్తోంది. అయితే ఈ వివాదంపై మరింత స్పష్టత కోసం కేంద్రం గురువారం ఇద్దరు సభ్యుల బృందంతో కమిటీ ఏర్పాటు చేసింది. త్వరలోనే వారు టెండర్ ప్రక్రియ, వివాదాలపై విచారణ జరపనున్నారు.

2016లోనూ ఇదే తరహా వివాదం

నైనీ ఎంఓడీపై గతంలోనే ఇలాంటి వివాదమే తలెత్తింది. 2016లో కూడా సంస్థ నైనీ ఎంఓడీపై టెండర్ ప్రకటన జారీ చేసింది. అయితే ఇందులో నిబంధనలు పాటించడం లేదని అప్పుడు ఎంపీగా ఉన్న కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రధాని మోదీకి ఫిర్యాదు చేశారు. దాంతో టెండర్ల ప్రకటనను రద్దు చేశారు. తిరిగి గత నవంబరులో ప్రకటన జారీ చేసి, ఈ నెల 29 వరకూ టెండర్ల స్వీకరణకు గడువు నిర్ణయించారు. అయితే మళ్లీ నిబంధనలు పాటించడం లేదన్న ఆరోపణలు రావడంతో ప్రభుత్వం వెనక్కి తగ్గింది.

'గ్రూప్-1' తీర్పు వాయిదా

మొదటిపేజీ తరువాయి

ఉన్నాయని పేర్కొంటూ, సింగిల్ బెంచ్ జడ్జి జస్టిస్ నమవరపు రాజేశ్వర్ రావు సెప్టెంబర్ 9న ఫలితాలు, ర్యాంకుల జాబితాను రద్దు చేశారు. జవాబు పత్రాలను మ్యాన్యువల్‌గా పునఃమూల్యాంకనం చేయాలని లేదా 8 నెలల్లోగా పరీక్షను తిరిగి నిర్వహించాలని టీజీపీఎస్సీని ఆదేశించారు. సింగిల్ జడ్జి ఇచ్చిన ఈ తీర్పును తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్, ఎంపికైన కొందరు అభ్యర్థులు డివిజన్ బెంచ్‌లో సవాలు చేశారు. విచారణ జరిపిన ధర్మాసనం, సింగిల్ జడ్జి ఉత్తర్వులపై స్టే విధించింది. ఫలితాల ఆధారంగా నియామక ప్రక్రియను కొనసాగించడానికి టీజీపీఎస్సీకి అనుమతి ఇచ్చింది. అయితే, ఈ నియామకాలు కోర్టు తుది తీర్పునకు లోబడి ఉంటాయని అప్పట్లో స్పష్టం చేసింది. ధర్మాసనం మధ్యంతర ఉత్తర్వుల నేపథ్యంలో, టీజీపీఎస్సీ 563 పోస్టులకు గాను 562 పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల జాబితాను విడుదల చేసింది. 2024 అక్టోబర్ 21 నుంచి 27 వరకు జరిగిన ఈ మెయిన్స్ పరీక్షలకు దాదాపు 30,000 మంది హాజరయ్యారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత గ్రూప్1 మెయిన్స్ పరీక్షలు జరగడం ఇదే తొలిసారి కావడం గమనార్హం.


జార్ఖండ్‌లో భారీ ఎన్ కౌంటర్

మొదటిపేజీ తరువాయి

చేపడుతున్న సంగతి తెలిసిందే. అలాగే తెలంగాణ, ఛత్తీస్ గఢ్ సహా మావోయిస్టు ప్రభావిత రాష్ట్రాల్లో భద్రతా బలగాలు సైతం జల్లెడపడుతున్నాయి.

మృతుల్లో అగ్రనేత అనల్

ఈ భారీ ఎన్ కౌంటర్ లో మావోయిస్టు అగ్ర నేతలు మృతిచెందినట్లు తెలుస్తోంది. కేంద్ర కమిటీ సభ్యుడు పతిరామ్ మాంఝి అలియాస్ అనల్ ఉన్నట్లు తెలుస్తోంది. అనల్ తలపై ఆరు రాష్ట్రాలలో మొత్తంగా రూ.5 కోట్లకు పైగా రివార్డు ఉన్నట్లు తెలుస్తోంది. మావోయిస్టు ఆర్గనైజేషన్లో అనల్ కీలకంగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. భద్రతా బలగాలపై దాడులకు సంబంధించి స్కెచ్ వేయడంలో అనల్ దిట్ట అని తెలుస్తోంది. అధికారులు అనల్ అలియాస్ పతిరామ్ మాంఝి, అన్మోల్ అలియాస్ సుశాంత్, పింటు లోహరా, లాల్జిత్ అలియాస్ లాలూ, రాజేష్ ముండా, బుల్బుల్ అల్డా, బబిత, పూర్ణిమలను గుర్తించారు. మిగిలిన నలుగురు నక్సలైట్ల గుర్తింపు ప్రక్రియ కొనసాగుతోందని, ఘటనకు సంబంధించి మరింత సమాచారం త్వరలో వెల్లడిస్తామని భద్రతా అధికారులు తెలిపారు. దట్టమైన అటవీ ప్రాంతంలోకి మావోయిస్టులు పారిపోయినట్టు పోలీసు వర్గాలు చెబుతున్నాయి.



ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుత కూటమి ఇలాగే కొనసాగితే జగన్ మోహన్ రెడ్డి తిరిగి అధికారంలోకి రావడం కష్టం. కూటమిని విడగొడితేనే అధికారంలోకి వచ్చే అవకాశం ఉంటుంది. జగన్ చుట్టూ ఉన్న కోటరీ ఆయనను తప్పదోవ పట్టిస్తోంది. తనకు సంబంధం లేని కేసుల్లో ఇరికించారు.

- మాజీ ఎంపీ
విజయసాయి రెడ్డి

ఫ్యూచర్ సిటీలో ఏఐ డేటా సెంటర్

మొదటిపేజీ తరువాయి

సమావేశమయ్యారు. నెదర్లాండ్స్ కు చెందిన యూపీసీ రిన్యూవబుల్స్ గ్రూప్, వోల్ట్ డేటా సెంటర్స్ కలిసి యూపీసీ వోల్ట్ సంస్థగా ఏర్పడింది. రాష్ట్ర ప్రభుత్వంతో చేసుకున్న ఒప్పందం ప్రకారం ఈ సంస్థ భారత్ ఫ్యూచర్ సిటీలో 100 మెగావాట్ల సామర్థ్యంతో ఏఐకు అనుకూలమైన డేటా సెంటర్ నెలకొల్పనుంది. ఈ ప్రాజెక్టుకు ఐదేళ్లలో రూ.5,000 కోట్ల పెట్టుబడి పెట్టనుంది. ఈ డేటా సెంటర్‌కు అవసరమైన విద్యుత్ సరఫరాకు 100 మెగావాట్ల సామర్థ్యంతో ప్రత్యేక పునరుత్పాదక విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు చేయనుంది. ఈ ప్రాజెక్టు నిర్మాణ దశలోనే 3వేల మందికి పైగా ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగావకాశాలు లభిస్తాయని, డేటా సెంటర్ ప్రారంభమైన తర్వాత మరో 800 మందికి ఉద్యోగ అవకాశాలుంటాయని సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణను తీర్చిదిద్దడంలో ఆధునిక డిజిటల్ మౌలిక వసతులు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. పర్యావరణ పరిరక్షణతో పాటు అభివృద్ధిని సాధించడమే రాష్ట్ర లక్ష్యమని స్పష్టం చేశారు. ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. అధునాతన ఏఐ డేటా సెంటర్ల ఏర్పాటుకు అవసరమైన ప్రోత్సాహకాలు, సౌకర్యాలు రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. నెట్ జీరో సిటీ అభివృద్ధే తెలంగాణ విజన్ లో భాగమని అన్నారు. రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఈ సమావేశంలో పాల్గొన్నారు. రైజింగ్ 2047 విజన్‌కు వరల్డ్ ఎకనామిక్ ఫోరం మద్దతు దావోస్ లో జరుగుతున్న వరల్డ్ ఎకనమిక్ ఫోరం సదస్సులో ఏర్పాటు చేసిన తెలంగాణ పెవిలియన్‌లో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ మేనేజింగ్ డైరెక్టర్ జెరెమీ జర్గెన్స్, సీ4ఐఆర్‌నెట్ వర్క్ కోఆర్డినేషన్ హెడ్ మంజు జార్జ్‌లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ రైజింగ్ విజన్ లక్ష్యాలతో పాటు వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ ఫాలో అప్ సదస్సు నిర్వహించే ప్రతిపాదనలను చర్చించారు. ప్రతి ఏడాది జులైలో హైదరాబాద్‌లో వరల్డ్ ఎకనమిక్ ఫోరం ఫాలోఅప్ సమావేశం నిర్వహించాలని ప్రతిపాదించారు. జనవరిలో జరిగే దావోస్ లో జరిగే సదస్సులోని చర్చలు, తీసుకున్న నిర్ణయాల పురోగతిని సమీక్షించుకునేందుకు ఫాలో అప్ సమావేశం ఉపయోగపడుతుందన్నారు. వరల్డ్ ఎకనమిక్ ఫోరం భాగస్వామ్యంతో ఫాలో అప్ సదస్సు నిర్వహించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. తెలంగాణలో అందుబాటులో ఉన్న అవకాశాలు, పారిశ్రామిక రంగంలో ఉన్న అనుకూలతలు, రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సహకాలు, ప్రభుత్వ విధానాలను ప్రపంచానికి చూపించాలనే ఆలోచనను పంచుకున్నారు. అందుకే హైదరాబాద్‌లో ఫాలో అప్ ఫోరమ్ నిర్వహించాలని కోరారు. ముఖ్యమంత్రి ప్రతిపాదనకు వరల్డ్ ఎకనమిక్ ఫోరం బృందం సానుకూలంగా స్పందించింది. సమీప భవిష్యత్తులో నిర్ణయం తీసుకుంటామని మేనేజింగ్ డైరెక్టర్ జెరెమీ జర్గెన్స్ తెలిపారు. చైనాలో ప్రతి ఏడాది 'సమ్మర్ దావోస్' జరుగుతోందని, సౌదీ అరేబియా కూడా ఆసక్తి ప్రదర్శిస్తోందని చెప్పారు. ఈ సమావేశంలో తెలంగాణ రైజింగ్ 2047 విజన్, 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే రోడ్‌మ్యాప్, లక్ష్యాలను సీఎం వివరించారు. తెలంగాణ విజన్‌లోని విభిన్న కోణాలు వివిధ కోణాలు పరస్పర సహకారానికి అవకాశం కల్పించేలా ఉన్నాయని జెరెమీ జర్గెన్స్ ప్రశంసించారు. తెలంగాణ రైజింగ్ 2047 విజన్ లో తాము భాగస్వామ్యం పంచుకుంటామన్నారు. తెలంగాణ ఆర్థిక వృద్ధి ప్రయాణంలో కలిసి వస్తామనే సంకేతాలు ఇచ్చారు. హైదరాబాద్లో ప్రతిభావంతమైన మానవ వనరులున్నాయని అభిప్రాయపడ్డారు. అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. స్కిల్ డెవెలప్మెంట్, స్పోర్ట్స్‌కు తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తుందన్నారు. హైదరాబాద్‌లో జరిగిన బయోఏషియా 2024లో ప్రారంభించిన సీ4ఐఆర్ తెలంగాణ (సెంటర్ ఫర్ ది ఫోర్త్ ఇండస్ట్రియల్ రివల్యూషన్) పురోగతిపై ఈ సమావేశంలో చర్చలు జరిగాయి. ఆరోగ్యం, లైఫ్ సైన్సెస్ రంగాలకు సంబంధించి వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ భారత్లో ప్రారంభించిన తొలి థీమాటిక్ సెంటర్ అదేనని గుర్తు చేశారు. సీ4ఐఆర్‌ఆదర్శవంతమైన మోడల్గా గుర్తింపు సాధించిందన్నారు. పరిశ్రమల అభివృద్ధి ప్రణాళికలో ఉత్తమ పద్ధతులపై సీ4ఐఆర్ చేస్తున్న పరిశోధనల సమాచారాన్ని తెలంగాణ ప్రభుత్వంతో పంచుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మూడు జోన్ల నమూనాను విశ్లేషించారు. క్యూర్, ఫ్యూర్, రేర్ ఆర్థిక అభివృద్ధి వ్యూహంతో పాటు భారత్ ఫ్యూచర్ సిటీ ఏర్పాటును వివరించారు. సమావేశంలో పాల్గొన్న మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ, ఏరోస్పేస్, డిఫెన్స్, బయోడిజైన్, సాఫ్ట్‌వేర్, ఫార్మా రంగాల్లో హైదరాబాద్కు ఉన్న అనుకూలతలను వివరించారు. ఎలక్ట్రిక్ వాహనాలు, పునరుత్పాదక ఇంధనంపై ప్రభుత్వం దృష్టి పెట్టిందన్నారు.



దావోస్ పర్యటన విజయవంతం

మూడు రోజుల వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ సదస్సులోనూ తెలంగాణ ఆశించిన లక్ష్యాన్ని సాధించింది. వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ 2026 సదస్సులో పెట్టుబడులకు మించి తెలంగాణ రైజింగ్ 2047 విజన్ లక్ష్యాలను ప్రపంచానికి చాటి చెప్పాలనే ప్రభుత్వ సంకల్పం నెరవేరింది. మూడు రోజుల పాటు జరిగిన ఈ పర్యటనలో ప్రతినిధుల బృందం గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు, డేటా సెంటర్లు, క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ, తయారీ రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించింది. ఏఐ, సస్టెనబిలిటీ, స్కిల్లింగ్ కార్యక్రమాలకు సంబంధించిన పలు అవగాహన ఒప్పందాలు కుదుర్చుకుంది. ఈ పర్యటనలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి వరల్డ్ ఎకనామిక్ ఫోరం నిర్వహించిన రెండు కీలక సెషన్లలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన చేసిన ప్రసంగం, హైదరాబాద్ లో వరల్డ్ ఎకనమిక్ ఫాలో అప్ ఫోరమ్ నిర్వహించాలనే ప్రతిపాదన కు సానుకూల స్పందన లభించింది. మూడు రోజుల్లో ప్రపంచ స్థాయి ప్రముఖ కంపెనీలు, పారిశ్రామిక దిగ్గజాలతో 12 ముఖాముఖి సమావేశాల్లో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. పలు కీలక సమావేశాలు, ప్రత్యేక సెషన్ల అనంతరం మూడు రోజుల తెలంగాణ ప్రతినిధి బృందం దావోస్ పర్యటన గురువారం సాయంత్రం ముగిసింది. దావోస్ లో కార్యక్రమాలు ముగించుకొని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జూరిచ్ బయల్దేరారు. అక్కడి నుంచి అమెరికా పర్యటనకు వెళుతున్నారు. మంత్రులు శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి దావోస్ నుంచి ఇండియాకు తిరుగు పయనమయ్యారు.

రూ.623 కోట్ల పెట్టుబడితో స్నైడర్ ఎలక్ట్రిక్‌విస్తరణ

రాష్ట్రంలో స్నైడర్ ఎలక్ట్రిక్ ఇండియా కంపెనీ తమ యూనిట్లను విస్తరించనుంది. శంషాబాద్ , గాగిల్లాపూర్ లోని రూ.623 కోట్ల పెట్టుబడితో విస్తరిస్తున్నట్లు వెల్లడించింది. ప్రపంచ ఆర్థిక వేదిక -2026 లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్నైడర్ కంపెనీ సీఈవో దీపక్ శర్మతో సమావేశమయ్యారు. విద్యుత్ రంగంలో వస్తున్న మార్పులు, విద్యుత్ నిల్వ ప్రాజెక్టులు, గ్రిడ్ ఆధునీకరణ, విద్యుత్ సామర్థ్యం పెంపు, ఇండస్ట్రీయల్ పార్కులు , పట్టణ మౌలిక వసతులకు డిజిటల్ విద్యుత్ నిర్వహణ వంటి అంశాలపై సమావేశంలో చర్చించారు. ఈ యూనిట్ల విస్తరణతో ఎలక్ట్రికల్ సేఫ్టీకి సంబంధించి ఎయిర్ సర్క్యూట్ బ్రేకర్లు, మోల్డెడ్ కేస్ సర్క్యూట్ బ్రేకర్లు, కాంటాక్టర్లు, పుష్ బటన్ల తయారీ సామర్థ్యం పెరుగనుంది.

గోద్రేజ్ ఇండస్ట్రీస్ ఛైర్మన్‌తో తెలంగాణ మంత్రుల భేటీ

ప్రపంచ ఆర్థిక వేదిక -2026సందర్భంగా తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డితో కలిసి గోద్రేజ్ ఇండస్ట్రీస్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ నాదిర్ గోద్రేజ్‌తో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఆయిల్ పామ్ వ్యవసాయంలో కృత్రిమ మేధస్సు (ఏఐ) వినియోగం, హైదరాబాద్‌లో ఉన్న గోద్రేజ్ క్రీమ్‌లైన్ డెయిరీ ప్లాంట్ ను రూ.150 కోట్ల పెట్టుబడితో విస్తరించే అవకాశాలపై చర్చించారు. భారత్ ఫ్యూచర్ సిటీ నివాస ప్రాంతంలో భారీ గృహ నిర్మాణాల ప్రాజెక్టులు చేపట్టే అంశంపై మాట్లాడారు. ఫ్యూచర్ సిటీలో మౌలిక వసతులు (స్కూళ్లు, ఆసుపత్రులు, కమ్యూనిటీ సౌకర్యాలు) ఏర్పాటు చేయడం ప్రభుత్వానికీ, సంస్థకూ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలంగాణ ప్రతినిధులు పేర్కొన్నారు. నాదిర్ గోద్రేజ్‌ను హైదరాబాద్‌కు రావాలని ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు ఆహ్వానించారు.

తెలంగాణ ఏఐ ఇన్నోవేషన్ హబ్‌కు అపూర్వ స్పందన

దావోస్ లో జరిగిన వరల్డ్ ఎకనామిక్ ఫోరం-2026 సమావేశాల్లో తెలంగాణ ఏ ఐ ఇన్నోవేషన్ హబ్కు అంతర్జాతీయ స్థాయిలో అపూర్వ స్పందన లభించింది. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని 'తెలంగాణ రైజింగ్' బృందం పలు ప్రతిష్ఠాత్మక సంస్థలతో అవగాహన ఒప్పందాలు (ఎంఓయూలు) కుదుర్చుకుంది. బ్రిటన్‌కు చెందిన ప్రముఖ విద్యా, పబ్లిషింగ్ సంస్థ పియర్సన్ తెలంగాణ ప్రభుత్వంతో ఎంఓయూ కుదుర్చుకుంది. ఈ ఒప్పందం ద్వారా తెలంగాణలో ఏర్పాటు కానున్న గ్లోబల్ ఏఐ అకాడమీకి పియర్సన్ సహకారం అందించనుంది. ఏఐ శిక్షణ, పాఠ్య ప్రణాళిక, లెర్నింగ్ కంటెంట్, అంచనా విధానాలు, అంతర్జాతీయ స్థాయి సర్టిఫికేషన్లలో తన నైపుణ్యాన్ని పియర్సన్ ఉపయోగించనుంది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ యువతకు ఏ ఐ శిక్షణ అందించి భవిష్యత్ తరాలకు నైపుణ్యం కలిగిన రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దడమే లక్ష్యమని తెలిపారు.

సౌర, పవన విద్యుత్ ఉత్పత్తికి ఐనాక్స్ గ్రూప్ ఆసక్తి

తెలంగాణను కాలుష్య రహిత మహానగరంగా అభివృద్ధి చేసే లక్ష్యంతో ఐనాక్స్ గ్రూప్ డైరెక్టర్ దేవాంశ్ జైన్‌తో ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు, రెవెన్యూ , హౌసింగ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సమావేశ మయ్యారు. ఈ సందర్భంగా సోలార్ మాడ్యూల్స్ సహా ఆధునిక, సుస్థిర తయారీ రంగాల్లో సహకార అవకాశాలపై చర్చించారు. ఐనాక్స్ గ్రూప్ తెలంగాణలో సౌర , పవన విద్యుత్ ఉత్పత్తి చేపట్టి, ఆ తర్వాత తయారీ రంగంలోకి విస్తరించేందుకు ప్రణాళికలు రూపొందిస్తోంది. రాష్ట్ర పారిశ్రామిక రంగానికి కాలుష్యం లేని విద్యుత్ (క్లీన్ ఎలక్ట్రిసిటీ) , గ్రీన్ హైడ్రజన్ అందిచాలనే ప్రణాళికలు ప్రభుత్వం రూపొందిస్తున్నది అని ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. డేటా సెంటర్ల నుంచి అధిక స్థాయిలో పునరుత్పాదక విద్యుత్ అవసరం పెరుగుతోందని చెప్పారు. నూతన తెలంగాణ ఎనర్జీ పాలసీ కింద అనేక ప్రోత్సాహకాలు అందిస్తున్నట్లు మంత్రి తెలిపారు.

ధాన్యం దిగుబడిలోనే కాదు... కొనుగోలులోనూ రికార్డు

మొదటిపేజీ తరువాయి

సీజన్ ధాన్యం కొనుగోలుకై పౌర సరఫరా శాఖా రూపొందించిన ప్రణాళికలపై గురువారం బేగంపేట ఐఏఎస్ ఆఫీసర్స్ అసోసియేషన్ భవనంలో జరిగిన సమీక్ష సమావేశానికి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన రెండు సంవత్సరాల వ్యవదిలో అనుసరించిన విధానాల ఫలితమే ధాన్యం దిగుబడి, కొనుగోలులోనూ సంచలనాత్మక రికార్డ్ నమోదు చేసుకుందని ఆయన చెప్పారు. పౌరసరఫరాల శాఖ, నీటిపారుదల, వ్యవసాయ శాఖలు పరస్పరం సమన్వయం చేసుకోవడంతో పాటు తెలంగాణా రైతాంగం భాగస్వామ్యంతోటే ఇంతటి విజయం సాధించామని ఆయన చెప్పారు. స్వాతంత్ర్యం వచ్చిన 75 సంవత్సరాల చరిత్రలోనే రికార్డ్ స్థాయిలో ధాన్యం కొనుగోలు చేసిన ఘనత తెలంగాణా రాష్ట్రానికి దక్కిందన్నారు. 2020-21 లో నమోదు అయిన 70.2 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు రికార్డ్ ను అధిగమించి తాజాగా జరిగిన ఖరీఫ్ సీజన్ లో71.64 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేసి దేశ చరిత్రలోనే రాష్ట్రం కొత్త అధ్యాయం సృష్టించిందన్నారు. మద్దతు ధర తో పాటు సన్నాలకు మొట్టమొదటి సారిగా తెలంగాణా ప్రభుత్వం అందిస్తున్న బోనస్ తో కలిపి మొత్తం 18,532.98 కోట్ల రూపాయలను 14.20 లక్షల మంది రైతులకు చెల్లించామన్నారు. ఖరీఫ్ సీజన్ లోరాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికా బద్ధంగా రూపొందించిన మేరకు అధికారులు రాష్ట్ర వ్యాప్తంగా 8,548 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడంతో పాటు కొనుగోలు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించడంతో రైతులు ఎక్కడ ఇబ్బంది పడకుండా కొనుగోలు ప్రక్రియ ముగిసిందని ఆయన వివరించారు.

విదేశాలకు తెలంగాణా బియ్యం ఎగుమతి?

అందుకు పౌర సరఫరాల శాఖ సిబ్బంది పని తీరును మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. అధిక దిగుబడులతో పాటు రికార్డ్ స్థాయిలో కొనుగోలు చెసిన ధాన్యాన్ని మిల్లింగ్ చేసి భారత ఆహార సంస్థతో పాటు ప్రజాపంపిణీ వ్యవస్థ కు సరఫరా చేయడంతో పాటు తెలంగాణా బియ్యానికి అంతర్జాతీయ మార్కెట్ లో ఉన్న డిమాండ్ ను పట్టి విదేశాలకు ఎగుమతి చేసేందుకు విధి విధానాలను రూపొందిస్తున్నట్లు ఆయన వెల్లడించారు.అంతర్జాతీయ స్థాయిలో డిమాండ్ ఉన్న ధాన్యాన్ని పండించేందుకు గాను రైతులను ప్రోత్సహించేందుకు ప్రోత్సాహకాల ఆవశ్యకతను ఆయన వివరించారు.అంతర్జాతీయ మార్కెట్ కు బియ్యాన్ని ఎగుమతి చెసేందుకు కుడా ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నామని ఆయన తెలిపారు.ధాన్యం కొనుగోలు ప్రక్రియలో రాష్ట్ర ప్రభుత్వం సంవత్సరానికి 38,000 కోట్లను నేరుగా రైతుల ఖాతాలో జమ చేయడం కుడా ఒక అరుదైన రికార్డే అని ఆయన చెప్పుకొచ్చారు.

సన్నబియ్యానికి రూ.13,650 కోట్లు వెచ్చింపు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన సన్నబియ్యం 3.17 కోట్ల మందికి ఉచితంగా పంపిణీ చేస్తున్నామని, అంటే రాష్ట్ర జనాభాలో 85% లబ్ది పొందుతున్నారని ఆయన వివరించారు.అర్హులైన ప్రతి లబ్ధిదారుకు నెలకు ఆరు కిలోల బియ్యం ఉచితంగా అందిస్తున్నామన్నారు. సన్నబియ్యం పంపిణీ మీద రూ. 13,650 కోట్లు ఖర్చు పెడుతున్నట్టు ఆయన తెలిపారు.ప్రజాపంపిణీ వ్యవస్థలో ఉన్న నాణ్యతా లోపాలు గుర్తించడంతో పాటు అక్రమంగా బ్లాక్ మార్కెట్ కు తరలి పోయే విధానానికి కళ్లెం వేసి నాణ్యతా ప్రమాణాలపై కఠిన నిబంధనలు అమలులోకి తెచ్చామన్నారు. నిల్వ చేసేందుకు మౌలిక సదుపాయాల ఆధునీకరణపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించిందని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలో ధాన్యాన్ని నిల్వచేసే గోదాముల సామర్థ్యం 29 లక్షల మెట్రిక్ టన్నుల వరకు పరిమితము అయ్యిందని,ఈ గోదాములను భారత ఆహార సంస్థ,రాష్ట్ర గోదాముల సంస్థ ఆధ్వర్యంలో నిర్వహణ కొనసాగుతుందని అయితే నాణ్యతా లోపాలతో నిల్వ ఉంచిన బియ్యం చేడి పోయి రాష్ట్ర ప్రభుత్వానికి భారీ నష్టం వాటిల్లుతుందని ఆయన తెలిపారు. బీహార్ వంటి రాష్ట్రాల నుండి వలస వచ్చే కార్మికులపై తెలంగాణా రాష్ట్రంలో రైస్ మిల్లులు ఆధారపడుతున్నాయని, ఇటీవల ఆ రాష్ట్రంలో ఎన్నికలు జరిగితే వలస వచ్చిన కార్మికులు వారి వారి స్వస్థలాలకు వెళ్లిపోవడంతో కొనుగోళ్ల ప్రక్రియకు ఆటంకాలు ఏర్పడ్డాయని ఆయన చెప్పారు. అటువంటి పరిస్థితి తిరిగి ఉత్పన్నం కాకుండా ఉండేందుకు గాను స్థిరమైన కార్మిక వ్యవస్థ ఏర్పాటు ఆవశ్యకతను ఆయన సూచించారు. ప్రభుత్వం రూపొందించిన నిబంధనలు పాటించిన మిల్లర్లకు సంపూర్ణ సహాయ సహకారాలు ఉంటాయని తప్పిదాలకు పాల్పడితే మాత్రం చర్యలు కఠినాత్మకంగా ఉంటాయని ఆయన హెచ్చరించారు. అదే సమయంలో డిఫాల్ట్ అయిన మిల్లులకు ధాన్యం కేటాయింపు ప్రసక్తే లేదని ,పౌర సరఫరాల శాఖ రూపొందించిన మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటించాల్సిందేనన్నారు. ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా మరిన్ని నిత్యావసర సరుకుల సరఫరాకు ప్రభుత్వం ఆలోచన చేస్తుందని ఆయన చెప్పారు.ధాన్యం కొనుగోలు కేంద్రాలలో డ్రైయర్లు ,పాడి క్లినర్ల ఏర్పాటుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని ఇది రైతు సంక్షేమ ప్రభుత్వమని,అన్ని వేళల ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.ఈ సమావేశంలో పౌరసరఫరాల సంస్థ కమిషనర్ స్టీఫెన్ రవీంద్రతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాలి

- పథకాలు అందించడంలో శాఖలు ముందుండాలి
- రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
- శాఖల వారీగా అభివృద్ధి, సంక్షేమ పథకాలపై సమీక్ష



ప్రతిపక్షం సిటీ బ్యూరో, హైదరాబాద్, జనవరి 22: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాలని, సంక్షేమ పథకాల అమలులో జిల్లాను ముందంజలో ఉంచాలని రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. గురువారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో హైదరాబాద్‌జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి అధ్యక్షతన నిర్వహించిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల అమలు, పురోగతిపై మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ హైదరాబాద్ జిల్లా పరిధిలో రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా అధికారులు నిబద్ధతతో ప్రత్యేక కృషి చేయాలని మంత్రి సూచించారు. హైదరాబాద్ నగర స్వభావాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రత్యేక విధానంతో ప్రణాళికలు రూపొందించి అమలు చేయాల్సిన అవసరం ఉందని మంత్రి స్పష్టం చేశారు. జిల్లాలో జనాభా వృద్ధి, ఉపాధి కోసం వలసలు, సేవల ఆధారిత ఆర్థిక వ్యవస్థను పరిగణనలోకి తీసుకొని విద్య, ఆరోగ్యం, గృహాలు, రవాణా, భద్రత మరియు ప్రజా సేవలను అధికారులు సమన్వయంతో కలసి అమలు చేయాలని మంత్రి సూచించారు. అలాగే సంక్షేమం, పథకాల అమలు, పింఛన్లు, వృద్ధులు మరియు దివ్యాంగులకు సంబంధించిన సంక్షేమం, 2 బీహెచ్‌కే గృహాలు, రేషన్ కార్డులు మరియు సన్నబియ్యం పంపిణీ, విద్యారంగం, రెసిడెన్షియల్ పాఠశాలలు మరియు హాస్టళ్లు, మధ్యాహ్న భోజన పథకం, అంగన్‌వాడీ కేంద్రాలు, షాదీ ముబారక్, కల్యాణ లక్ష్మి వంటి పథకాల అమలును మంత్రి సమీక్షించారు. ఆరోగ్య రంగంలో ఆరోగ్యశ్రీ కవరేజ్, లబ్ధిదారుల పరిధి, ఆసుపత్రుల నెట్‌వర్క్, బస్తీ దవాఖానాలు మరియు ప్రజారోగ్య సౌకర్యాలకు సంబంధించిన అంశాలపై సంబంధిత వైద్యాధికారులు వివరించారు.

రవాణా, పట్టణ విస్తరణ అంశాలపై సమీక్ష

రవాణా, పట్టణ విస్తరణ అంశాలపై విస్తృతంగా సమీక్ష జరిగింది. ట్రాఫిక్ నియంత్రణ, రోడ్ సేఫ్టీ చర్యలు, నగరంలోని అన్ని ప్రాంతాలకు ఆర్టీసీ ప్రజా రవాణాను మరింత బలోపేతం చేయడం, కొత్త బస్ మార్గాల ప్రారంభం ద్వారా కనెక్టివిటీ మెరుగుపరచడం, మహిళలకు ఉచిత బస్ ప్రయాణం కల్పించే మహాలక్ష్మి పథకం అమలు వంటి అంశాలను మంత్రి పరిశీలించారు. ఎలక్ట్రిక్ వాహనాలు ప్రోత్సాహం, ప్రజా ప్రదేశాలలో ఈవీ చార్జింగ్ మౌలిక వసతుల ఏర్పాటు విషయాలపై అమలు తీరును మంత్రి సమీక్షించారు. ఉపాధి, ఆర్థిక రంగాల పరంగా చేనేత, వస్త్ర పరిశ్రమలు, ఉపాధి మరియు నైపుణ్యాభివృద్ధి శిక్షణ, సహకార సంఘాలు, స్వయం సహాయక సంఘాలు, స్లమ్ స్థాయి సమాఖ్యలపై సమీక్ష జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం విద్యతో పాటు క్రీడాభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇవ్వటంతో క్రీడా కారులకు క్రీడారంగాల్లో ప్రత్యేక తర్ఫీదు అందించడం జరుగుతుందని అన్నారు. పర్యావరణం , కాలుష్య నియంత్రణ, గాలి నాణ్యత, భూగర్భ జల మట్టాలు, ఉద్యానవనం, పశుపోషణ, పశుసంవర్ధక సేవలు, మత్స్య మరియు పాడి అభివృద్ధి అంశాలపై సమీక్షించారు. అలాగే ఉచిత విద్యుత్ 200 యూనిట్ల సరఫరా, ప్రభుత్వ భూముల సంరక్షణ, మీ సేవా కేంద్రాల ద్వారా సులభమైన పాలన మరియు సేవల అందుబాటు, అగ్నిమాపక శాఖల సర్వీస్, బాల కార్మికులు, భిక్షాటన, న్యాయ కేసుల పరిష్కారం మరియు ప్రజా ఫిర్యాదుల పరిష్కారం అంశాలు కూడా సమీక్షించారు. జిల్లాలో అన్ని శాఖలు సమన్వయంతో కలసి పనిచేసి అర్హులైన వారికి పథకాలను అందించాలని మంత్రి అన్నారు. అనంతరం ప్రమాదాల నివారణకై ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని రోడ్ సేఫ్టీ పై ప్రతిజ్ఞ చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ జితేందర్ రెడ్డి, డీఆర్వో వెంకటాచారి, సీపీఓ డాక్టర్ సురేందర్, జిల్లా సంక్షేమ అధికారులు జి ఆశన్న, అక్కేశ్వరరావు, ఇలియాస్ అహ్మద్, ప్రవీణ్ కుమార్, కోటాజి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటి, జిల్లా విద్యాశాఖ అధికారి రోహిణి, జిల్లా అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పరస్పర సహకారంతోనే
తెలుగు రాష్ట్రాల అభివృద్ధి

- ఏపీ మంత్రి లోకేష్‌తో తెలంగాణ సీఎం చర్చలు
- విద్యా సంస్కరణలు, ఐటీ ప్రగతి గురించి స్నేహపూర్వక సంభాషణ
- తెలంగాణ స్కిల్ డెవలప్మెంట్ ప్రోగ్రాం పరిశీలించండి
- ఏపీ విద్యామంత్రిని కోరిన తెలంగాణ సీఎం
- దావోస్ లో సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన ఏపీ మంత్రి నారా లోకేష్

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, జనవరి 22: పరస్పర సహకారంతోనే తెలుగు రాష్ట్రాల అభివృద్ధి సాధ్యమని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, ఏపీ మంత్రి నారా లోకేష్ అభిప్రాయపడ్డారు. దావోస్ లో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ కలిశారు. ఈ సందర్భంగా సీఎంను మంగళగిరి శాలువాతో సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. మంత్రి లోకేష్‌ను సీఎం సత్కరించారు. ఏపీ విద్యాశాఖలో చేపట్టిన సంస్కరణలు, ఐటీ ప్రగతి గురించి మంత్రి లోకేష్ వివరించారు. ఏపీ మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్ కోసం తీసుకుంటున్న చర్యలు, వస్తున్న ఫలితాలపై చర్చ సాగింది. తెలంగాణలో సాగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి సీఎం తెలియజేశారు. ముఖ్యంగా స్కిల్ డెవలప్మెంట్ ప్రోగ్రాంలో భాగంగా టాటా సంస్థ సహకారంతో తెలంగాణ రాష్ట్రంలో ఐటీఐలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేశామని, స్కిల్ క్యాంపస్ లుగా తీర్చిదిద్దిన ఐటీఐలను సందర్శించాలని సీఎం కోరారు. కోట్లాది మంది దర్శించుకునే ములుగు జిల్లాలో వనదేవతల సన్నిధి మేడారం సమ్మక్క సారలమ్మ దేవస్థానం ఆధునీకరణ పనులు వందల కోట్లతో చేపట్టామని వివరించారు. దశాబ్దాలుగా ఏ ఒక్క ప్రభుత్వం చూపని చొరవ ఇదని, రహదారులు, మౌలిక సదుపాయాలన్నీ కల్పించామని, వనదేవతలను దర్శించుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి నారా లోకేష్ ని ఆహ్వానించారు. పరస్పర సహకారంతోనే తెలుగు రాష్ట్రాల అభివృద్ధి సాధ్యమని సీఎం చెప్పారు. పెట్టుబడుల సాధనలో పోటీపడి దేశానికే తెలుగురాష్ట్రాలు ఆదర్శంగా నిలవనున్నాయని సీఎం, మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.

ప్రజా భవన్‌లో భోజనానికి రండి

- మీరు నాకు భోజనం పెట్టారు
- నాతో పాదయాత్రలో నడిచారు
- గంగుబాయితో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ముఖాముఖి



ప్రతిపక్షం ప్రతినిధి, ఆదిలాబాద్, జనవరి 22 : సరిగ్గా రెండు సంవత్సరాల క్రితం గత బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించడమే లక్ష్యంగా సీఎల్పీ నేతగా నాడు భట్టి విక్రమార్క పీపుల్ స్పార్ట్స్ పేరిట పాదయాత్ర చేశారు. ఆ క్రమంలో పాదయాత్ర సందర్భంగా ఆయా గ్రామస్తులు భట్టి విక్రమార్కతో అడుగులో అడుగు వేశారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ప్రజల విజ్ఞప్తులను నమోదు చేసుకున్న డిప్యూటీ సీఎం వాటిని దాదాపు పరిష్కరించారు. ఈ నేపథ్యంలో కృతజ్ఞతలు తెలిపేందుకు తిరిగి తాను పాదయాత్ర ప్రారంభించిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు వచ్చారు. ఈ సందర్భంగా తాను పాదయాత్ర చేస్తున్న క్రమంలో ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరు మండలం దేవుగూడ గూడెంలో లక్ష్మీబాయి, గంగు భాయ్ తనకు ఆనాడు భోజనం పెట్టడమే కాదు, తనతో పాటు కొన్ని కిలోమీటర్ల మేర నడిచారు. ఈ విషయాన్ని గుర్తుపెట్టుకున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తిరిగి ఆ గూడానికి వెళ్లారు. వారందరినీ పిలిచి పక్కన కూర్చోబెట్టుకుని నాటి ఫోటోలు చూపిస్తూ ఆనాటి విషయాలను గుర్తు చేశారు. ఇళ్ల సమస్య, డ్రైనేజీ వాటర్ సమస్య, పట్టాదారు పాస్ పుస్తకాల సమస్యలను, విద్యుత్ పరిష్కరించారు. ఈ నేపథ్యంలో జిల్లా అధికారులతో కలిసి ఆయన గూడెం గ్రామస్తులతో భేటీ అయ్యారు. ఇంకా సమస్యలు ఏమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో అంగన్వాడి కేంద్రం, ప్రభుత్వ పాఠశాలకు శాశ్వత భవనాలు నిర్మించాలని, పీఏసీఎస్ సబ్ సెంటర్ ఏర్పాటు చేయాలని కోరారు. 'ఆరోజు పాదయాత్రలో నాకు గంగుబాయి, లక్ష్మీ భాయ్ ఇద్దరు భోజనం పెట్టారు.. నా చేతిలో చేయి వేసి కొన్ని కిలోమీటర్లు నడిచారు, ప్రభుత్వం వస్తుందని ఆశీర్వదించి పంపారు. వారు ఆశీర్వదించినట్టుగా ప్రజా ప్రభుత్వం వచ్చింది.. వారిద్దరిని హైదరాబాదులో నేను ఉంటున్న ప్రజాభవన్ కు భోజనానికి రావాల్సిందిగా ఆహ్వానిస్తున్నాను. వారు హైదరాబాద్ కు వచ్చేందుకు, తిరిగి వెళ్లేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తానని భట్టి తెలిపారు.



హెలికాప్టర్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

- రాష్ట్ర పంచాయతీ రాజ్ మంత్రి సీతక్క
- మేడారానికి హెలికాప్టర్ సేవలను ప్రారంభించిన మంత్రి

ప్రతిపక్షం ప్రతినిధి, ములుగు, జనవరి 22 : మేడారంలోని సమ్మక్క సారలమ్మను దర్శనం చేసుకోవడానికి వచ్చే భక్తులు హెలికాప్టర్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. గతంలో కాలినడక నుండి కార్ల మీద వచ్చిన భక్తులు నేడు ఎడ్ల బండ్లను వదిలి హెలికాప్టర్ పై రావడానికి సిద్ధమవుతున్నారని అన్నారు. గురువారం జిల్లా కేంద్రానికి సమీపంలోని డిగ్రీ కళాశాల ఆవరణలో తంబి సంస్థవారు ఏర్పాటు చేసిన హెలికాప్టర్ సేవలను సద్వినియోగం చేసుకోవడానికి ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి దనసరి అనసూయ సీతక్క పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ అమ్మవార్లను సత్వరమే దర్శనం చేసుకోవడానికి సమయం వృధా కాకుండా హెలికాప్టర్ సేవలను రాష్ట్ర పర్యాటక శాఖ చేపట్టిందని, హనుమకొండ జిల్లా కేంద్రం నుండి మేడారం వరకు తిరిగి మేడారం నుండి హనుమకొండకు వెళ్లేందుకు అతి తక్కువ ధరలలో ఒక్కొక్కరికి 31 వేల రూపాయల టికెట్ నిర్ణయించిందని, అంతేకాకుండా మేడారం పరిసర ప్రాంతాల్లో హెలికాప్టర్ ద్వారా పర్యటించడానికి 4 వేల 8 వందల రూపాయల టికెట్ ను ఖరారు చేశారని వివరించారు. నేటి నుండి ఈ నెల 31 వరకు వీరి సేవలు కొనసాగుతాయని తెలిపారు. గత 10 సంవత్సరాలుగా సేవలందిస్తున్న థంబి ఏవియేషన్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఈ సర్వీస్ నిర్వహిస్తుంది. బుకింగ్ కోసం ఫోన్: 9676320139, 8530004309, 7660939509 సంప్రదించాలని అన్నారు.

కేటీఆర్‌పై రాజకీయ వేధింపులు ఆపాలి

- రేవంత్ రెడ్డి 'డైవర్షన్ పాలిటిక్స్'పై ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ నిప్పులు



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, జనవరి 22: తెలంగాణ రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం పూర్తిగా కక్ష సాధింపు చర్యలకే పరిమితమైందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ముఖ్యంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కు సిట్ నోటీసులు పంపడం వెనుక ఉన్న కుట్రను ఆయన ఎండగట్టారు. నిన్న హరీష్ రావు ను, నేడు కేటీఆర్ ను టార్గెట్ చేస్తూ సిట్ నోటీసులు పంపడం కేవలం రాజకీయ కక్ష సాధింపు చర్యేనని, బొగ్గు కుంభకోణం మంటల నుండి తన కుర్చీని కాపాడుకోవడానికి రేవంత్ రెడ్డి ఆడుతున్న డ్రామా ఇది అన్నారు. తన ఒంటికి అంటుకున్న 'బొగ్గు మరకలను' కేటీఆర్ కు పంపిన నోటీసు కాగితాలతో తుడిచేసుకోవాలని చూడటం ఆయన వెర్రితనం అని, వేల కోట్ల రూపాయల బొగ్గు స్కామ్ రాష్ట్రాన్ని కుదిపేస్తోందని, దీనిపై ప్రజల్లో జరుగుతున్న చర్చను దారి మళ్లించడానికి, పాతబడి తుప్పు పట్టిన 'ఫోన్ ట్యాపింగ్' అస్త్రాన్ని రేవంత్ రెడ్డి మళ్లీ మళ్లీ ప్రయోగిస్తున్నారని ధ్వజమెత్తారు. రేవంత్ సర్కార్‌లో విచారణ సంస్థలు స్వతంత్రతను కోల్పోయి, కేవలం 'పొలిటికల్ టూల్స్'గా మారిపోయాయని, ముఖ్యమంత్రి రాసిచ్చిన స్క్రిప్ట్ ప్రకారం ప్రతిపక్ష నేతలను స్టేషన్లకు పిలిపించి వేధించడమే ఈ సిట్ల పరమార్థంగా మారిందన్నారు. నిజంగా ప్రభుత్వానికి నిజాయితీ ఉంటే, వేల కోట్ల బొగ్గు కుంభకోణంపై సిట్ ఎందుకు వేయరు? నిందితులకు నోటీసులు ఎందుకు ఇవ్వరు? అని ప్రశ్నించారు. సొంత పార్టీలో అసమ్మతి సెగలు, బయట స్కామ్‌ల భయం నుండి తప్పించుకోవడానికి కేటీఆర్, హరీశ్ రావులపై తప్పుడు కేసులు పెడితే బీఆర్ఎస్ ఊరుకోదన్నారు. ఇప్పటికైనా ఈ చిల్లర రాజకీయాలు, డ్రామాలు కట్టిపెట్టి ప్రజలకు మేలు చేసే పనుల మీద దృష్టి పెట్టాలని దేశపతి శ్రీనివాస్ డిమాండ్ చేశారు.

లోకేష్ పేరిట అన్నదానానికి రూ.44 లక్షల విరాళం

- అభిమానాన్ని చాటుకున్న భాష్యం రామకృష్ణ



ప్రతిపక్షం, తిరుమల, జనవరి 22: యువనేత, మంత్రి నారా లోకేష్ జన్మదినాన్ని ఘనంగా నిర్వహించేందుకు తెలుగు రాష్ట్రాల్లోని ఆయన సన్నిహితులు, అభిమానులు సిద్ధమయ్యారు. వివిధ రూపాల్లో ఆయన పై తమకున్న అభిమానాన్ని చాటుకుంటున్నారు. భాష్యం విద్యా సంస్థల అధినేత రామకృష్ణ యువనేత లోకేష్ పేరిట తిరుమలలో ఒకరోజు అన్నదానానికి రూ. 44 లక్షల విరాళాన్ని అందజేశారు.

కేటీఆర్‌కు నోటీసులు కక్ష్య సాధింపే

- మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, జనవరి 22: కేటీఆర్‌కు ఇచ్చిన నోటీసులు పూర్తిగా కక్ష్య సాధింపు చర్యలేనని మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తీవ్రంగా విమర్శించారు. మోసపూరిత హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్లు పూర్తవుతున్నా ప్రజలకు చేసింది ఏమీ లేదని ఆయన మండిపడ్డారు. ప్రజా పాలన పేరుతో హామీల అమలును పక్కన పెట్టి ప్రజలనే మోసం చేసిందని ఆరోపించారు. అసమర్థ పాలనతో ప్రజల్లో ఏర్పడుతున్న వ్యతిరేకత నుంచి దృష్టి మరల్చేందుకే రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇలాంటి డ్రామాలు ఆడుతోందని తలసాని వ్యాఖ్యానించారు. బొగ్గు కుంభకోణాన్ని బీఆర్‌ఎస్ బయటపెట్టిన 24 గంటలలోపే హరీష్‌రావుకు నోటీసులు జారీ చేయడం రాజకీయ కక్షకు నిదర్శనమని అన్నారు. నోటీసులకు, తాటాకు చప్పుళ్లకు బీఆర్‌ఎస్ భయపడదని స్పష్టం చేసిన తలసాని, ప్రజలకు ఇచ్చిన 420 హామీలను పూర్తిగా అమలు చేసే వరకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటామని హెచ్చరించారు. ప్రజా సమస్యలను పక్కన పెట్టి ప్రతిపక్ష నేతలపై అక్రమ కేసులు, నోటీసులతో పాలన కొనసాగించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ఆయన తెలిపారు.

బడ్జెట్లో ప్రతి అంశం ఉండేలా చూస్తున్నా

- పాదయాత్ర సమయంలో నేను చూసిన మనిషి, ఊరును మరచిపోలేదు
- ఆసిఫాబాద్ జిల్లా మోడీజురి గ్రామ సభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు



ప్రతిపక్షం ప్రతినిధి, ఆదిలాబాద్, జనవరి 22 : బడ్జెట్ పెట్టే సమయంలో తాను పాదయాత్రలో చూసిన, విన్న ప్రజల కష్టాలు తీరేలా ప్రతి అంశాన్ని చూసి పెడుతున్నట్టు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. గురువారం సాయంత్రం ఆసిఫాబాద్ జిల్లా మోడీజూరి గ్రామంలో ఏర్పాటుచేసిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. ఆనాడు పాదయాత్ర సందర్భంగా మోడీ జురి గ్రామానికి చేరుకున్నాను. ఆరోజు ఉగాది పండుగ మూడు రోజులపాటు ఇక్కడే ఉన్నాను. ఏరువాక సందర్భంగా వెంకట్రావు పొలంలో అరకదున్నాను. ఎద్దులకు బెల్లం కొబ్బరి తినిపించాను. ఆ తర్వాత లక్ష్మణరావు పటేల్ ఇంట్లో అందరం కలిసి గుగ్గిల్లి తిన్నాం ఆ తర్వాత భోజనం చేశామని గుర్తు చేసుకున్నారు. తాను పాదయాత్ర చేసిన గ్రామాలు, మనుషులు, సమస్యలు ఏ ఒక్కటి మర్చిపోలేదని తెలిపారు. అందులో భాగంగానే మహిళలు ప్రయాణానికి ఇబ్బందులు పడొద్దని ఉచిత ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాం. 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు పథకాన్ని తీసుకువచ్చాం, ప్రతి వారంలో రెండు రోజులు విద్యుత్ అధికారులు పొలం బాట ప్రజా బాట పేరిట విద్యుత్ సమస్యలు పరిష్కరిస్తున్నారని తెలిపారు. నేను ఆనాడు చూసిన పిల్లలు వారే కదా మన భవిష్యత్తు అనుకున్న అందుకే వారి భవిష్యత్తు ఉజ్వలంగా ఉండేందుకు ప్రపంచ స్థాయి లో మన పిల్లలు పోటీపడే విధంగా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మిస్తున్నామని తెలిపారు. గతంలో మాదిరిగా ఐటీడీఏ లను బలోపేతం చేసేందుకు ఎస్టీ సబ్ ప్లాన్ కింద 17 వేల కోట్లు కేటాయించినట్లు తెలిపారు. మహిళలు బట్టలు కొనుగోలుకు పడే ఇబ్బందులను గుర్తించి నాణ్యమైన చీరలను ఉచితంగా పంపిణీ చేసినట్లు తెలిపారు. దొడ్డు బియ్యం పురుగులతో ఉన్నాయని ఆనాడు సమస్య వివరించగా ప్రజా ప్రభుత్వంలో సన్నబియ్యం ఉచితంగా పంపిణీ చేస్తున్నమని తెలిపారు. ఇవన్నీ కూడా ఆనాడు ప్రజలు చెప్పిన సమస్యలకు సమాధానాలు అని గుర్తు చేశారు.



కూలీల హక్కులను హరించే వీబీ జీ రామ్ జీ చట్టాన్ని రద్దు చేయాలి

- డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, డిల్లీ, జనవరి 22: కూలీల హక్కులను హరించే వీబీజీ రామ్ జీ చట్టాన్ని రద్దు చేసి మహత్మ గాంధీ జాతీయ ఉపాధి హమి చట్టాన్ని యధావిధిగా కొనసాగించే వరకు దేశ వ్యాప్తంగా ఉద్యమం చేస్తామని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి. శంకర్ తెలిపారు. గురువారం డిల్లీలోని జవహార్ భవన్లో జరిగిన నరేగా బచావో సభలో శంకర్ మాట్లాడారు. ఈ సందర్భంగా డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ మాట్లాడుతూ ఉపాధి హమి చట్టం కూలీలకు పని హక్కులు కల్పిస్తే వీబీజీ రామ్ జీ చట్టం కూలీల హక్కులను హరిస్తుందన్నారు. ఉపాధి హమి చట్టం కింద ఎడాదిలో ఎప్పుడైన పని చెసుకునె హక్కు వుండగా వీబీజీ రామ్ జీలో ఎడాదిలో 60 రోజులు పనిని రద్దు చేశారన్నారు. పేరుకే 125 రోజులు పెంచమనే ఎరగా చూపి మొత్తం పని హక్కు లను కాజేశారన్నారు. ఈ సభలో తెలంగాణ నుండి శివలింగం, పులి కల్పన, శారద, దుబాషి సంజివ్, దాసరి ఎగొండ స్వామి, చుంచు రాజేందర్, నరేష్, కుమారస్వామి, నవిన్, చంద్రం తదితరులు పాల్గొన్నారు.

“



ప్రస్తుతం నేను ప్రేమలో ఉన్నా. నేను ప్రేమించిన అబ్బాయి హిందువే. ప్రేమ వల్ల నా లైఫ్‌లో బ్యాలెన్స్ వచ్చింది. ప్రస్తుతం నా లైఫ్ కు ఇదే ప్రయారిటీ. నేను, నా బాయ్ ఫ్రెండ్ స్కూల్ ఫ్రెండ్స్ కాదు, అతడు డాన్స్ బ్యాక్ గ్రౌండ్‌కు చెందిన వ్యక్తి. నేను ర్యాప్, డాన్స్‌లో రాణించడానికి అతడి సపోర్టే కారణం.
- టాలీవుడ్ హీరోయిన్ ఫరియా అబ్దుల్లా

ప్రతిపక్షం
Prathipaksham.in
4
హైదరాబాద్
శుక్రవారం
23.01.2026
@prathipaksham
prathipakshamtvtelugu

అమెరికా పెత్తనానికి ఇక చరమగీతం!

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీరుతో విసిగిపోయిన ఐరోపా సమాఖ్య దేశాలు, అమెరికా నాయకత్వంలోని ప్రపంచ వ్యవస్థకు ముగింపు పలికి ఐక్యంగా వ్యవహరించాలని నిర్ణయించుకున్నాయి. బలవంతుల చట్టానికి లొంగిపోకూడదని, బెదిరింపులకు బదులు గౌరవాన్ని కోరుకుంటున్నామని ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్ అన్నారు. ప్రపంచంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా యూరప్ స్వాతంత్ర్యంపై ఏకాభిప్రాయం పెరిగిందని ఐరోపా కమిషన్ ప్రెసిడెంట్ తెలిపారు. గ్రీన్‌లాండ్ విషయంలో ట్రంప్ వైఖరి నాటో కూటమికి చేటుగా మారుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. గ్రీన్‌లాండ్ విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వైఖరిపై విసిగిపోయిన మిత్రదేశాలు కీలక నిర్ణయం తీసుకున్నాయి. అమెరికా నాయకత్వంలో నడిచే వ్యవస్థకు ముగింపు పలికినట్టు ప్రకటించాయి. యూరోపియన్ నాయకులు ఈ విషయంలో ఐక్యంగా వ్యవహరించాలని నిర్ణయించుకున్నారు. రెండోసారి ట్రంప్ అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే ప్రపంచ రాజకీయ, ఆర్థిక వ్యవస్థలను తలకిందులు చేశారని, ఇకపై ప్రపంచం ఆయనకు భయపడి నడుచుకునే రోజులు పోయాయని వారు భావిస్తున్నారు. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ మాట్లాడుతూ.. 'బలవంతుల చట్టానికి' ఐరోపా సమాఖ్య లొంగిపోకూడదని అన్నారు. అమెరికాకు వ్యతిరేకంగా ఈయూ తన 'యాంటీకోఎర్షన్ ఇన్‌స్ట్రుమెంట్' (వ్యాపారపరమైన ఒత్తిళ్లను ఎదుర్కొనే సాధనం)ను ఉపయోగించాల్సి వస్తుందనేది పిచ్చి ఆలోచన అని ఆయన అభిప్రాయపడ్డారు. 'మేము ఎక్కువ వృద్ధిని, ప్రపంచంలో ఎక్కువ స్థిరత్వాన్ని కోరుకుంటున్నాం.. అంతేకాదు, బెదిరింపులకు బదులుగా గౌరవాన్ని కోరుకుంటాం. మేము క్రూరత్వానికి బదులుగా చట్టబద్ధతను కోరుకుంటాం' అని ట్రంప్ స్విట్జర్లాండ్‌కు చేరుకోవడానికి ముందు దావోస్‌లో జరుగుతోన్న ప్రపంచ ఆర్థిక ఫోరమ్ వార్షిక సమావేశంలో మెక్రాన్ అన్నారు. గాజా శాంతి బోర్డులో చేరడానికి ఫ్రాన్స్ నిరాకరించడంతో వారిపై 200 శాతం టారిఫ్‌లు విధిస్తానని ట్రంప్ హెచ్చరించారుఐరోపా కమిషన్ ప్రెసిడెంట్ ఉర్సులా వాన్ డెర్ లేయెన్, ట్రంప్ పేరును నేరుగా ప్రస్తావించకుండా, ప్రపంచంలో వస్తున్న భారీ మార్పులకు ప్రతిస్పందించాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. ఈ మార్పుల వేగం, పరిమాణం యూరప్‌లో స్వాతంత్ర్యంపై ఏకాభిప్రాయాన్ని పెంచిందని ఆమె అన్నారు. 'నూతన స్వతంత్ర యూరప్‌ను నిర్మించుకోవడానికి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడానికి ఇది సమయం' అని ఆమె తన ప్రసంగంలో తెలిపారు.బెల్జియం ప్రధాన మంత్రి బార్ట్ డి వెవర్ మాట్లాడుతూ.. 27 సభ్య దేశాల ఐరోపా సమాఖ్య ఒక కూడలిలో ఉందని అన్నారు. ఉక్రెయిన్ యుద్ధంలో అమెరికా మద్దతు, ట్రంప్‌ను శాంతింపజేయడానికి ప్రయత్నించిన తర్వాత ఎదుర్కొన్న అతి దారుణమైన పరిస్థితి నుంచి ఎలా బయటపడాలో నిర్ణయించుకోవాలని అన్నారు. 'సంతోషకరమైన సేవకుడిగా ఉండటం ఒక విషయం. దుర్భరమైన బానిసగా ఉండటం మరొకటి' అని ట్రంప్ సుంకాల బెదిరింపుల గురించి డి వెవర్ వ్యాఖ్యానించారు. 'మీరు ఇప్పుడు వెనక్కి తగ్గితే, మీరు మీ గౌరవాన్ని కోల్పోతారు... కాబట్టి మనం ఏకం కావాలి, మీరు లక్ష్మణ రేఖలను దాటుతున్నారని ట్రంప్‌కి చెప్పాలి.. మనం కలిసి నిలబడతామా లేదా విడిపోతామా' అని ఆయన ఒక ప్యానెల్ చర్చలో అన్నారు. అమెరికా నేతృత్వంలోని ప్రపంచ పాలనా వ్యవస్థ 'ఒక విచ్ఛిన్నాన్ని' ఎదుర్కొంటుందని కెనడా ప్రధాని మార్క్ కార్నీ మరింత సూటిగా వ్యాఖ్యానించారు. 'నేను స్పష్టంగా చెబుతున్నాను: మనం పరివర్తనలో కాదు, విచ్ఛిన్నంలో ఉన్నాం... అంతర్జాతీయ నియమాలఆధారిత క్రమం కథ పాక్షికంగా అబద్ధమని మాకు తెలుసు. బలవంతులు సౌకర్యవంతంగా ఉన్నప్పుడు తమను తాము మినహాయించుకుంటారు. వాణిజ్య నియమాలు అమలులో అసమానంగా వ్యవహరిస్తారు... అంతర్జాతీయ చట్టం నిందితుడి లేదా బాధితుడి గుర్తింపును బట్టి వేర్వేరు కఠినత్వంతో వర్తింపజేస్తారు' అని ఆయన అన్నారు.కెనడా ప్రధానిగా కార్నీ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ట్రంప్ వ్యవహారశైలిపై పదేపదే హెచ్చరించారు. ట్రంప్ తన దావోస్ పర్యటనలో గ్రీన్‌లాండ్‌పై చర్చించడానికి నాటో సెక్రటరీజనరల్ మార్క్ రుట్టే, ఇతర పార్టీలతో సమావేశం కావాలని యోచిస్తున్నట్లు తెలిపారు. కానీ, మంది సంబంధిత పార్టీలు ఈ సమావేశానికి హాజరుకాకపోవచ్చు. ట్రంప్‌ను కలవడం ఇష్టం లేక డెన్మార్క్ ప్రధాని దావోస్‌కు హాజరు కాలేదు. మెక్రాన్ కూడా అమెరికా అధినేతను కలవకుండానే స్విట్జర్లాండ్ నుంచి బయలుదేరారు. జర్మనీ, యూకే నేతలు కూడా కలిసే అవకాశం లేదు.గ్రీన్‌లాండ్ స్వాధీనం కోసం.. తాను సైన్యాన్ని ఉపయోగించి బలవంతం చేయబోనని.. ట్రంప్ తేల్చి చెప్పారు. కానీ గ్రీన్‌లాండ్‌ను కొనుగోలు చేసేందుకు తక్షణమే చర్చలు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. గ్రీన్‌లాండ్ విక్రయానికి నిరాకరిస్తున్న డెన్మార్క్, ఐరోపా దేశాలపై ఆర్థిక ఆంక్షల హెచ్చరికలు జారీ చేశారు. గ్రీన్‌లాండ్ ఉత్తర అమెరికాలో భాగమని.. ప్రపంచ రక్షణ కోసం అది అమెరికాకు అవసరమని వాదించారు. ఈ పరిణామం అమెరికాఐరోపా దేశాల మధ్య దౌత్య యుద్ధానికి దారితీసింది.

ప్రతిపక్షం
హైదరాబాద్
శుక్రవారం
23.01.2026

భారత జాతి గౌరవ ప్రతీక నేతాజీ

తన జీవితంలో కొన్ని జయాలతో పాటు, అపజయాలను చవిచూసిన నేతాజి ఆగస్టు 28న గగనసీమకెగిసి కనుమరుగైపోయాడు. వీరి మరణం ఇప్పటికి ఒక రహస్యంగానే మిగిలిపోయింది. జయంతి ఉత్సవాలే కాని వర్ధంతి ఉత్సవాలు లేని ఏకైక నేతగా కీర్తించబడుతున్నాడు. శౌర్యం,ధైర్యం,సంఘటనా కుశలత, ప్రయత్నశీలత, త్యాగం బలిదానాలకు, అత్యుత్తమ ఆదర్శాలతో మాతృదేశమట్టిని పూజిస్తూ స్వతంత్ర భారత నిర్మాణానికి తగిన వ్యూహాత్మక విధానాలతో చేసిన కృషికి గుర్తుగా జాతి గౌరవ ప్రతీకగా నిలిచిన వీరి జయంతిని పురస్కరించుకొని మన దేశంలో ప్రతి సంవత్సరం జనవరి 23న 'పరాక్రమ దివస్' పేరుతో జరుపుకుంటున్నాము.



నరేందర్ రాచమల్ల
9989267462

స్వాతంత్ర్య పోరాటంలో అసాధారణమైన నాయకత్వ లక్షణాలున్న వ్యక్తి ఎవరైనా ఉన్నారంటే అది సుభాష్ చంద్ర భోస్ మాత్రమే అని ఘంటాపథంగా చెప్పుకోవచ్చు.1897 జనవరి 23న ఒడిస్సా లోని కటక్ లో జన్మించిన వీరు కటక్ లోని ప్రొటెస్టెంట్ యూరోపియన్ స్కూల్ లో పాఠశాల విద్య ను అభ్యసించారు. 1916 లో కలకత్తా లోని ప్రెసిడెన్సి కాలేజిలో జాతీయ వాద కార్యకలాపాలలో పాలు పంచుకున్నాడన్న నెపంతో బహిష్కరణ గురైనప్పటికి 1919లో స్కాటిష్ చర్చిస్ కాలేజి నుండి పట్టభద్రులయ్యారు. కలకత్తాలో ఉన్నపుడు తన తల్లికి అమ్మా! ప్రతి రోజు నా మనసులో కొత్త ఆలోచనలు కలుగుతున్నాయి అంటూ తన మనసులోని భావాలను లేఖల ద్వారా తెలియచేసేవాడు. భగవంతుడు మనకు రెండు బలమైన కాళ్లు ఇచ్చాడు.కాని నలభై,యాభై మైళ్లు కూడ నడవడానికి ఇష్టపడం. మనకు రెండు చేతులనిచ్చాడు కానీ వాటిని ఉపయోగించడానికి మనం సిగ్గుపడుతాం. భగవంతుడు మనకు బలమైన శరీరాన్ని ఇచ్చాడు అయినా మనం కష్టపడడానికి ఇష్టపడడంలేదు. మనం జన్మించింది ఉష్ణదేశంలో అయినా మనం ఎండ అంటే భయపడుతాం. సుఖాలకు విలాసాలకు అలవాటుపడి శక్తిని మరచిపోయి కూర్చున్నాం.అని తన మనసులోని భావాలను లేఖ ద్వారా వ్యక్తం చేశాడు. ఎంత సుందరమైన ఆలోచన అంటూ గత జన్మలో మహాత్ముడైన వ్యక్తి మన ఇంటిలో జన్మించాడేమో అని అతని తల్లిదండ్రులు(ప్రభావతి,జానకీనాథ్) అనుకునేవారు. ఉత్తరం వచ్చిన ప్రతిసారి ఆ తల్లిదండ్రులు ఈసారి ఏం రాశాడో అనుకుంటూ ఉత్సుకతను చూపేవారు. మానవసేవే మాధవసేవ అని ప్రపంచానికి చాటిన స్వామి వివేకానంద గ్రంథావళిని చదివి జాతీయవాదం పట్ల ప్రభావితమయ్యారు.నవ వివేకానంద సమూహంలో సభ్యుడిగా చేరి వివాహం చేసుకోకుండా దీన దుఃఖితులకు సేవ చేస్తానని ప్రతిజ్ఞ చేసి ఆధ్యాత్మిక ఉన్నతి సాధిస్తూ,సామాజిక సేవలను అందించడానికి ప్రయత్నం మొదలు పెట్టారు. కుటుంబసభ్యుల ప్రోత్సాహంతో ఇంగ్లాండ్ లోని కేంబ్రిడ్జ్ విశ్వ విద్యాలయంలో శిక్షణ పొంది 1920లో సివిల్ సర్వీస్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించారు. 1921లో భారతదేశంలోని జాతీయ వాద కల్లోలం గూర్చి విన్న తరువాత తన అభ్యర్థిత్వానికి రాజీనామా చేసి భారతదేశానికి తిరిగి వచ్చి మహాత్మాగాంధీ తో కలిసి సహాయ నిరాకరణ ఉద్యమంలో పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతూనే సోషలిజం,కమ్యూనిజం పట్ల ఆకర్షితులయ్యారు. కమ్యూనిజం సోషలిజం కలిస్తే మన దేశంలో జాతీయ వాదం విజయవంతం అవుతుందని భావించారు. యుగాంతం, అనుశీలన్ అనే రెండు విప్లవ సంస్థల మధ్య సమన్వయాన్ని రూపొందించడానికి విశేష ప్రయత్నం చేశారు. శ్రీఆర్య అనే పత్రికలో సంపాదకులుగా ఉంటూ అనేక వ్యాసాలు రాస్తూ స్వాతంత్ర్య సంగ్రామంలో పాల్గొనే వీరులకు ఉత్సాహం, ఉత్తేజాన్ని అందించారు. స్వరాజ్ అనే వారపత్రిక ను స్థాపించారు. లింగసమానత్వం,లౌకికవాదం ఇతర ఉదారవాద సిద్ధాంతాలకు ప్రాధాన్యతను ఇచ్చారు. 1927 లో కాంగ్రెస్ లో ప్రధాన కార్యదర్శిగా భాధ్యత చేపట్టి నెహ్రూ గారితో కలిసి ఉద్యమించారు. 1930 లోశాసనోల్లంఘన ఉద్యమం ప్రారంభమైనపుడు 'బెంగాల్ వలంటీర్స్ 'అనే అండర్ గ్రౌండ్ విప్లవ గ్రూప్ తో సంబంధాలున్నాయని అరెస్టయిన సందర్భంలో జైలులో ఉండే కలకత్తా మేయర్ గా ఎన్నికయ్యారు.తరుచుగా అరెస్ట్ కావడం జైలుకు వెల్లినప్పుడు ఉపవాస వ్రతం స్వీకరించడంతో ఆరోగ్యం క్షీణించి క్షయ వ్యాధితో భాధ్యత పడుతున్న సందర్భంలో భోస్ ను వదిలివేయడం ఉత్తమం అని బ్రిటీష్‌వారు భావించారు.తీవ్ర అనారోగ్యానికి గురైన భోస్ యూరప్ కి వెళ్లడం, కోలుకున్నాక అక్కడి నుండి 1933లో ఐరోపా వెళ్లి అనేక దేశాలు పర్యటించి లెనిన్,ముస్సోలినీ, హిట్లర్ వంటి వారిని కలిసి ప్రపంచ పరిస్థితులను గూర్చి చర్చిస్తూ 'ఇండియన్ స్ట్రగుల్' అనే పుస్తకాన్ని రచించారు. 1936లో భారత్ కి వచ్చిరాగానే అరెస్ట్ కాబడి సంవత్సర కాలం పాటు జైలులోనే గడిపారు. 1938లో జాతీయ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎన్నికై విస్తృత పారిశ్రామికీకరణ విధానాన్ని రూపొందించి జాతీయ ప్రణాళిక సంఘాన్ని ఏర్పాటు చేశారు. కుటీరపరిశ్రమలు మరియు దేశం యొక్క సొంత వనరులు ఉపయోగించడం ద్వారా ప్రయోజనం పొందగలం అనే గాంధీజీ ఆలోచనా విధానంతో ఏకీభవించక 'ఫార్వర్డ్ బ్లాక్' అనే పేరుతో పార్టీ స్థాపించారు. 20 సంవత్సరాలలో 11 సార్లు అరెస్టయిన వ్యక్తి సుభాష్. 1941లో బ్రిటీష్ ప్రభుత్వం వీరి ఉద్యమధాటిని తట్టుకోలేక తప్పనిసరి పరిస్థితులలో గృహనిర్బంధంకు గురైనపుడు జనవరి 26న తన నివాసం నుండి మారువేషంలో తప్పించుకొని కాబుల్ మరియు మాస్కో మీదుగా పయనించి (ఎప్రిల్ మాసంలో) జర్మనికి చేరుకున్నారు. 1942లో బెర్లిన్ లో భారతీయులందరిని సంఘటితపరచి హింది,బెంగాలి,తమిళ్, గుజరాతి,బెంగాలి,తెలుగు తదితర భాషలలో జర్మన్ ప్రాయోజిత ఆజాద్ హింద్ రేడియో నుండి దేశ ప్రజలనుద్దేశించి ప్రసంగించారు.1943 మే లో టోక్యో చేరుకొని, జులై4న తూర్పు ఆసియాలో భారత స్వాతంత్ర్య ఉద్యమానికి నాయకత్వం వహించి భారతీయ యుద్ధ ఖైదీలు మరియు వివిధ ఆగ్నేయాసియా దేశాలలో స్థిరపడిన భారతీయులు తదితరులతో 50,000మంది తో ఆజాద్ హింద్ ఫౌజ్ INA సైన్యాన్ని ఏర్పాటు చేసుకొని పోరాటం కొనసాగించారు. అక్టోబర్ 21న అండమాన్ లో జాతీయ జెండాను ఎగురవేశారు. 1944లో ఫిబ్రవరి 4న బర్మా రాజధాని రంగూన్ నుంచి భారత సరిహద్దులకు చేరుకొని కొహిమా కోట,తిమ్మాపూర్ గుండా పయనిస్తూ బ్రిటీష్ సైన్యంపై దాడి చేసి వారిని బెంబేలెత్తించారు. ఈ సైన్యం ఇమ్మాల్ నగరానికి చేరుకొని సైనిక స్థావరాన్ని ముట్టడించినప్పటికి భారీ వర్షాలతో ముంచెత్తిన వరదల వలన వెనుకంజ వేయక తప్పలేదు. 1945 లో ఆగస్టు 16న భారత జాతీయ సైన్యానికి సహకరించిన జపాన్ సైనిక



దళాలు బ్రిటీష్ సైనిక దళాలకు శరణుజొచ్చడంతో నేతాజి సింగపూర్ ను విడిచి వెళ్తూ ... "తాత్కాలిక ఓటమితో ఆత్మ విశ్వాసాన్ని కోల్పోకుండా.. మనో ధైర్యంతో ముందుకు నడవండి. భారత దేశ భవిష్యత్ ను గురించి సందేహపడకండి. భారతదేశాన్ని సంకెళ్ళతో బంధించి ఉంచగల శక్తి ఈ ప్రపంచంలో లేదు.మన భారత దేశం బానిసత్వం నుంచి త్వరలో విడుదల పొందుతుంది. జైహింద్" అంటూ రేడియో ద్వారా చేసిన ఉద్వేగ పూరితమైన ప్రసంగం భారతీయుల్లో ఆత్మస్థైర్యాన్ని నింపింది.ఆయన అన్నట్లుగానే సరిగ్గా రెండు సంవత్సరాలకు మన దేశానికి స్వాతంత్ర్యం లభించింది. తన జీవితంలో కొన్ని జయాలతో పాటు, అపజయాలను చవిచూసిన నేతాజి ఆగస్టు 28న గగనసీమకెగిసి కనుమరుగైపోయాడు. వీరి మరణం ఇప్పటికి ఒక రహస్యంగానే మిగిలిపోయింది. జయంతి ఉత్సవాలే కాని వర్ధంతి ఉత్సవాలు లేని ఏకైక నేతగా కీర్తించబడుతున్నాడు. శౌర్యం,ధైర్యం,సంఘటనా కుశలత, ప్రయత్నశీలత, త్యాగం బలిదానాలకు, అత్యుత్తమ ఆదర్శాలతో మాతృదేశమట్టిని పూజిస్తూ స్వతంత్ర భారత నిర్మాణానికి తగిన వ్యూహాత్మక విధానాలతో చేసిన కృషికి గుర్తుగా జాతి గౌరవ ప్రతీకగా నిలిచిన వీరి జయంతిని పురస్కరించుకొని మన దేశంలో ప్రతి సంవత్సరం జనవరి 23న 'పరాక్రమ దివస్' పేరుతో జరుపుకుంటున్నాము.

రచయితలకు మనవి

ప్రతిపక్షం ఎడిట్ పేజీ 'ఓపెన్ వాయిస్'కు, సాహిత్య పేజీ 'బహుళ'కు తమ రచనలు పంపగోరువారు ఈ కింది చిరునామాకు పంపించగలరు. వీలును బట్టి ప్రచురించగలము. పుస్తక సమీక్షకులు మా చిరునామాకు పోస్టు ద్వారా గానీ, కొరియర్ ద్వారా గానీ రెండు పుస్తకములు తప్పక పంపించగలరు.

రచనలు పంపాల్సిన చిరునామా

ppbahula@gmail.com
9010223917

ADRESS
Editor,
Prathipaksham,
Telugu Daily
8-1-284/OU/521/7/9,
OU Colony,
Shaikpet,
Hyderabad,
Telangana
500008

యువ సారథికి ముళ్ల కిరీటం..



వెంక గారి భూమయ్య
9848559863

భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షుడిగా 45 ఏళ్ల నితిన్ నబిన్ నియామకం కావడం భారత రాజకీయాల్లో ఒక అనూహ్య మలుపు. జె.పి. నడ్డా వంటి అనుభవజ్ఞుడి స్థానంలో, జాతీయ స్థాయిలో అంతగా పరిచయం లేని ఒక ప్రాంతీయ నేతకు పగ్గాలు అప్పగించడం ద్వారా ఆ పార్టీ అధిష్టానం ఒక అతిపెద్ద తరాల మార్పుకు శ్రీకారం చుట్టింది. అయితే, ఈ మార్పు వెనుక ఎన్ని వ్యూహాలు ఉన్నాయో, అంతకంటే రెట్టింపు సవాళ్లు పొంచి ఉన్నాయి. ఒకవైపు పదిహేనేళ్ల నిరంతర అధికారంతో వచ్చే సహజమైన ప్రభుత్వ వ్యతిరేకతను అధిగమించడం, మరోవైపు 2029 సార్వత్రిక ఎన్నికల లక్ష్యం ఈ రెండింటి మధ్య నూతన సారథి ప్రయాణం అగ్నిపరీక్షను తలపిస్తోంది.

మొదటి మెట్టుపైనే గందరగోళం...
ఇది ముందడుగు కాదా?

నితిన్ నబిన్ నియామకంపై తొలుత రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చ నడిచింది. నడ్డా పదవీకాలం ముగిసి మూడేళ్లు గడుస్తున్నా వారసుడి ఎంపికలో జరిగిన ఆలస్యం, పార్టీలో అంతర్గత ఏకాభిప్రాయ సాధన ఎంత క్లిష్టంగా మారిందో స్పష్టం చేస్తోంది. దేశ వ్యాప్తంగా ఉన్న ఉద్దండ పిండాల వంటి సీనియర్ నేతలను, వివిధ రాష్ట్రాల అనుభవజ్ఞులను 45 ఏళ్ల ఈ యువకుడు ఎలా సమన్వయం చేస్తారనేది కీలకమైన ప్రశ్న. దక్షిణ భారత రాష్ట్రాలైన తమిళనాడు, కేరళలో పార్టీని విస్తరించడం, పశ్చిమ బెంగాల్‌లో కోల్పోయిన వైభవాన్ని తిరిగి తీసుకురావడం ఆయన ముందున్న అతిపెద్ద అడ్డంకులు. కేవలం రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ నేపథ్యం ఉందన్న కారణంతోనే ఈ పదవి దక్కిందా? లేక నిజంగానే ఆయనలో జాతీయ స్థాయిని శాసించే నాయకత్వ లక్షణాలు ఉన్నాయా? అన్న సంశయాలు కార్యకర్తల్లో కలగడం సహజం. అంతేకాకుండా, అస్థిరంగా ఉండే మిత్రపక్షాలను కలుపుకుపోవడం నబిన్ ఎదుర్కోవాల్సిన ప్రధాన సమస్య. ఒకవైపు కూటమి ధర్మాన్ని కాపాడుకుంటూనే, మరోవైపు పార్టీ సొంత బలాన్ని పెంచడం అనేది కత్తిమీద సాము వంటిది. గత అధ్యక్షులు సృష్టించిన రాజకీయ ప్రమాణాలను ఈ యువ నేత అందుకోగలరా లేదా అన్న అయోమయం విశ్లేషకుల్లో స్పష్టంగా కనిపిస్తోంది.

అయినా.. నబిన్
వెనుక ఉన్న అసలు బలం ఇదే!

అయితే, ఈ ప్రతికూలతలను పటాపంచలు చేసే బలమైన నేపథ్యం నితిన్ నబిన్‌కు ఉంది. వరుసగా ఐదు సార్లు శాసనసభ్యుడిగా గెలవడం, బీహార్ మంత్రివర్గంలో రోడ్డు నిర్మాణం, న్యాయశాఖ వంటి కీలక బాధ్యతలు నిర్వహించడం ద్వారా ఆయన తన పరిపాలనా దక్షతను నిరూపించుకున్నారు. విద్యార్థి దశ నుండి యువజన విభాగం వరకు ఆయన చేసిన ప్రయాణం క్షేత్రస్థాయి కార్యకర్తలతో మమేకం కావడానికి తోడ్పడింది. ముఖ్యంగా ఛత్తీస్‌గఢ్ ఎన్నికల్లో పార్టీకి ఊహించని విజయాన్ని అందించడంలో ఆయన పోషించిన పాత్ర, ఆయనలోని వ్యూహకర్తను అధిష్టానం దృష్టిలో నిలబెట్టింది. వివాదరహితుడిగా పేరుండటం వల్ల పార్టీలో అంతర్గత విభేదాలను పరిష్కరించడంలో ఆయన విజయవంతం అయ్యే అవకాశం ఉంది. నబిన్ అనవసర ప్రసంగాలు చేయకుండా, క్రమశిక్షణతో పని చేసే వ్యక్తిగా గుర్తింపు పొందారు. ఆయన నియామకం ద్వారా బిజెపి తన నాయకత్వ వయస్సును గణనీయంగా తగ్గించడమే కాకుండా, నూతన ఉత్తేజాన్ని నింపాలని ప్రయత్నిస్తోంది. ప్రత్యర్థి పార్టీల వృద్ధ నాయకత్వంతో పోలిస్తే, ఒక 45 ఏళ్ల యువకుడిని అధ్యక్షుడిగా నిలబెట్టడం ద్వారా యువత వైపు మొగ్గు చూపుతున్నామనే బలమైన సందేశాన్ని పార్టీ పంపగలిగింది.

2029 లక్ష్యం..గమ్యం చేరుతారా?

నబిన్ ముందున్న ప్రధాన లక్ష్యం 2029 ఎన్నికల నాటికి పార్టీని భవిష్యత్తు సవాళ్లకు సిద్ధం చేయడం. రాబోయే నియోజకవర్గాల పునర్విభజన మరియు మహిళా రిజర్వేషన్ల అమలు వంటి కీలక మార్పుల సమయంలో పార్టీని సురక్షితంగా నడిపించాల్సిన బాధ్యత ఆయనపై ఉంది.



సాంకేతిక యుగంలో ప్రచార వ్యూహాలను మరింత పదును పెట్టడం, ముఖ్యంగా యువ ఓటర్లను ఆకర్షించడంలో నబిన్ కీలక పాత్ర పోషించాల్సి ఉంటుంది. బీహార్ నుంచి ఈ స్థాయికి ఎదిగిన తొలి నేతగా, భవిష్యత్తులో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించే అవకాశం కూడా ఆయనకు మెండుగా ఉంది. మొత్తానికి నితిన్ నబిన్ ఎన్నికతో బిజెపి ఒక సాహసోపేతమైన యువ ప్రయోగం చేసింది. నాయకులు మారినా సిద్ధాంతాలు మారవని పెద్దలు చెప్పినట్లు, నబిన్ ఆ సిద్ధాంతాలను ఎంత వేగంగా ప్రజల్లోకి తీసుకువెళ్తారన్నదే ముఖ్యం. రాబోయే ఎన్నికలే నూతన సారథికి అసలైన గీటురాయి. ఈ అగ్నిపరీక్షలో ఆయన నెగ్గితే, పార్టీలో యువ నాయకత్వానికి ఒక కొత్త చరిత్ర మొదలవుతుంది.


(వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్)

జ్ఞానం, సృజన, శుభారంభాలకు సంకేతమైన
పవిత్ర పర్వదినం వసంత పంచమి



వేల్పుల మహేందర్
99127 75834

భారతీయ ఆధ్యాత్మిక సంప్రదాయాలలో వసంత పంచమి ఒక అత్యంత పవిత్రమైన, విశిష్టమైన పండుగగా ప్రత్యేక స్థానం సంపాదించుకుంది. హిందూ పంచాంగం ప్రకారం మాఘ మాసం శుక్ల పక్షం పంచమి తిథి నాడు ఈ పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారు. 2026 సంవత్సరంలో వసంత పంచమి జనవరి 23వ తేదీ శుక్రవారం రోజున జరుపబడనుంది. ఈ రోజు విద్య, జ్ఞానం, కళలు, సృజనకు అధిష్ఠాత్రి అయిన శ్రీ సరస్వతి దేవి ఆవిర్భావ దినంగా ప్రసిద్ధి చెందింది. అదే సమయంలో శీతాకాలం ముగిసి వసంత ఋతువు ఆరంభమయ్యే శుభసూచనగా కూడా వసంత పంచమిని భావిస్తారు. అందుకే ఈ పండుగను 'శ్రీ పంచమి' అని కూడా పిలుస్తారు. పురాణాల ప్రకారం సృష్టి ప్రారంభ దశలో ప్రపంచం నిశ్శబ్దంగా, నిస్తేజంగా ఉందని నమ్మకం. ఆ సమయంలో బ్రహ్మదేవుడు తన కమండలం నుంచి జలాన్ని సృష్టించగా, ఆ నీటినుంచి వీణధారిణిగా సరస్వతి దేవి ఆవిర్భవించిందని విశ్వాసం. అమ్మ వీణ నుంచి వెలువడిన మధుర నాదం వల్ల ప్రపంచానికి శబ్దం, జ్ఞానం, చైతన్యం లభించాయని పురాణ గాథలు చెబుతాయి. ఆ దినం నుంచే వసంత పంచమి రోజున సరస్వతి దేవిని పూజించే సంప్రదాయం ఆరంభమైందని విశ్వాసం. సూర్యోదయ తిథి ప్రకారం జనవరి 23వ తేదీన వసంత పంచమి జరుపుకోవాలని పండితులు సూచిస్తున్నారు. ఈ రోజున ఉదయం 7 గంటల 15 నిమిషాల నుంచి మధ్యాహ్నం 12 గంటల 33 నిమిషాల వరకు సరస్వతి పూజకు అత్యంత శుభమైన ముహూర్తంగా భావిస్తారు. ఈ సమయంలో సరస్వతి పూజతో పాటు అక్షరాభ్యాసం, విద్యారంభం, నూతన వ్యాపార ప్రారంభం, గృహప్రవేశం, అన్నప్రాసనం వంటి అనేక శుభకార్యాలు చేయడం శ్రేయస్కరమని శాస్త్రాలు పేర్కొంటాయి. వసంత పంచమి రోజున అక్షరాభ్యాసానికి ప్రత్యేక ప్రాముఖ్యత ఉంది. చిన్నారుల విద్యా ప్రయాణానికి ఇది అత్యంత శుభారంభంగా భావించబడుతుంది. అందుకే తెలంగాణలోని నిర్మల్ జిల్లా బాసర క్షేత్రానికి ఈ రోజున వేలాది మంది భక్తులు తమ పిల్లలతో తరలివచ్చి అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. విద్యాభివృద్ధి, బుద్ధి వికాసం కోసం ఈ రోజు చేసిన ప్రార్థనలు ఫలిస్తాయని ప్రజల



నమ్మకం. వసంత పంచమి అనగానే ముందుగా గుర్తుకు వచ్చేది పసుపు రంగు. పసుపు రంగు వసంత ఋతువు ఉల్లాసానికి, శుభతకు, జ్ఞానానికి, సానుకూల శక్తికి ప్రతీకగా భావిస్తారు. ఈ కారణంగానే ఈ రోజున పసుపు రంగు దుస్తులు ధరించడం, పసుపు పుష్పాలతో సరస్వతి దేవిని అలంకరించడం ఆనవాయితీగా కొనసాగుతోంది. చక్కెర పొంగలి, పులిహోర, పసుపు రంగు తీపి వంటకాలను దేవికి నివేదించడం కూడా సంప్రదాయంగా వస్తోంది.ఇంట్లో సరస్వతి దేవి విగ్రహం లేదా చిత్రాన్ని ప్రతిష్ఠించి, భక్తిశ్రద్ధలతో పూజ నిర్వహించాలి. "యా కుందేందు తుషార ధవలా" అనే సరస్వతి వందనాన్ని పఠించిన అనంతరం "ఓం ఐం సరస్వత్యై నమః" అనే మంత్రాన్ని జపించాలి. ఈ మంత్ర జపం వల్ల విద్య, బుద్ధి, ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెరుగుతాయని విశ్వాసం. వసంత పంచమి కేవలం విద్యా లేదా వివాహ, గృహప్రవేశ పండుగ మాత్రమే కాదు. ఇది జ్ఞానానికి పునాది వేసే దినం, సృజనకు ప్రేరణనిచ్చే పర్వదినం, ప్రతి శుభారంభానికి దారి చూపే పవిత్ర సందర్భం. ఈ వసంత పంచమి - 2026 ప్రతి ఒక్కరి జీవితంలో విజ్ఞానం, విజయం, శాంతి, ఆనందం నింపాలని ఆకాంక్షిద్దాం.
శుభ వసంత పంచమి శుభాకాంక్షలు.

(వ్యాసకర్త అధ్యాపకులు)

ప్రాంతీయం




మేడారం జాతరకు రూ. 165 కోట్లతో రహదారులు

- 1,418 ఎకరాల విస్తీర్ణంలో పార్కింగ్

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, జనవరి 22: మేడారం సమ్మక్క, సారలమ్మ గిరిజన జాతర ప్రారంభానికి మరో ఐదు రోజులు మాత్రమే ఉంది. ఇప్పటికే మేడారానికి ప్రతీ రోజూ లక్షలాది మంది భక్తులు ముందస్తు మొక్కులకై తరలి వస్తున్నారు. కేవలం, జాతర జరిగే జనవరి 28 వతేదీ నుండి 31 తేదీ మధ్యలోనే దాదాపు కోటిన్నరకు పైగా భక్తులు హాజరవుతారని అంచనా వేసినందున, మేడారానికి వచ్చే ప్రధాన రహదారులు, జాతీయ రహదారులు, రోడ్లు, భవనాల శాఖ నిర్వహణలో ఉండే రహదారులతో పాటు పంచాయితీ రాజ్ శాఖ ద్వారా నిర్వహించే రహదారులన్నింటిని పూర్తిస్థాయిలో రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి చేసింది. వివిధ శాఖల క్రింద మేడారానికి దారితీసే 39 ప్రధాన రహదారులు ఉన్నాయి. ఇవే కాకుండా, మరో 10 రోడ్లను, మూడు కల్వర్టులను కొత్తగా నిర్మించారు. జాతీయ రహదారులకు చెందిన 8 రహదారుల పటిష్టత, మరమ్మతు, నూతన బ్రిడ్జిల నిర్మాణాన్ని పూర్తి చేశారు. వీటిలో, ప్రధానంగా, కటాక్షపూర్, మల్లంపల్లి లవద్ద నూతన బ్రిడ్జిల నిర్మాణం పూర్తి చేశారు. రోడ్లు, భవనాల శాఖ ద్వారా దాదాపు రూ. 102 కోట్ల వ్యయంతో రహదారుల నిర్మాణం రికార్డు సమయంలో పూర్తిచేశారు. ఈ శాఖ క్రింద ఉన్న పస్రా నుండి భూపాల పల్లి వరకు 33 కిలోమీటర్లు, తాడ్వాయి నుండి నార్లాపూర్ వరకు 20 కిలోమీటర్లు, చిన్నబోయినపల్లి నుండి ఊరట్టం వరకు 23 కి.మీ. రహదారుల పటిష్టత, రీకార్పెటింగ్ చేపట్టారు. వీటితోపాటు, చిలకలగుట్ట సమ్మక్క మార్గం నుండి గద్దెల వరకు, సమ్మక్క టెంపుల్ వద్ద, పోలీస్ క్యాంపు ల వద్ద బారికేడింగ్ ఏర్పాట్లు చేశారు. పోలీస్ క్యాంపు వద్ద హెలీపాడ్స్ నిర్మాణం, మరమత్తులు చేపట్టడం జరిగింది. పంచాయితీ రాజ్ ఇంజనీరింగ్ శాఖ ద్వారా రూ. 52.21 కోట్ల వ్యయంతో 84 పనులు చేపట్టడం జరిగింది. ఇదేకాకుండా, ట్రైబల్ వెల్ఫేర్ ఇంజనీరింగ్ శాఖ ద్వారా రూ. 8.08 కోట్ల వ్యయంతో 3 కొత్త భవనాల నిర్మాణం, 29 ప్రస్తుత భవనాల మరమత్తులు, 5 కొత్త రోడ్ల నిర్మాణం తదితర పనులను చేపట్టి పూర్తి చేశారు.

1,418 ఎకరాల విస్తీర్ణంలో పార్కింగ్ సదుపాయం

మేడారం జాతరకు లక్షల సంఖ్యలో వచ్చే వాహనాల పార్కింగ్ కు ప్రభుత్వం పెద్దఎత్తున ఏర్పాట్లు చేసింది. ప్రధానంగా. 43 ప్రాంతాల్లో 1418 ఎకరాల విస్తీర్ణంలో పార్కింగ్ సదుపాయాలను కల్పించారు. వీటిలో, అటవీ శాఖకు చెందిన 15 ప్రాంతాలలో 235 ఎకరాల్లో, ట్రైబల్ వెల్ఫేర్, పట్టా భూములకు చెందిన 24 ప్రాంతాల్లో 1164 ఎకరాల్లో, ప్రభుత్వ భూములకు చెందిన 3 ప్రాంతాల్లో 19 ఎకరాల్లో పార్కింగ్ సదుపాయంతో పాటు ఇక్కడ ఉండే భక్తులు, డ్రైవర్లకు తాగునీటి సౌకర్యం, టాయిలెట్ తదితర సౌకర్యాలను కల్పించారు.



పౌర సదుపాయాలపై సీఎం ప్రత్యేక దృష్టి

- హైదరాబాద్ ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్
- జూబ్లీ హిల్స్ లో చిల్డ్రన్ పార్క్ ప్రారంభించిన మంత్రి

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, జనవరి 22: గ్రేటర్ హైదరాబాద్ నగరంలో పౌర సదుపాయాల అభివృద్ధి సీఎం అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని హైదరాబాద్ ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. గురువారం సాయంత్రం జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్ 45 లో 3.10 కోట్ల రూపాయలతో అభివృద్ధి చేసిన జీహెచ్ఎంసీ చిల్డ్రన్ ప్లే పార్క్ ను ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, మేయర్ గద్వాల్ విజయ లక్ష్మి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, జోనల్ కమిషనర్ ప్రియాంక అలా తో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్ 44, 45 మధ్యలో లో ఖాళీగా ఉపయోగంలో లేకుండా ఉన్న ప్రాంతం ఒక ఎకరా 40 గుంటల్లో సీఎం సూచనల మేరకు మేయర్ అధ్వర్యంలో చిల్డ్రన్ ప్లే పార్క్ ను జీహెచ్ఎంసీ అద్భుతంగా అభివృద్ధి చేసిందన్నారు. పార్క్ ఏర్పాటుతో ఈ ప్రాంతంలో నివసించే ప్రజలకు, పిల్లలకు ఆహ్లాద వాతావరణంతో పాటు వినోదానికి ఉపకరిస్తుందన్నారు. దీనిని ప్రజలంతా ఉపయోగించుకోవాలన్నారు. సీఎం హైదరాబాద్ అభివృద్ధికి సంబంధించిన అన్ని రకాల ప్రణాళికలతో కార్యక్రమాలు చేస్తున్నారన్నారు. ముఖ్యంగా హైదరాబాద్లో ఇన్క్లూజివ్ గ్రోత్, ఇన్ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధి చేయడంపై స్పెషల్ ఫోకస్ పెట్టారని తెలిపారు. మేయర్ గద్వాల్ విజయలక్ష్మి మాట్లాడుతూ సమీప ప్రాంత ప్రజలు ఉదయం, సాయంత్రం సేదదీరెందుకు, వినోదం, రిక్రియేషన్, వ్యాయామం, క్రీడలు ఆడుకునేందుకు ప్రజలకు జీహెచ్ఎంసీ పార్క్ ఎంతగానో పకరిస్తుందన్నారు. అనంతరం ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, మేయర్ గద్వాల విజయ లక్ష్మీతో కలిసి మంత్రి టెన్నిస్ ఆడారు.



నాపై తప్పుడు ప్రచారం చేస్తున్నారు

- క్షమాపణ చెప్పకపోతే నిరాహార దీక్షకు కూర్చుంటా..
- నాగర్ కర్నూల్ --ఎంపీ మల్లు రవి

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్ జనవరి 22: తనపై కావాలనే కొందరు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని.. వారు క్షమాపణ చెప్పకపోతే.. నిరాహార దీక్షకు కూర్చుంటానని.. నాగర్ కర్నూల్ ఎంపీ డా.మల్లు రవి స్పష్టం చేశారు. బుధవారం న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఆయన విలేఖరులతో మాట్లాడారు. బుధవారం అలంపూర్‌లో శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు జరిగిన సందర్భంగా.. ఎంపీగా నేను, ఎమ్మెల్యేగా విజయుడు ఇద్దరం కలిసి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నాం. ఎస్బీఐ ద్వారా ఐదు గ్రామాలను దత్తత తీసుకొని.. ఆ గ్రామాల్లోని స్కూళ్లలో సైన్స్ ల్యాబ్, ఆడపిల్లలకు సైకిళ్లు, ఫ్రీ ఆర్మీ సెలక్షన్ ట్రైనింగ్ క్యాంప్స్ వంటివి ఏర్పాటు చేయాలనుకున్నాం. స్థానిక ఎమ్మెల్యేతో కలిసి ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం వరకు కలిసి ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నాను. విజయుడు ఎమ్మెల్యేగా, నేను ఎంపీగా ఆ ప్రాంతంలోకి పోయినప్పుడు.. అన్నదమ్ముల్లాగా ఉంటున్నాం అని అన్నారు. విజయుడు ఎస్సీ సామాజిక వర్గం నుంచి ఎమ్మెల్యే అయ్యారు. నేను కూడా అదే సామాజిక వర్గం నుంచి ఎంపీగా ఎన్నికయ్యానని అన్నారు. మేమిద్దరం గెలిచిన దగ్గర నుంచి ప్రజల కోసం పనిచేయాలని ఆలోచనతోనే ఉన్నామని, నేను ఏ కార్యక్రమానికి వెళ్లినా.. ఆ కార్యక్రమంలో విజయుడు పాల్గొంటారని అన్నారు. నిన్న ఒక సందర్భంలో వడ్డేపల్లి మున్సిపాలిటీలో ఫౌండేషన్ వేసేటప్పుడు.. నేను కాంగ్రెస్ పార్టీ తరపున వెళ్లాను. నా వెంట మా పార్టీ నాయకులు వచ్చారు. అక్కడికి మాజీ ఎమ్మెల్యే, మార్కెట్ కమిటీ చైర్మన్, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్, ఇంకా ఇతర కాంగ్రెస్ పార్టీ నాయకులు కూడా వచ్చారు. అదే కార్యక్రమానికి బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే వచ్చారు. వారి నాయకులూ కూడా ఆయనతో వచ్చారు. ఆ కార్యక్రమం తర్వాత మళ్లీ కూడా ఇలాగే కొబ్బరికాయలు గుంజుకున్నారు. అక్కడ ఇరు పార్టీల నాయకులు ఎవ్వరు ఆగలేదు. పోలీసులు కాస్త దూరంగా ఉన్నారు. మరో రెండు మూడు నిమిషాలు అదే పరిస్థితి ఉంటే.. ఇరువర్గాలు కొట్టుకునే పరిస్థితి తలెత్తేది. ఇరు వర్గాల మధ్య గొడవ జరిగితే.. రక్తపాతం జరిగేది. దానిని ఆపడానికి నేను పోలీసులను పిలిచి కాస్త గట్టిగా మాట్లాడాను. అక్కడ గొడవ సద్దుమనడానికే నేను అలా మాట్లాడాల్సి వచ్చింది. గొడవ జరగకుండా ఉండడానికి.. ఎమ్మెల్యేను పక్కకు తీసుకెళ్లాను. అంతకుమించి ఆయన్ను ఒక్క మాట కూడా అనలేదు. దూషించలేదు. కొట్టలేదు. కేవలం కేవలం గొడవ జరగకుండా ఉండడానికే నేను ప్రయత్నం చేశాను. అంతకుమించి వేరే ఉద్దేశం లేదని ఆయన అన్నారు. ఈ ఘటనను కొందరు వక్రీకరించారు. నేను కానీ, ఎమ్మెల్యే విజయుడుగాని ప్రజాస్వామ్య యుతంగా, రాజ్యాంగం ప్రకారం పని చేస్తున్నాం. నేను ఎమ్మెల్యేను తిట్టింది గాని, కొట్టింది గాని అస్సలు లేదు. కానీ నేను ఎమ్మెల్యే పై భౌతిక దాడి చేశానని కేటీఆర్ ట్వీట్ చేశారు. 'నా సమక్షంలో ఎమ్మెల్యే పైన దాడి జరిగితే అది మంచిది కాదని పక్కకు తీసుకెళ్లాను అంతే. నా ప్రతిష్ట, కాంగ్రెస్ పార్టీ ప్రతిష్ట చెడగొట్టడానికి తిట్టకపోయినా తిట్టినట్టు.. కొట్టకపోయినా కొట్టినట్టు.. దళితుడి మీద దాడి చేసినట్టు తప్పుడు సమాచారాన్ని వివిధ మాధ్యమాల ద్వారా ప్రచారం చేశారు. తప్పుడు ప్రచారం చేసిన వారందరూ మాకు క్షమాపణ చెప్పాలి. నాకు, సీఎం రేవంత్ రెడ్డికి క్షమాపణ చెప్పకపోతే నేను కాంగ్రెస్ పార్టీ అధిష్టానం అనుమతి తీసుకొని.. క్షమాపణ చెప్పేంతవరకు గాంధీ మార్గంలో నేను నిరాహార దీక్షకు కూర్చుంటాను' అని అన్నారు.




'ప్రతిపక్షం' క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, జనవరి 22: ప్రతిపక్షం తెలుగు దినపత్రిక 2026 క్యాలెండర్ ను రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆవిష్కరించారు. గురువారం మినిస్టర్ క్వార్టర్స్ లో జరిగిన ఆవిష్కరణ కార్యక్రమంలో మంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ ప్రతిపక్షం దినపత్రిక ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఎన్నో సమస్యలను తమ దృష్టికి తెచ్చే ప్రయత్నం చేస్తున్నదని, ప్రజల పక్షాన ప్రభుత్వానికి ఒక 'ప్రతిపక్షం' లా వ్యవహరిస్తున్నదని అన్నారు. ఇటీవల మృతిచెందిన పత్రిక ఎడిటర్ మహమ్మద్ ఫజుల్ రహమాన్ తో తనకున్న సాన్నిహిత్యాన్ని ఆయన గుర్తు చేసుకున్నారు. అనంతరం బంజారాహిల్స్ రోడ్ నం 7లో జరగిన మరో కార్యక్రమంలో ఫిలిం ఫెడరేషన్ సౌత్ రీజియన్ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఫిలిం సొసైటీ అధ్యక్షులు పొన్నం రవిచంద్ర 'ప్రతిపక్షం' క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫజుల్ రహమాన్ సారథ్యంలో గత రెండేండ్లుగా వెలువడుతున్న పత్రిక ఆయన మరణానతరం వారి కుమారులు నిరాటంకంగా వెలువరించడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పత్రిక పబ్లిషర్ అజీజ్, డైరెక్టర్లు అఫ్జల్, షఫీ తదితరులు పాల్గొన్నారు.



జీహెచ్ఎంసీ కార్యాలయంలో

కాన్సర్ పరీక్షలు

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, జనవరి 22 : జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం లో కాన్సర్ పై అవగాహన, వ్యాధిని ముందుగా గుర్తించుట, కాన్సర్ వ్యాధికి ముందుగానే చికిత్సకు సంభందించిన పరీక్షలను గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమం లో 300 కు పైగా పురుషులు, మహిళలు ఉచిత పరీక్షలు చేయించుకున్నారు. కార్కినోస్ ప్రైవేట్ హెల్త్ కేర్ లిమిటెడ్ వారి ద్వారా ఈ కార్యక్రమం చేపట్టామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్. కె.పద్మజ, ప్రధాన వైద్య ఆరోగ్య అధికారి గారి ఆధ్వర్యం లో నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమ నిర్వాహణ పట్ల జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం సిబ్బంది సంతోషం వ్యక్తం చేశారు.

బీసీ గురుకులాల్లోని విద్యార్థుల్లో ఉపాధి నైపుణ్యం

- నాయకత్వ లక్షణాలు పెంపొందించేదుకు శ్రీకారం
- నిర్మాణ్ సంస్థతో ఎంజేపీ ఒప్పందం
- ఎంజేపీ కార్యదర్శి బడుగు సైదులు



ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, జనవరి 22 : బీసీ గురుకుల విద్యాసంస్థల్లో చదివే విద్యార్థుల్లో నాయకత్వలక్షణాలు పెంపొందించేలా ఉపాధి నైపుణ్యాలు పెంపొందించడంతో పాటు నాయకత్వ లక్షణాలు మెరుగుపరిచేలా అవగాహన కల్పించేందుకు వీలుగా నిర్మాణ్ సంస్థ ముందుకు రావడం అభినందనీయం అని మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాసంస్థల కార్యదర్శి బడుగు సైదులు అన్నారు. బీసీ గురుకుల విద్యార్థుల్లో విద్యా నైపుణ్యం, నాయకత్వ లక్షణాలు పెంపొందించే లక్ష్యంతో నిర్మాణ్ ఎన్జీవోతో ఒక అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ సందర్భంగా కార్యదర్శి మాట్లాడుతూ ఈ సంస్థ అందించే సహకారంతో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడంతో పాటు ఉపాధి నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలు పెంపొందించుకుని సమగ్రాభివృద్ధి సాధించాలని ఆయన ఆకాంక్షించారు. గత రెండు దశాబ్దాలుగా ఈ సంస్థ జాతీయ స్థాయిలో విద్య, నైపుణ్య అభివృద్ధి, ఆరోగ్యం, మానసిక వికాసం, సామాజిక నాయకత్వం వంటి రంగాల్లో పనిచేస్తుంది. దేశంలోని 26 రాష్ట్రాల్లో లక్షలాది మంది విద్యార్థులను ప్రభావితం చేసిందని నిర్మాణ్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకురాలు సీఈఓ మయూర్ పట్నాల అన్నారు. బీసీ గురుకుల విద్యార్థుల శ్రేయస్సు కోసం పనిచేసే అవకాశం రావడం ఆనందంగా ఉన్నారు. ఒప్పందంపై సంతకం చేసే కార్యక్రమంలో డాక్టర్ సుచిత్ర, శాంత కుమార్ చిలుముల, ఉషాకర్ కీర్తి తదితరులు పాల్గొన్నారు.

హుస్నాబాద్ విలీనంపై మంత్రి పొన్నం రాజకీయ డ్రామా

- ప్రజల ఆకాంక్షలకు విరుద్ధంగా విలీనానికి యత్నం
- రెండేళ్లుగా హుస్నాబాద్‌లో అభివృద్ధి శూన్యం
- కాంగ్రెస్ బాకీలపై ఇంటింటి ప్రచారం
- హుస్నాబాద్ మున్సిపాలిటీపై గులాబీ జెండా ఎగరవేస్తాం
- మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్ కుమార్



ప్రతిపక్షం, హుస్నాబాద్, జనవరి 22 : తన రాజకీయ లబ్ధి కోసమే హుస్నాబాద్‌ను కరీంనగర్‌లో విలీనం చేయడానికి హుస్నాబాద్ ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ కుట్రలు చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్ కుమార్ తీవ్రంగా ఆరోపించారు. ఇలాంటి ప్రయత్నాలు ప్రజల మధ్య చిచ్చు పెట్టడానికే తప్ప ప్రజా ప్రయోజనాలకు కావని విమర్శించారు. గురువారం హుస్నాబాద్ పట్టణంలో హనుమకొండ రోడ్డు నుంచి సిద్దిపేట రోడ్డు వరకు స్థానిక నాయకులతో కలిసి ఇంటింటికి తిరిగి కాంగ్రెస్ బాకీ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేయాలని ప్రజలను కోరారు. ఈ సందర్భంగా సతీష్ కుమార్ మాట్లాడుతూ.. గతంలో హుస్నాబాద్, కోహెడ, అకన్నపేట మండలాలను ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా, గ్రామసభల ద్వారా తీసుకున్న అభిప్రాయాల మేరకే శాస్త్రీయంగా సిద్దిపేట జిల్లాలో కలిపామని గుర్తు చేశారు. ఏ జిల్లాలో ఉన్నా ఆర్డీఓ, ఏసీపీ కార్యాలయాల ఏర్పాటు కోసం కాంగ్రెస్ నాయకులే ధర్నాలు చేశారని, ఆ సమయంలో తానే స్వయంగా హామీ ఇచ్చిన విషయాన్ని కాంగ్రెస్ నేతలు మరిచిపోయారా? అని ప్రశ్నించారు. కరీంనగర్‌లో విలీనం కావాలని ప్రజలు ఎవరూ కోరుకోవడం లేదని, మంత్రి పొన్నం తన ప్రయోజనం కోసం మాత్రమే కొత్త వివాదాన్ని తెరపైకి తెస్తున్నారని ఆరోపించారు. మరోసారి ఈ అంశాన్ని లేవనెత్తితే ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. అలాగే గత రెండేళ్లుగా అభివృద్ధి చేస్తానని చెప్పిన మంత్రి ఇప్పటివరకు హుస్నాబాద్‌లో పూర్తిచేసిన ఒక్క పనిని కూడా చూపలేదని విమర్శించారు. రింగురోడ్డు, ఇతర ప్రాజెక్టులపై మాటలు తప్ప చేతల్లో ఫలితం లేదన్నారు. 250 పడకల ఆస్పత్రి పేరుతో పక్కాగా ఉన్న పాత భవనాన్ని కూల్చివేయడం బాధాకరమన్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో ఉచిత బస్సు ప్రయాణం తప్ప మరే హామీ అమలుకాలేదని విమర్శించారు. ప్రజలకు ఇచ్చి ఎగ్గొట్టిన హామీలపై అవగాహన కల్పించేందుకే కాంగ్రెస్ బాకీ కార్డులను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ప్రజలకు బాకీ పడ్డ సొమ్మును కాంగ్రెస్ ప్రభుత్వం చెల్లించాల్సిందేనని డిమాండ్ చేశారు. వచ్చే మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి చెందిన కారు గుర్తుకు ఓటు వేసి మూడోసారి హుస్నాబాద్ మున్సిపాలిటీలో గులాబీ జెండాను ఎగరవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఎన్నికలు రాగానే కాంగ్రెస్ కుట్ర రాజకీయాలు

- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు రజితా రెడ్డి



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదారాబాద్ , జనవరి 22: ఎన్నికలు సమీపిస్తున్న ప్రతిసారి కాంగ్రెస్ నేతలు ఏదో ఒక కుట్రపూరిత ధోరణితో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నాలు చేస్తున్నారని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకురాలు ఎం. రజితా రెడ్డి తీవ్రంగా విమర్శించారు. ఈ మేరకు ఆమె గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. గతంలో ఫార్ములా ఈ రేసు అంశాన్ని వివాదంగా మార్చి ప్రజల చేత చీదరించుకున్న కాంగ్రెస్, కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగిందంటూ ఘోష్ కమిషన్ ఏర్పాటు చేసి చివరకు వారే ఖంగుతిన్నారని అన్నారు. ఇప్పుడు మున్సిపల్ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో కొత్తగా ఫోన్ ట్యాపింగ్ అంశాన్ని తెరపైకి తెచ్చి ప్రజల దృష్టిని అసలు సమస్యల నుంచి మరల్చేందుకు ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు, అవినీతులు బయటపడుతున్న తరుణంలో వాటినుంచి తప్పించుకోవడానికే ఈ రకమైన ఆరోపణల రాజకీయాలు చేస్తోందని తెలిపారు. కాంగ్రెస్ కుంభకోణాలను బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీష్ రావు ప్రజల ముందుకు తీసుకొస్తుండటంతో వాటిని దాచిపెట్టేందుకే కాంగ్రెస్ ఈ విధమైన ఎత్తుగడలు వేస్తోందని రజితా రెడ్డి మండి పడ్డారు. ఎంతగా ఇబ్బందులు పెట్టినా, ఎన్ని కుట్రలు చేసినా బీఆర్ఎస్ ప్రజల పక్షానే నిలబడుతుందని స్పష్టం చేశారు. మా నాయకులు కేటీఆర్, హరీష్ రావు ఉద్యమ సింహాలని, కాంగ్రెస్ నక్క వేషాలకు భయపడే వారు కాదని కాంగ్రెస్ నేతలు గుర్తుంచుకోవాలని ఆమె హెచ్చరించారు. ప్రజలే అన్నిటికీ తుది తీర్పు చెప్పబోతున్నారని అన్నారు.



గతంలో బీఆర్ఎస్, ఇప్పుడు కాంగ్రెస్‌పాలనలో సింగరేణిపై ఆర్థిక విధ్వంసం కొనసాగుతోంది. నైనీ కోల్ బ్లాక్ టెండర్లపై కొందరు సీబీఐ దర్యాప్తు కోరుతున్నారు. కానీ రాష్ట్ర అంశాలను సీబీఐ దర్యాప్తు చేయకూడదని గత ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానించింది. అప్పుడు సీబీఐ ఎందుకు గుర్తుకు రాలేదు?. కోల్ బ్లాక్స్ వేలం నిర్వహణకు కేంద్రం సిద్ధంగా ఉంది.

- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

ప్రాంతీయం



నగర భవిష్యత్తుకు వికేంద్రీకృత జల నిర్వహణే కీలకం

- డీసెంట్రలైజ్డ్ వాటర్ మేనేజ్‌మెంట్‌పై దృష్టి
- ఐజీబీసీతో కలిసి వ్యూహాత్మక చర్చలు
- జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్

ప్రతిపక్షం సిటీబ్యూరో, హైదరాబాద్, జనవరి 22 : హైదరాబాద్ నగరానికి దీర్ఘకాలిక జల భద్రత, వరదల నియంత్రణ, పర్యావరణ పరిరక్షణలో వికేంద్రీకృత జల నిర్వహణ కీలకమని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ స్పష్టం చేశారు. జీహెచ్ఎంసీ, 'ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్'తో కలిసి సీఐఐ-సోహ్రాబ్జీ గ్రీన్ బిజినెస్ సెంటర్‌లో గురువారం నీటి విడుదల మురుగు నీరు, వర్షపు నీటి నిర్వహణపై స్టేక్ హోల్డర్ ఇంటరాక్షన్ & బ్రెయిన్‌స్టార్మింగ్ సెషన్ నిర్వహించింది.ఈ సమావేశంలో డీసెంట్రలైజ్డ్ వాటర్ మేనేజ్‌మెంట్, మురుగు నీరు, వర్షపు నీటిని పునర్వినియోగం చేసే పద్ధతులపై ప్రత్యేకంగా చర్చించారు.ఈ కార్యక్రమంలో క్రెడాయి, నారెడ్కో, ఐపీఏ, ఐఐఏ, యూఎఫ్ఈఆర్‌వీఏఎస్, ఎన్జీవోలు, సాంకేతిక సంస్థలు, డొమైన్ నిపుణులు పాల్గొని జీహెచ్ఎంసీ కమిషనర్, హెచ్ఎంఎడబ్ల్యుఎస్‌బీ ఎండీ, ఇతర ఉన్నతాధికారులతో అభిప్రాయాలు పంచుకున్నారు. రెసిడెన్షియల్, కమర్షియల్ ప్రాజెక్టులు ఇక కేవలం మున్సిపల్ సేవల వినియోగదారులు మాత్రమే కాదని, అవి నీటి ఉత్పత్తి కేంద్రాలు, నిల్వ కేంద్రాలు, పునర్వినియోగ కేంద్రాలుగా కూడా పనిచేస్తాయని తెలిపారు. సక్రమ నిర్వహణ జరిగితే ఇవి భారీ వర్షాల సమయంలో బఫర్లుగా పనిచేసి వరద ముప్పును తగ్గిస్తాయని, నిర్వహణ లోపిస్తే ప్రజా మౌలిక వసతులపై తీవ్ర ఒత్తిడి పెరుగుతుందని హెచ్చరించారు. డ్రెయిన్లపై భారం తగ్గించడం, చెరువులు, నాలాలను పరిరక్షించడం, హైదరాబాద్ నగర దీర్ఘకాలిక పట్టుదలను పెంచడం లక్ష్యంగా ఈ సూచనలను అమలు చేయగల విధానాలుగా మార్చేందుకు ప్రభుత్వం మరింత విస్తృతంగా స్టేక్‌హోల్డర్లతో సంప్రదింపులు జరపనుందని వెల్లడించింది.





మంచిర్యాల జిల్లాలో వన దేవతలకు నిరాజనాలు

- మొదలైన సమ్మక్క సారరలమ్మ జాతర మొక్కులు

ప్రతిపక్షం ప్రతినిధి, మంచిర్యాల, జనవరి 22: మంచిర్యాల జిల్లాలో వన దేవతలకు ప్రజలు నిరాజనాలు పడుతున్నారు. జిల్లాలోని కోల్‌బెల్ట్‌లో కొంగు బంగారంగా కొలువబడుతున్న సమ్మక్క సారలమ్మ జాతర మొక్కులు ప్రారంభమయ్యాయి. ఈ నెల 28 నుంచి 30 వరకు మూడు రోజుల పాటు ములుగు జిల్లా తాడ్వాయి మండలంలో జరిగే సమ్మక్క సారక్క జాతరకు వెళ్లే భక్తులు ముందుగా వారి నివాసాల్లో ఆ తల్లులకు మొక్కు కోవడం ఆనవాయితి. గత వారం రోజులుగా జిల్లాలోని మంచిర్యాల, శ్రీరాంపూర్, చెన్నూర్, లక్షెట్టిపేట, మందమర్రి, బెల్లంపల్లి, కాసిపేటలో పెద్ద ఎత్తున భక్తులు అమ్మవార్లకు ఇష్టమైనటువంటి బెల్లం బంగారాన్ని తులాభారాలు చేసుకొని పంచిపెడుతున్నారు. ఎటు చూసినా ఆ దుకాణాల వద్ద తులాభారాలు చేసుకుంటున్నటువంటి దృశ్యాలు కనిపిస్తున్నాయి. రెండో కుంభమేళాగా పిలువబడుతున్న ఈ జాతర నేపథ్యంలో



కోట్లలో వ్యాపారాలు జరుగుతున్నాయి. జిల్లాలోని మందమర్రిలో పాలవాగు ఒడ్డు అటవి ప్రాంతంలో సింగరేణి యాజమాన్యం నిర్వహిస్తున్న జాతరకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు పూర్తి చేశారు. తాత్కాలిక రోడ్లతో పాటు విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. సమ్మక్క సారలమ్మ గద్దెలను ముస్తాబు చేశారు. ఈ పనులన్నింటిని స్థానిక జీఎం రాధాక్రిష్ణ పర్యవేక్షిస్తున్నారు. అదే విధంగా శ్రీరాంపూర్‌లో కూడా గోదావరి ఒడ్డున జరిగే జాతరలో అక్కడ సింగరేణి అధికారులు పర్యవేక్షిస్తున్నారు. కాసిపేట, బెల్లంపల్లిలో కూడ ఏర్పాట్లను చేశారు. సింగరేణి ఉద్యోగులు ఇక్కడే మొక్కులు చెల్లించాలని సింగరేణి యాజమాన్యం ప్రచారం చేస్తోంది. ఉద్యోగులు మేడారం వెళితే ఉత్పత్తిపై ప్రభావం పడుతుందని ప్రచారం కూడ చేస్తోంది. ఈ సంవత్సరం జరిగే జాతరకు తెలంగాణ ప్రజా ప్రభుత్వం పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేసి జాతర ప్రాముఖ్యతతో పాటు గిరిజన ఆరాధ్య దైవాలైనందున జాతర ప్రాంతాల్లో విగ్రహాలను ఏర్పాటు చేశారు. జాతరకు వెళ్లే భక్తులు వాటిని వీక్షించే విధంగా పెద్ద ఎత్తున ఏర్పాటు చేశారు. ఇటీవలే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కుటుంబ సభ్యులతో సమ్మక్క సారలమ్మ దేవతలను సందర్శించుకొని బెల్లంతో తులాభారం చేసుకున్నారు. ఆ తల్లుల దీవెనలు ఉండాలని ఆకాంక్షించారు. అక్కడే కేబినేట్ సమావేశం నిర్వహించి పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సారి జాతరకు వెళ్లే వారికి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేశారు.



షాద్ నగర్ మున్సిపాలిటీని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతా

- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్
- 3 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రతిపక్షం, షాద్‌నగర్, జనవరి 22 : షాద్ నగర్ మున్సిపాలిటీ ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. గురువారం పట్టణంలో టీయూఎఫ్ఐడీసీ, మున్సిపల్ జనరల్ ఫండ్ ద్వారా దాదాపు మూడు కోట్ల రూపాయల పనులకు స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ శంకుస్థాపనలు చేశారు. భగీరథ కాలనీలో సీసీ రోడ్డు, మల్లికార్జున కాలనీ నుండి హాజిపల్లి రోడ్డు వరకు సీసీ రోడ్డు, జీహెచ్‌ఆర్ కాలనీలో ఒక సీసీ రోడ్డు, తిరుమల కాలనీలో 2 సీసీ రోడ్లు, వెంకటేశ్వర కాలనీ లో పార్క్ అభివృద్ధి కోసం ఒక బోర్ డ్రిల్లింగ్ చెయ్యడం కోసం శంకుస్థాపన చేశారు. 27వ వార్డులో ఉర్దూ మీడియం స్కూల్ ఎదురుగా ఒక సీసీ రోడ్డు 22వ వార్డులో బాలరాజు గౌడ్ ఇంటి పక్కన ఒక డ్రైనేజ్ నిర్మాణం కోసం శంకుస్థాపన చేశారు. రాష్ట్రంలోనే షాద్ నగర్ ప్రాంతాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తారని ఎమ్మెల్యే శంకర్ అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగరవేయాలి

- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ పిలుపు

ప్రతిపక్షం, హుస్నాబాద్, జనవరి 22: రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో హుస్నాబాద్ మునిసిపాలిటీపై బీజేపీ జెండా ఎగరవేయాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పిలుపునిచ్చారు.హుస్నాబాద్ పట్టణాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. గురువారం కరీంనగర్లోని మహాశక్తి అమ్మవారి ఆలయంలో బీజేపీ హుస్నాబాద్ పట్టణ అధ్యక్షుడు బత్తుల శంకర్ బాబు మర్యాదపూర్వకంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ప్రజల ఆలోచనలు, ఆశీర్వాదం, నమ్మకం బీజేపీపై ఉన్నాయని, అందుకే ఈసారి హుస్నాబాద్ మునిసిపాలిటీని కైవసం చేసుకోవాలని కార్యకర్తలకు సూచించారు. పార్టీ శ్రేణులు సమిష్టిగా కష్టపడి పనిచేస్తే విజయం ఖాయమని, హుస్నాబాద్ పట్టణ అభివృద్ధికి కేంద్రం నుంచి పూర్తి సహకారం అందిస్తామని



బండి సంజయ్ తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగాలని పార్టీ నేతలకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సేవలు అభినందనీయం

- రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

ప్రతిపక్షం, చేగుంట, జనవరి 21: ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సేవలు అభినందనీయమని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ కొనియాడారు. హైదరాబాదులో జరిగిన రెడ్ క్రాస్ సొసైటీ పాలకమండలి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా రెడ్ క్రాస్ సొసైటీ లయన్స్ మెదక్ జిల్లా శాఖ సౌజన్యంతో జిల్లా అధ్యక్షులు లయన్ ఏలేటి రాజశేఖర్ రెడ్డి ప్రవేశపెట్టిన రక్తదాన అవగాహన గోడపత్రికను జిష్ణు దేవ్ వర్మ ఆవిష్కరించారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ లయన్స్ క్లబ్ భాగస్వామ్యంతో రక్తదాన శిబిరాలు అవయవాల దానం వంటి సేవా కార్యక్రమాలను మెదక్ జిల్లాలో నిర్వహించడం గర్వ కారణమని విష్ణు దేవ్ వర్మ కొనియాడారు. పేదల పక్షపాతిగా నిలిచే రెడ్ క్రాస్ సొసైటీ లైన్స్ క్లబ్ లను ఆయన అభినందించారు. స్వచ్ఛంద సంస్థలు గ్రామీణ యువకులు సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు . ఈ సందర్భంగా మెదక్ జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ లయన్ ఏలేటి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ గవర్నర్ విష్ణుదేవ్ వర్మ రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర చైర్మన్ గా కొనసాగడం అదృష్టంగా భావించాలన్నారు . ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సెక్రెటరీ దాన కిషోర్ శిశు సంక్షేమ శాఖ ప్రిన్సిపాల్ సెక్రెటరీ అనితా రామచంద్రన్ ఐఏఎస్ చైల్డ్ డెవలప్మెంట్ డైరెక్టర్ శృతి ఓజ మెడికల్ హెల్త్ డిపార్ట్మెంట్ సెక్రెటరీ ఆయేషా ఐఏఎస్ ఎడ్యుకేషన్ సెక్రెటరీ వెంకటేశ్వర్లు పాలకమండలి సభ్యులు శ్రీనివాసరావు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధులు లైన్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.



మల్లికార్జున స్వామి ఆలయంలో హుండీ లెక్కింపు

- 23 రోజుల హుండీ ఆదాయం రూ. 1 కోటి 1 లక్ష 24 వేల 258

ప్రతిపక్షం, కొమురవెల్లి, జనవరి 22: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో హుండీ ఆదాయం రూ.01 కోటి 01 లక్ష 24 వేల 258 రూపాయలు వచ్చింది. శుక్రవారం కొమురవెల్లిలోని ఆలయ ముఖ మండపంలో ఈఓ టీ.వెంకటేష్ ఆధ్వర్యంలో దేవాదాయ ఇన్స్పెక్టర్ పీ.విజయ లక్ష్మి పర్యవేక్షణలో హుండీ లెక్కింపు నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లికార్జునస్వామి దేవస్థానంలో 23 రోజుల హుండీ లెక్కింపు నిర్వహించగా రూ. 01 కోటి 01 లక్ష 24 వేల 258 నగదు, విదేశీ కరెన్సీ 30 నోట్లు, మిశ్రమ బంగారం 50 గ్రాములు, మిశ్రమ వెండి 5 కిలోల 600 గ్రాములు రాగ వచ్చిన మొత్తం డబ్బులను స్థానిక ఎస్‌బీఐ బ్యాంకులో జమ చేసినట్లు ఆలయ ఈఓ టీ.వెంకటేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ బుద్ధి శ్రీనివాస్, ప్రధాన అర్చకులు మల్లికార్జున్, మల్లన్న ఆలయ కమిటీ చైర్మన్ గంగం నర్సింహ్మారెడ్డి, ధర్మకర్తలు సార్ల లింగం, బొచ్చు ఎల్లయ్య, చిగురు కొమురయ్య, అర్చకులు, ఆలయ సిబ్బంది, శ్రీ లలిత సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు. కాగా కొమురవెల్లి ఎస్ఐటీ మహేష్ పోలీస్ సిబ్బందితో బందోబస్త్ నిర్వహించారు.



మున్సిపల్ ఎన్నికల్లో సీపీఎం అభ్యర్థులను గెలిపించండి

- చేవెళ్ల డివిజన్ కార్యదర్శి అల్లి దేవేందర్

ప్రతిపక్షం, మొయినాబాద్, జనవరి 22: మొయినాబాద్ మున్సిపల్ సీపీఎం కమిటీ సమావేశం అజీజ్ నగర్ లో నిర్వహించారు. ఈ సందర్భంగా చేవెళ్ల డివిజన్ కార్యదర్శి అల్లి దేవేందర్ మాట్లాడుతూ త్వరలో జరగబోయే మున్సిపల్ ఎన్నికలలో మొయినాబాద్ పురపాలక సంఘంలో పోటీ చేస్తున్న సీపీఎం కౌన్సిలర్ అభ్యర్థులను గెలిపించాలని మొయినాబాద్ పురపాలక సంఘ ప్రజలకు కార్మికులకు కర్షకులకు పిలుపునిచ్చారు . సిపిఎం పార్టీ పేద ప్రజల కోసం నిరంతరం పోరాటం చేస్తుందని ,అజిత్ నగర్ లో డబుల్ బెడ్ రూమ్స్ ఇచ్చేంతవరకు నిర్విరామంగా పోరాటం చేసి పేదలకు డబుల్ బెడ్రూమ్స్ ఇప్పించామని అన్నారు. పురపాలక సంఘంలో అనేక వార్డులలో రోడ్లు పూర్తిగా ధ్వంసం ప్రస్తుత పాలకులు పట్టించుకోవడంలేదని అన్నారు. హైదరాబబాద్ కు కూతవేటు దూరంలో ఉన్న మొయినాబాద్ లో బస్టాండ్ లేదని, పేద విద్యార్థులు చదువుకోవడానికి ప్రభుత్వ డిగ్రీ ఇంటర్ కళాశాలలు లేవని అంటే ఈ ప్రాంత పాలకులు మొయినాబాద్ ప్రాంతా అభివృద్ధిని పూర్తిగా విస్మరించారని స్థానిక సమస్యలపై పోరాటం చేస్తున్న సిపిఎం పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు .ఈ కార్యక్రమంలో సిపిఎం మొయినాబాద్ మండల కార్యదర్శి సిహెచ్. ప్రవీణ్ కుమార్ , సిపిఎం మొయినాబాద్ మున్సిపల్ నాయకులు దప్పు మహేందర్ , ముంజ గళ్ళ ప్రభుదాస్ , తాళ్లపల్లి శ్రీనివాస్, ఆంగోత్ రాజు, ముంజగల రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.



మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీదే విజయం

- మంత్రి వివేక్ పనితీరే విజయం కట్టబెడుతుంది
- కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు రఘునాథ్ రెడ్డి

ప్రతిపక్షం ప్రతినిధి, మంచిర్యాల, జనవరి 22: త్వరలో జరిగే మున్సిపాలిటిలో ఎన్నికల్లో తమ పార్టీ విజయం సాధిస్తుందని, మెజార్టీ మున్సిపాలిటిల్లో విజయం సాధించబోతున్నామని కాంగ్రెస్ పార్టీ మంచిర్యాల జిల్లా అధ్యక్షులు రఘునాథ్ రెడ్డి తెలిపారు. గురువారం క్యాతన్‌పల్లిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చెన్నూరు నియోజకవర్గంలో మూడు మున్సిపాలిటిలో 200 కోట్ల అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. చెన్నూరు, క్యాతన్‌పల్లి మున్సిపాలిటిల్లో టిక్కెట్ల కోసం పోటి అధికంగా ఉందన్నారు. సర్వే ఆధారంగా టిక్కెట్ల కేటాయింపులు ఉంటాయని పేర్కొన్నారు. ఇప్పటికే మంత్రి ఆశావాహుల జాబితాను తీసుకోవడం జరిగిందని తెలిపారు. పూర్తిగా పరిశీలిస్తున్నామన్నారు. రెండు మున్సిపాలిటిలోపాటు కొత్తగా ఏర్పడిన మంచిర్యాల కార్పొరేషన్ను కైవసం చేసుకోబోతున్నామన్నారు. బెల్లంపల్లిలో కాంగ్రెస్‌పార్టీదే విజయమని పేర్కొన్నారు. కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ప్రజాస్వామ్యబద్ధంగా పని చేసే పార్టీ కాంగ్రెస్ పార్టీ అని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో జరిగిన అన్ని ఎన్నికల్లో విజయంసాధించామన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు మరో సారి ఎన్నికల్లో గుణపాఠం తప్పదని విమర్శించారు. ఇటీవల మంత్రి చెన్నూరు, క్యాతన్‌పల్లి, మందమర్రి మున్సిపాలిటిల్లో జిల్లా కలెక్టర్‌తో కలిసి ప్రభుత్వ నిధులతో రోడ్లు, డ్రైనేజీలకు సంబంధించి శంఖు స్థాపన చేశారన్నారు. బీఆర్ఎస్ పాలనలో మున్సిపాలిటిలు అభివృద్ధికి నోచుకోలేదని, తమ ప్రభుత్వంలో కార్మిక మంత్రి వివేక్ నేతృత్వంలో అభివృద్ధిలో ముందుండడంతో పాటు ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేశారని తెలిపారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు పల్లె రాజు, తదితరులు పాల్గొన్నారు.

111 జీవోకు తూట్లు పొడుస్తూ అక్రమ నిర్మాణాలు

- దమ్ముంటే ఆపాలని అక్రమ నిర్మాణదారులు సవాళ్లు
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు

ప్రతిపక్షం, మొయినాబాద్, జనవరి 22 : జంట జలాశయాల పరిరక్షణకు ప్రభుత్వం ఇచ్చిన 111 జీవోకు అక్రమ నిర్మాణదారులు తూట్లు పొడుస్తున్నారు. నిర్మాణాలు ఆపడానికి దమ్ముంటే ముందుకు రావాలని అధికారులకు సవాలు విసురుతున్నారు. అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోకుండా నోటీసులతో కాలయాపన చేస్తున్నారని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. 111 జీవోలో అక్రమ నిర్మాణాలు సాగిస్తున్నారని అధికారులకు తెలియదా అంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు. మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని హిమాయత్ నగర్ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 10,11, 149 సర్వే నంబర్లలో 111 జీవోకు విరుద్ధంగా అక్రమణ భవనాలు నిర్మిస్తున్నారు. అడ్డుకోవలసిన అధికారులు చోద్యం చూస్తుండడంతో అక్రమ నిర్మాణాలకు అడ్డు అదుపు లేకుండా పోయింది. జంట జలాశయాల పరిధిలో పర్యావరణాన్ని పరిరక్షించేందుకు నాటి ప్రభుత్వం జారీ చేసిన 111 జీవో ఇంకా అస్తిత్వంలోనే ఉన్నప్పటికీ పెద్ద ఎత్తున అక్రమ నిర్మాణాలు జరుగుతుండటం విస్మయం గొలుపుతున్నది. హిమాయత్ నగర్ రెవెన్యూ పరిధిలో 111 జీవో పరిధిలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై అధికారులు వెంటనే చర్యలు తీసుకొని అక్రమ నిర్మాణాలను అధికారులు అడ్డుకొని మొయినాబాద్ మండల, మున్సిపాలిటీ పరిధిలోని ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని, నిబంధనలకు విరుద్ధంగా చేపడితే అధికారులు తక్షణమే కూల్చివేయాలి. కానీ మొయినాబాద్ మండల, మున్సిపాలిటీ పరిధిలో అలా జరగడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మొయినాబాద్ మండల, మున్సిపాలిటీ పరిధిలో అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.





తమ వారి సంస్థలకు కారుచౌకగా భూములు కేటాయిస్తూ కూటమి ప్రభుత్వం అక్రమాలకు పాల్పడుతోంది. రాజధానిలో నిర్మాణ వ్యయాన్ని దారుణంగా పెంచారు. ఒక్కో ఎస్ఎఫ్టీకి 13 వేల వరకు చెల్లిస్తున్నారు. ఎస్ఎఫ్టీకి 5 వేలతో ఫైవ్ స్టార్ హోటల్ నిర్మించొచ్చు. ఇక్కడ అంతకన్నా ఎక్కువ ఇస్తూ దోపిడీ చేస్తున్నారు. బెల్టు షాపుల్లో మద్యం అక్రమ అమ్మకాలతో దోచుకుంటున్నారు.

- ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్

పేదల పాలిట వరంగా ముఖ్యమంత్రి సహాయనిధి

ప్రతిపక్షం ప్రతినిధి, హనుమకొండ, జనవరి 22



హన్మకొండ సుబేదారి లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం లో, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 66వ డివిజన్ పరిధిలోని హసన్పర్తి గ్రామానికి చెందిన పిథిమి నాగమణి గారు గుండె సంబంధిత సమస్యతో బాధపడుతున్న నేపథ్యంలో, ముఖ్యమంత్రి సహాయనిధి (CMRF) నుంచి మంజూరైన రూ.2,50,000/ (రెండు లక్షల యాభై వేల రూపాయలు) విలువైన LOC కాపీని గౌరవ వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి శ్రీ కేఆర్ నాగరాజు బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు ఈ LOC ద్వారా హైదరాబాద్ నిమ్స్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం నిరుపేదల వైద్య అవసరాల విషయంలో అన్ని విధాలుగా అండగా నిలుస్తుందని, స్థానిక శాసనసభ్యుడిగా తన దృష్టికి వచ్చే ప్రతి అనారోగ్య సమస్యపై తన వంతు సహాయ సహకారాలు అందించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు... అలాగే వర్ధన్నపేట నియోజకవర్గ ప్రజలకు ఆయన విజ్ఞప్తి చేస్తూ, లక్షల రూపాయలు ఖర్చయ్యే ప్రైవేట్ ఆసుపత్రుల చికిత్సలకు వెళ్లి అప్పుల పాలుకాకుండా, ప్రభుత్వ నిమ్స్ వంటి ఆసుపత్రుల్లో తాను అందించే LOCల ద్వారా ఉచితంగా మెరుగైన వైద్యం పొందాలని సూచించారు...ఈ సందర్భంగా బాధితురాలు పిథిమి నాగమణి గారి కుటుంబ సభ్యులు, ఆపద్కాలంలో అండగా నిలిచిన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు గారికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేస్తూ తమ కృతజ్ఞతాభావాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు ఏఎంసీ వైస్ చైర్మన్ తంగళ్ళపల్లి తిరుపతి, 66 డివిజన్ అధ్యక్షులు కనపర్తి కిరణ్, కాంగ్రెస్ నాయకులు వీసం సురేందర్ రెడ్డి, మాజీ సర్పంచి పుల్ల రవీందర్, గారిగా రాజు, జన్ను అశోక్, జన్ను రమేష్ ,రమంచ ఐలయ్య, తదితరులు పాల్గొన్నారు

అభివృద్ధి పనులు ప్రారంభించాలి: ఎంపీ కడియం కావ్య

ప్రతిపక్షం ప్రతినిధి, హనుమకొండ జనవరి 22



పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని అభివృద్ధి పనులకు 8 కోట్ల 30 లక్షలు నిధులు మంజూరు ఇచ్చాం అడ్మినిస్ట్రేషన్ సాంక్షన్ ఇచ్చిన మూడు నెలల లోపు పనులు ప్రారంభించాలి లేదంటే పనులు రద్దు చేయండి ఎంపీ నిధుల నుండి ఇచ్చిన ప్రతి అభివృద్ధి పురోగతి పనులు పబ్లిక్ డొమైన్ లో ఉండాలి. టెక్నికల్ సమస్యలు ఉంటే వెంటనే నా దృష్టికి తీసుకురావాలి ప్రజలకు మేలు చేసే కార్యక్రమాలను వేగవంతంగా పూర్తి చేయలి అభివృద్ధి పనుల్లో జాప్యం లేకుండా నిర్దేశిత కాలపరిమితిలో పూర్తి చేయాలి ప్రజా ప్రయోజనమే లక్ష్యంగా సమన్వయంతోపనిచేయాలి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య* వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధిపై వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య గురువారం హనుమకొండ కలెక్టరేట్ లోని ఎంపీ ఛాంబర్ లో చీఫ్ ప్లానింగ్ (CPO) అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ కడియం కావ్య గారు మాట్లాడుతూ, పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో చేపట్టే అభివృద్ధి పనుల కోసం ఎంపీ నిధుల నుండి మొత్తం రూ. 8 కోట్ల 30 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ నిధులకు అడ్మినిస్ట్రేటివ్ సాంక్షన్ ఇచ్చిన తేదీ నుంచి మూడు నెలల లోపు పనులు ప్రారంభించాలని, లేనిపక్షంలో పనులు రద్దు చేయాలని అధికారులను స్పష్టంగా ఆదేశించారు. ఎంపీ నిధుల ద్వారా చేపట్టే ప్రతి అభివృద్ధి పనికి సంబంధించిన పురోగతి వివరాలు తప్పనిసరిగా పబ్లిక్ డొమైన్‌లో ఉంచాలని, ప్రజలకు పూర్తి సమాచారం అందుబాటులో ఉండేలా పారదర్శకంగా వ్యవహరించాలని సూచించారు. . అభివృద్ధి పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా నిర్దేశిత కాలపరిమితిలోనే పనులు పూర్తయ్యేలా కఠినంగా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అధికారులు ఇప్పటివరకు చేపట్టిన అభివృద్ధి పనుల వివరాలు, పెండింగ్ ప్రాజెక్టుల స్థితి, భవిష్యత్తులో అమలు చేయనున్న ప్రణాళికలను ఎంపీకి వివరించారు. ప్రజా ప్రయోజనమే లక్ష్యంగా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఎంపీ డాక్టర్ కడియం కావ్య అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని చీఫ్ ప్లానింగ్ అధికారులు సత్యనారాయణ రెడ్డి, చంద్రకళ, కొట్యా నాయక్, బాబురావు, పంచాయతీరాజ్ అధికారులు ఆత్మా రామ్, రమేష్ బాబు, కిషన్, సతీష్ బాబు, ఆర్ అండ్ బి ఈఈ సురేష్ బాబు, టీజీఈడబ్ల్యూఐడీసీ అధికారి కిషన్, డిడబ్ల్యుఓ రాజమణి, మిషన్ భగీరథ అధికారి శ్రీకాంత్, ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీలు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

దంత వైద్యునికి తెలుగు వెలుగు మహానంది జాతీయ పురస్కారం

ప్రతిపక్షం, నంగునూరు, జనవరి 22:



సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం గట్ల మల్యాలకు చెందిన దంత వైద్యుడు, అసిస్టెంట్ ప్రొఫెసర్, సిద్ధిపేటలోని శ్రీనివాస సూపర్ స్పెషాలిటీ దంత వైద్యశాల నిర్వాహకుడు డాక్టర్ ఎల్.శ్రీనివాస నాయక్ కు తెలుగు వెలుగు మహానంది జాతీయ పురస్కారానికి ఎంపికయ్యారు. డాక్టర్ ఎల్.శ్రీనివాస నాయక్ దంత వైద్యరంగంలో చేస్తున్న విశేష కృషిని గుర్తించి తెలుగు వెలుగు జాతీయ పురస్కారం 2026 కోసం ఎంపిక చేసినట్లు తెలుగు వెలుగు సాహితీ వేదిక జాతీయ స్వచ్ఛంద సేవా సంస్థ జాతీయ చైర్మన్ విశ్వ కళా రత్న పోలోజు రాజ్ కుమార్ ఆచార్య తెలిపారు. దంత వైద్య రంగంలో నిర్వహిస్తున్న సామాజిక అవగాహన కార్యక్రమాలు, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో ఆరోగ్య సదస్సుల వల్ల విద్యార్థుల్లో ఆరోగ్యం చైతన్యం పెంపొందిస్తున్నందుకు తెలుగు వెలుగు సాహితీ వేదిక జాతీయ స్వచ్ఛంద సేవా సంస్థ తరపున స్వామి వివేకానంద, నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి ఉత్సవాల సందర్భంగా 2026 సవత్సరానికి డాక్టర్ ఎల్.శ్రీనివాస నాయక్ ను జాతీయ పురస్కారానికి ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ నెల 25 వ తేదీన ఉదయం 10 గంటలకు హనుమకొండ బాల సముద్రంలోని బస్టాండ్ దగ్గర ఉన్న గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ లో జరిగే కార్యక్రమంలో పురస్కారాన్ని అందజేస్తామని పేర్కొన్నారు.



వీరశైవ లింగ బలిజ సంఘం నూతన కార్యవర్గం ఏర్పాటు

ప్రతిపక్షం, నంగునూరు, జనవరి 22:

వీరశైవ లింగ బలిజ సంఘం మండల కార్యవర్గ సమావేశం నూతన కార్యవర్గ ఎన్నికలు గురువారం నిర్వహించారు. నంగునూరులో జరిగిన ఈ ఎన్నికల్లో మండల గౌరవ అధ్యక్షునిగా కిర్ని శ్రీనివాస్, అధ్యక్షునిగా కిర్ని రాజు, ఉపాధ్యక్షునిగా కిర్ని ఆంజనేయులు, కార్యదర్శిగా కిర్ని చరణ్ కుమార్ సహాయ కార్యదర్శిగా పడిగశెట్టి ఆంజనేయులు, కోశాధికారిగా కిర్ని మహేశ్, కార్యవర్గ సభ్యులుగా కె.భూపాని, కె.నవీన్ కుమార్, కె.కాశీ విశ్వనాథ్, కె.నాగరాజు, కె. భాస్కర్, కె.శ్రావణ్, కె.ఆంజనేయులు, ఎస్.సిద్ధులు కె.శివకుమార్, కె.శ్రీతన్, కె.శివప్రసాద్, బి.శివప్రసాద్, బి.నాగరాజు, కె.సుధీర్ పి.శేఖర్, పి.శ్రీను, పి.నాగేందర్ ఎన్నికయ్యారు.



బైపాస్ రోడ్ విస్తరణలో జాప్యం

- హెచ్ఎండిఏ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసిన జగ్గారెడ్డి, నిర్మల
- విస్తరణ పనులు వేగవంతం చేయాలని ఆదేశం
- ఐబి కాంపౌండ్ వాల్ కూల్చివేత... చెట్ల తొలగింపు

ప్రతిపక్షం ప్రతినిధి,సంగారెడ్డి, జనవరి 22:

సంగారెడ్డి పట్టణంలోని బైపాస్ రోడ్ విస్తరణ పనుల్లో జరుగుతున్న జాప్యంపై టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి, టీజీఐఐసి చైర్ పర్సన్ నిర్మల హెచ్ ఎండిఏ అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విస్తరణ పనులను తక్షణమే ప్రారంభించి వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. దీంతో గురువారం ఉదయం నుంచే అధికారులు ఆగమేఘాల మీద పనులను ప్రారంభించారు. ఐబి ప్రహరీ గోడను జేసీబీల సహాయంతో కూల్చివేసి, రోడ్డుకు అడ్డంగా ఉన్న చెట్లను తొలగించి రోడ్ వెడల్పు పనులు చేపట్టారు. విస్తరణ పనులకు ఎలాంటి అంతరాయం కలగకుండా ట్రాఫిక్ పోలీసులు ఐబి గెస్ట్ హౌస్ నుంచి సంగారెడ్డి మండల పరిషత్ కార్యాలయం వరకు భారీ కేడ్లు ఏర్పాటు చేసి రాకపోకలను నియంత్రించారు. బైపాస్ రోడ్ విస్తరణ పనులు వేగవంతం కావడంపై పట్టణ వాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ పనులు పూర్తయితే ఐబి గెస్ట్ హౌస్ నుంచి బస్వేశ్వర విగ్రహం వరకు ట్రాఫిక్ ఇబ్బందులు ఉండవని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా టీపిసిసి ప్రధాన కార్యదర్శి తోపాజి అనంత్ కిషన్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు జార్జ్, నాయకులు షఫీ హఫీజ్, కిరణ్ గౌడ్ తదితరులు ఐబి వద్ద జరుగుతున్న పనులను పర్యవేక్షించారు.



ఎస్సీ స్టడీ సర్కిల్ లో ఉచిత శిక్షణ కరపత్రాలను ఆవిష్కరన

- కాకతీయ యూనివర్సిటీ వైస్ చాన్స్ లర్ ప్రొఫెసర్ ప్రతాప్ రెడ్డి

ప్రతిపక్ష ప్రతినిధి హనుమకొండ జనవరి 22

తెలంగాణ ఎస్సీ స్టడీ సర్కిల్ ద్వారా వివిధ ఉద్యోగాలకు అందిస్తున్న ఉచిత శిక్షణ ను కాకతీయ యూనివర్సిటీ వైస్ చాన్స్ లర్ ప్రొఫెసర్ ప్రతాప్ రెడ్డి విద్యార్థి నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. గురువారం వి సి ఛాంబర్ లో వైస్ చాన్స్ లర్ ప్రొఫెసర్ ప్రతాప్ రెడ్డి చేతుల మీదుగా స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్బంగా వైస్ చాన్స్ లర్ ప్రొఫెసర్ ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ ఎస్సి స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ సదావకాశాన్ని నిరుద్యోగులు విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా డిగ్రీ పూర్తి చేసిన ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ దివ్యాంగ నిరుద్యోగులకు రాష్ట్ర స్థాయి పోటీ పరీక్షల తో పాటు, ఆర్.ఆర్.బి, బ్యాంకింగ్ , స్టాఫ్ సెలక్షన్ కమిషన్ వంటి పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణకు ఐదు నెలల పాటు ఎస్సీ స్టడీ సర్కిల్ హనుమకొండ నందు వివిధ పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ శిక్షణకు దరఖాస్తులు చేసుకొనుటకు ఈ నెల 30 తేదీ వరకు వెబ్సైట్ నందు దరఖాస్తు చేసుకోవాలని, ప్రభుత్వం ఉద్యోగుల కోసం చదువుకునే వారు ఆన్లైన్లో http://tsstudycircle.co.in/ దరఖాస్తులు చేసుకోవాలని, చేసుకున్న వారికి 8 02 2026 ను ఆదివారము హనుమకొండ లో ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ పరీక్ష నిర్వహిస్తామని ఉత్తీర్ణతలైన అభ్యర్థులకు శిక్షణ ఉంటుందన్నారు ఈ సదా అవకాశాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్టర్ ప్రొఫెసర్ వి రాంచందర్ స డి ఎల్ సి డైరెక్టర్ ప్రొఫెసర్ సురేష్ లాల్, ఉమ్మడి వరంగల్ జిల్లా స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ కొంగర జగన్ మోహన్, రీసెర్చ్ స్కాలర్ గుండు సురేష్ వెంకేష్, తదితరులు పాల్గొన్నారు



హసన్‌పర్తి పోలీస్ స్టేషన్‌లో ప్రతిపక్షం దినపత్రిక క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రతిపక్షం ప్రతినిధిహనుమకొండ, జనవరి 22

హసన్పర్తి పోలీస్ స్టేషన్‌లో ప్రతిపక్షం తెలుగు దినపత్రిక ఆధ్వర్యంలో క్యాలెండర్ ఆవిష్కరణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హసన్పర్తి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ చేరాలు క్యాలెండర్‌ను ఆవిష్కరించి శుభాకాంక్షలు తెలిపారు ఈ కార్యక్రమంలో దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షులు రౌతు రమేష్ కుమార్ఎ స్సైలు దేవేందర్ ఎస్సైశీలం రవివార్తా విలేకరి సదానందం తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిపక్షం తెలుగు దినపత్రిక ప్రజాసమస్యలపై నిరంతరం పోరాటం చేస్తూ ప్రజల తరఫున స్వరం వినిపిస్తున్న పత్రికగా ఎదగాలని ఆకాంక్షించారు అధికార వ్యవస్థలతో పాటు సమాజంలో జరుగుతున్న అన్యాయాలు అసమానతలను వెలుగులోకి తీసుకురావడంలో మీడియా బాధ్యత అత్యంత కీలకమని వారు పేర్కొన్నారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ న్యాయం సమానత్వం కోసం మీడియా ధైర్యంగా ముందుకు రావాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు ఈ క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం ప్రజాస్వామ్య చైతన్యాన్ని మరింత బలోపేతం చేసే ప్రయత్నంగా వారు అభివర్ణించారు.



విద్యుత్ గిరిజన డైరీ–2026 & క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రతిపక్షం ప్రతినిధి హనుమకొండ జనవరి 22

హనుమకొండలోని అంబేద్కర్ ఆడిటోరియంలో తెలంగాణ స్టేట్ ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యుత్ గిరిజన డైరీ-2026 మరియు క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డా. రాంచందర్ నాయక్ హాజరై మాట్లాడారు. అలాగే జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ నాయక్ ప్రత్యేక అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూగిరిజన ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం ఎల్లప్పుడూ కట్టుబడి ఉందని, విద్యుత్ శాఖలో పనిచేస్తున్న ఎస్టీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. గిరిజనుల చరిత్ర, హక్కులు, ప్రభుత్వ సంక్షేమ పథకాలను సమగ్రంగా తెలియజేసేలా డైరీ-2026 రూపొందించబడిందని పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాలు ఉద్యోగుల్లో అవగాహన పెంచి సామాజిక బాధ్యతను మరింత బలోపేతం చేస్తాయని అన్నారు. కార్యక్రమంలో తెలంగాణ స్టేట్ ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు, విద్యుత్ శాఖ అధికారులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. డైరీ క్యాలెండర్ ఆవిష్కరణ అనంతరం అతిథులను శాలువాలతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు

ఇక పోలీస్ స్టేషన్‌కు వెళ్లకుండానే ఫిర్యాదు

- బాధితుల గౌరవానికి రక్షణ – ఇంటివద్దే ఎఫ్ఐఆర్ నమోదు.
- దేశంలోనే తొలిసారి అమలులోకి వచ్చిన నూతన విధానం.
- జిల్లా ఎస్పీ. డి.వి. శ్రీనివాస రావు.

ప్రతిపక్షం,మెదక్ టౌన్ జనవరి 22



బాధితుల గౌరవం, భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ రాష్ట్ర పోలీస్ శాఖ ప్రవేశపెట్టిన కొత్త విధానాన్ని మెదక్ జిల్లాలో అమలు చేస్తున్నామని జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు గురువారం ఒక ప్రకటన ద్వారా వెల్లడించారు. బాలికలు ,మహిళలు పాఠశాలలు, కళాశాలలు, కార్యాలయాలకు వెళ్లే సమయంలో వేధింపులకు గురవుతున్న అనేక సంఘటనలు వెలుగులోకి వస్తున్నాయని, ఈ పరిస్థితుల్లో చాలా మంది బాధితులు భయంతో, మానసిక ఒత్తిడితో ఫిర్యాదు చేయలేకపోతున్నారని తెలిపారు. ఇలాంటి వారికి అండగా నిలిచేందుకే పోలీస్ శాఖ ఈ కొత్త విధానాన్ని ప్రవేశపెట్టిందన్నారు. మహిళలు, బాలికలు, పిల్లలు మరియు తీవ్రమైన మానసిక ఒత్తిడికి లోనయ్యే బాధితులు పోలీస్ స్టేషన్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండానే ఇంటివద్ద నుంచే ఫిర్యాదు చేసుకునే అవకాశం రాష్ట్ర పోలీస్ శాఖ కల్పించిందని పేర్కొన్నారు. ప్రత్యేక సందర్భాల్లో పోలీసులే బాధితుల ఇంటికి వెళ్లి ఫిర్యాదు స్వీకరించి కేసు నమోదు చేస్తారని వివరించారు. బిఎన్ఎస్ఎస్ నిబంధనల ప్రకారం నేర సమాచారం అందిన వెంటనే జీరో ఎఫ్ఐఆర్ సహా ఏరూపంలోనైనా కేసు నమోదు చేయాల్సి ఉంటుందని, బాధితుల గౌరవానికి భంగం కలగకుండా సేవలు అందించడమే ఈ విధాన ప్రధాన లక్ష్యమన్నారు. ఈ విధానం దేశంలోనే తొలిసారిగా అమలులోకి వస్తోందని,దీని ద్వారా బాధితులకు ఎంతో ఉపశమనం కలుగుతుందన్నారు. మహిళలు, పిల్లలపై నేరాలు, పోక్సో కేసులు, ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ కేసులు, శారీరక దాడులు, ర్యాగింగ్, బాల్య వివాహాల నిషేధ చట్టం కేసులు వంటి ప్రత్యేక నేరాల్లో ఈ SOP అమలు చేస్తామని తెలిపారు. బాధితులు ఫోన్ ద్వారా సమాచారం ఇస్తే వెంటనే స్పందించి, పోలీసులే ఇంటికి వెళ్లి ఫిర్యాదు స్వీకరించి ఎఫ్ఐఆర్ నమోదు చేసి కాపీని బాధితులకు అందజేస్తారని చెప్పారు. అవసరమైన సాక్ష్యాల సేకరణ, వాంగ్మూలాల నమోదు కూడా అక్కడికక్కడే చేపడతామని స్పష్టం చేశారు. మెదక్ జిల్లాలో ఈ విధానం పూర్తిస్థాయిలో అమలు చేస్తున్నామని, ప్రజలు ఈ సౌకర్యాన్ని వినియోగించుకుని నేరాలపై భయపడకుండా ముందుకు వచ్చి ఫిర్యాదు చేయాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

25న మౌంటెన్ బైక్ రాష్ట్రస్థాయి ఎంపిక పోటీ

- సైక్లింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బండారుపల్లి శ్రీనివాస్

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, జనవరి 22:



మౌంటెన్ బైక్ రాష్ట్రస్థాయి ఎంపిక పోటీ సిద్దిపేట రూరల్ మండలం ఇర్కోడ్ గ్రామం వద్ద నిర్వహించనున్నట్లు సైక్లింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బండారుపల్లి శ్రీనివాస్, కార్యదర్శి జంగాపల్లి వెంకట నరసయ్య గురువారం ప్రకటన లో పేర్కొన్నారు. మౌంటెన్ బైక్ రాష్ట్రస్థాయి ఎంపిక పోటీ లో భాగంగా ఎలైట్ మెన్ అండ్ ఉమెన్, మెన్ అండర్ 23, మెన్ అండ్ ఉమెన్ జూనియర్స్, యూత్ బాయ్స్ అండ్ గర్ల్స్ విభాగాల్లో ఎంపికలు నిర్వహించినట్లు తెలిపారు. ఎంపికైన సైకిల్ లిస్టులు అరుణాచల్ ప్రదేశ్ లో ఫిబ్రవరి 12 నుంచి 15 తేదీల్లో జరిగే జాతీయస్థాయి మౌంటెన్ బైక్ పోటీ లో పాల్గొనే అవకాశం దక్కుతుంది. ఆసక్తి గల క్రీడాకారులు ఈనెల 24 వ తేదీ లోపు సిద్దిపేట జిల్లా కేంద్రం ప్రభుత్వ డిగ్రీ కళాశాల మినీ క్రికెట్ స్టేడియం ప్రక్కనగల కే లో ఇండియా సైక్లింగ్ సెంటర్ ఎంట్రీ చేసుకోవాల్సి ఉంటుందన్నారు. మరిన్ని వివరాల కోసం 9618711446 సెల్ నెంబర్ లో సంప్రదించాలని సూచించారు.



సింగన్నగూడ పాఠశాలలో మాక్ పార్లమెంట్

ప్రతిపక్షం, గజ్వేల్, జనవరి 22:

సిద్ధిపేట జిల్లా ములుగు మండలం సింగన్నగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులు మాక్ పార్లమెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్పీకర్ గా జి.సంజన, ప్రధాన మంత్రిగా కె.జశ్వంత్, హోమ్ శాఖ మంత్రిగా ప్రియాంక, ప్రతిపక్ష నేతగా రాధా రంజిత్, విద్యాశాఖ మంత్రిగా జి.వైష్ణవి అనేవిద్యార్థులు వ్యవహరించారు. ప్రతిపక్ష నేతలు అడిగిన ప్రశ్నలకు అధికారపక్షం నేతలు ధాటిగా సమాధానాలు చెప్పారు. కార్యక్రమంలో సమస్యలపై వాడి వేడిగా చర్చలు జరిగాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎండి రహీం, సీనియర్ ఉపాధ్యాయులు నిమ్మ శ్రీనివాస రెడ్డి, మనోహర్ రెడ్డి, సాంఘీక శాస్త్ర ఉపాధ్యాయుడు దేవులపల్లి పరశు రాములు, సవితాంజలి తదితరులు పాల్గొన్నారు

డాక్టర్ రాజేశ్వర్ రెడ్డికి అరుదైన పురస్కారం

ప్రతిపక్షం బ్యూరో సిద్దిపేట జనవరి 22:



సిద్దిపేట పట్టణానికి చెందిన జ్యోతిష్యుడు, కవి డాక్టర్ కలకుంట్ల రాజేశ్వర్ రెడ్డి కి మరోసారి అరుదైన పురస్కారం దక్కింది. ప్రతి సంవత్సరం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో సాహిత్య రంగంలో విశిష్ట సేవలను అందించిన వారికి తెలుగు అసోసియేషన్ ఆఫ్ నేషనల్ అకాడమీ బుక్ ఆఫ్ రికార్డ్, గోదావరి సోషల్ అండ్ కల్చరల్ అసోసియేషన్ శ్రీ శ్రీ కళావేదిక సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ ప్రతిభా పురస్కారాలు అందజేస్తారు. ఈ సంవత్సరం వారు బుధవారం సాయంత్రం విజయవాడ లోని ఫిలిం చాంబర్ ఆఫ్ కామర్స్ ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో సిద్దిపేటకు చెందిన కలకుంట్ల రాజేశ్వర్ రెడ్డి సాహిత్య రంగంలో అందించిన సేవలను గుర్తించి "అక్షర ప్రవీణ" జాతీయ పురస్కారంతో సత్కరించారు.



రాష్ట్రంలో కొత్త జిల్లాలను ఎత్తివేస్తారనేది తప్పుడు ప్రచారం. అసలు జిల్లాల రద్దు ప్రస్తావన, అలాంటి ఆలోచన కూడా ప్రభుత్వాని లేదు. అనవసర ప్రచారం చేస్తున్నారు. సింగరేణి సంస్థ ఆస్తులు దోపిడీకి గురికాకుండా కాపాడతాం. దీనిపై పూర్తి వివరాలతో రేపు మాట్లాడతానని వెల్లడించారు.

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

సిద్దిపేట నిరుద్యోగ యువతకు హరీష్ రావు గుడ్ న్యూస్

- ఉచితంగా 57 పోటీ పరీక్షలకు సిద్ధం చేసే 'హరీష్ అన్న ఉద్యోగ యాప్' ప్రారంభం





ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, జనవరి 22:
సిద్దిపేట నిరుద్యోగ యువతకు మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు మరో గుడ్ న్యూస్ అందించారు. హైదరాబాద్ వెళ్లి ఖరీదైన కోచింగ్ సెంటర్లలో చేరకుండా, ఇంటి వద్ద నుంచే పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేలా 'హరీష్ అన్న ఉద్యోగ యాప్' ను రూపొందించారు. ఈ యాప్‌ను శుక్రవారం సిద్దిపేటలో అధికారికంగా ప్రారంభించనున్నారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించిన 57 రకాల పోటీ పరీక్షలకు ఈ యాప్ ద్వారా ఉచితంగా శిక్షణ పొందే అవకాశం ఉంది. ఇందులో 2 వేల గంటల వీడియో పాఠాలు, 400 నమూనా ప్రశ్నాపత్రాలు, 4 వేల స్టడీ మెటీరియల్ పీడీఎఫ్‌లు అందుబాటులో ఉన్నాయి. రోజువారీ ఆన్‌లైన్ టెస్టులతో పాటు, సందేహాల నివృత్తికి ప్రత్యేక సమయాన్ని కూడా కేటాయించనున్నారు.ఈ యాప్‌ను హరీష్ రావు తన స్వంత ఖర్చులతో రూపొందించించగా, సిద్దిపేట నియోజకవర్గానికి చెందిన నిరుద్యోగ యువతకు పూర్తిగా ఉచితంగా అందించనున్నారు. గూగుల్ ప్లే స్టోర్‌లో ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకునే వీలుంది. తెలుగు, ఆంగ్ల భాషల్లో పాఠాలు అందుబాటులో ఉండటంతో అన్ని వర్గాల యువతకు ఉపయోగకరంగా ఉండనుంది.హైదరాబాద్ వెళ్లి కోచింగ్, రూమ్ కిరాయి, ఇతర ఖర్చులతో ఒక్కో యువత దాదాపు 50 వేల నుంచి లక్ష రూపాయల వరకు వెచ్చించాల్సిన పరిస్థితి ఉందని, ఆ భారం తగ్గించేందుకే ఈ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు హరీష్ రావు తెలిపారు. యువత ఇంటి వద్ద నుంచే కోచింగ్ తరహాలో ఆన్‌లైన్ తరగతులు వినేలా ఈ యాప్‌ను రూపొందించినట్లు చెప్పారు.మొదటి విడతలో సిద్దిపేట నియోజకవర్గానికి చెందిన వెయ్యి మంది నిరుద్యోగ యువతకు సంవత్సరం పాటు ఈ యాప్ వినియోగించే అవకాశం కల్పించనున్నారు. ఒకసారి రిజిస్టర్ అయితే ఏడాది పాటు ఎన్ని సార్లైనా వీడియో క్లాసులు వీక్షించవచ్చు.గతంలో గ్రూప్1, గ్రూప్2, పోలీస్ కానిస్టేబుల్, టెట్, ఉపాధ్యాయ ఉద్యోగాలకు ఉచిత కోచింగ్ ఇప్పించి అనేక మందికి ఉద్యోగాలు సాధించేందుకు సహకరించిన హరీష్ రావు , ఇప్పుడు ఆధునిక సాంకేతికతతో ఈ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. సిద్దిపేట నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉద్యోగాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు.

భగవంతునిపై పూర్తి విశ్వాసాన్ని కలిగి ఉండాలి



ప్రతిపక్షం, దుబ్బాక, జనవరి 22:
సృష్టికి మూలం పరమాత్మ అని, ప్రతి ఒక్కరూ భగవంతుని పై పూర్తి విశ్వాసాన్ని కలిగి ఉండాలని తొగుట రాంపురం ఆశ్రమ పీఠాధిపతి శ్రీ శ్రీ శ్రీ మాధవానంద సరస్వతి స్వామి అన్నారు. గురువారం దుబ్బాక మున్సిపాలిటీలోని చేరువాపూర్ వార్డులో గల శ్రీ శ్రీ శ్రీ అనంత మహాలక్ష్మి, పద్మనాభ స్వామి ఆలయ 25వ వార్షికోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో గణపతి పూజ, పుణ్యాహవాచనము కలశ స్థాపన, ఆవాహిత దేవత పూజ, సహస్ర పార్దివ లింగార్చన, గోపూజ, అఖండ దీప స్థాపన , అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దైవచింతనను కలిగి ఉండడం ద్వారా మానసిక ప్రశాంతత, శారీరక విశ్రాంతి దొరుకుతుందన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరూ ప్రేమ, దయా, కరుణ, ఆప్యాయత కలిగి ఉండడం ద్వారా సమాజం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన అర్చకులు వేలేటి జయరామ శర్మ, వేలేటి రామకృష్ణశర్మ, ఆలయ చైర్మన్ రాయిని అంబదాస్, ఆలయ ఫౌండర్ బొజ్జ సత్యనారాయణ,సభ్యులు కూరపాటి పెంటప్ప, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



సస్యరక్షణ చర్యలు చేపట్టండి

- మామిడి తోటల్లో అధిక దిగుబడి సాధించండి
- ఉద్యాన, పట్టు పరిశ్రమ జిల్లా అధికారి జి.సువర్ణ

ప్రతిపక్షం,నంగునూరు, జనవరి 22: మామిడి తోటల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టి అధిక దిగుబడులు సాధించాలని జిల్లా ఉద్యానవన పట్టు పరిశ్రమ అధికారి జి.సువర్ణ రైతులకు సూచించారు.సిద్ధిపేట జిల్లా నంగునూరు కోనాయిపల్లిలో మామిడి తోటల్లో యాజమాన్య పద్ధతులపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకి ముఖ్య అతిథిగా జిల్లా ఉద్యానవన, పట్టు పరిశ్రమ అధికారి జి.సువర్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాట్లాడుతూ ఉద్యాన శాఖలో అమలవుతున్న పథకాల గురించి వివరించారు. ప్లాస్టిక్ బుట్టలను 50 శాతం సబ్సిడీ మీద రైతులకు అందిస్తున్నట్లు చెప్పారు. దీని వలన పండ్లు నిలువ చేయడంతో పాటు, నాణ్యత కల్గిన పండ్లను రవాణా చేయడం సులభం అవుతుందని అన్నారు. మామిడి కాయ తొడుగులను (ఫ్రూట్ కవర్లను) రాయితీపై అందిస్తామని తెలియజేశారు.ఈ తొడుగులతో మామిడి పండ్లకు ఈగ పురుగు వల్ల కలిగే నష్టం తగ్గుతుందన్నారు. తద్వారా పండ్ల నాణ్యత మెరుగుపడి మంచి ధర లభిస్తుందని చెప్పారు. ఈ సదస్సులో ఉద్యానవన సలహాదారు నాగరాజు మాట్లాడుతూ మామిడి పూత, పిందె దశలో ఉన్నప్పుడు సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలని చెప్పారు. ఒక లీటర్ నీటికి 1.5మి.లీ.ల కాంటాఫ్ ప్లస్, ఒక లీటర్ నీటికి 1.5మి.లీ.ల ఇమిడాక్లోరోప్రైడ్, రెండు గ్రాముల సాఫ్ ను ఒక లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలని చెప్పారు. ప్రతి 15 రోజులకు ఒకసారి 3 సార్లు పిచికారీ చేయాలని సూచించారు. పండు ఈగ రాకుండా ట్రాప్స్, ఆకర్ష పేస్ట్ తోటలో అమర్చుకోవాలని తెలిపారు. మామిడి పండ్ల కోతలపై జాగ్రత్తలు వివరించారు. నీటిని తక్కువగా ఇస్తూ క్రమ క్రమంగా పెంచుకోవాలని చెప్పారు. సేంద్రియ వ్యవసాయ పద్ధతుల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో టీజీ ఆయిల్ ఫెడ్ జిల్లా అధికారి భాస్కర్ రెడ్డి, ఉద్యాన అధికారులు బాలాజి, మౌనిక, ఉద్యాన విస్తరణ అధికారి రమేశ్, ఫాల్కన్ కంపెనీ అధికారులు, రైతులు పాల్గొన్నారు



భగవద్గీత పారాయణం సకల శుభాలకు సంకేతం



ప్రతిపక్షం, దుబ్బాక, జనవరి 22:
భగవద్గీత పారాయణం సకల శుభాలకు సంకేతం అని, దీనిని చదవడం ద్వారా మానసిక ప్రశాంతత వృద్ధి చెందడంతో పాటు ఆత్మవిశ్వాసం పెంపొందుతుందని, తద్వారా జీవితంలో ఎన్నో సవాళ్లను ఎదుర్కోవచ్చని సిద్ధ సమాధి యోగ గురుజి పొలిశెట్టి .దయాకర్ తెలిపారు. గురువారం దుబ్బాక పట్టణంలోని కోమటిరెడ్డి రజనీకాంత్ రెడ్డి ఫంక్షన్ హాల్ లో ఎస్.ఎస్.వై ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు ఉచిత ధ్యానం, యోగ పై అవగాహన, సామూహిక భగవద్గీత పారాయణం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులందరికీ రెండువేల భగవద్గీత పుస్తకాలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భగవద్గీత పారాయణం చేయడం ద్వారా అజ్ఞానం తొలగి, ఆత్మజ్ఞానం చేకూరుతుందని, జీవితంలో సరైన మార్గాన్ని ఎంచుకోవడానికి అన్ని విధాలా తోడ్పడుతుందని అన్నారు.యోగ, భక్తి, కర్మ, జ్ఞానం, రాజవిద్య వంటి అన్ని విషయాల సారాన్ని భగవద్గీత అందిస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో భాస్కర శర్మ, ఎంఈఓ ప్రభుదాస్, పీఎంశ్రీ జడ్పీ జిహెచ్ఎస్ హెచ్ఎం పట్నం భూపాల్, రజనీకాంత్ రెడ్డి పాఠశాల వ్యవస్థాపక ఛైర్మెన్ కోమటిరెడ్డి రజనీకాంత్ రెడ్డి, ప్రభుత్వ రిటైర్డు ప్రధానోపాధ్యాయుడు నక్క . పర్షరాములు, పలు పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మెదడుకు పదునుపెట్టిన సాంకేతికోత్సవం

- గీతంలో ఎపోచ్ 4.0 పేరిట మూడు రోజుల సాంకేతిక నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు.



ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, జనవరి 22 : హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో ఎపోచ్ 4.0 పేరిట ఈనెల 20 నుంచి 22 వరకు నిర్వహించిన సాంకేతికోత్సవాలు విద్యార్థుల మెదడుకు పదును పెట్టాయి. గీతం స్టూడెంట్స్ క్లబ్ సహకారంతో గిట్ హబ్ కమ్యూనిటీ నిర్వహించిన ఈ పోటీలు ఆచరణాత్మక అభ్యాసం, పరస్పర సహకారం, అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలపై పట్టును పెంపొందించే లక్ష్యంతో సాగాయి. టెక్ ట్రివియాతో ఆరంభమైన ఈ కార్యక్రమం, సాఫ్ట్ వేర్ అభివృద్ధి, హార్డ్ వేర్, సైబర్ భద్రత, టెక్ చరిత్ర, అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలలో పాల్గొన్న వారి జ్ఞానాన్ని పరీక్షించేలా పోటీలు సాగాయి. దీని తరువాత డాకర్ 101 అనే ఆచరణాత్మక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇది విద్యార్థులను కంటైనరైజేషన్ కు పరిచయం చేసింది. ఇందులో కోర్ డాకర్ భావనలు, ఇన్ స్టాలేషన్, ముఖ్యమైన ఆదేశాలు, ఇమేజ్ బిల్డింగ్, కంటైనర్ నిర్వహణ వంటివి ఉన్నాయి. రెండవ రోజు, ఓపెన్‌సోర్స్ డెవలప్ మెంట్ పై జరిగిన కార్యక్రమం ద్వారా సహకార అభివృద్ధి పద్ధతులపై దృష్టి సారించారు. ఇక్కడ విద్యార్థులకు గిట్ హబ్ వంటి ప్లాట్ ఫామ్ లపై ఓపెన్‌సోర్స్, సహకార వర్క్ ఫ్లోలను పరిచయం చేశారు. కాల పరిమితితో వినూత్న సాధనాలను రూపొందించడానికి, నిర్మించడానికి బృందాలను ప్రోత్సహించే ఉత్పాదకత సాధన కోడింగ్ ఛాలెంజ్ తో రెండో రోజు ముగిసింది. ఇక చివరి రోజున, ఆధునిక వెబ్ అప్లికేషన్ల కోసం పూర్తి ప్రాంప్ట్‌టుప్రొడక్షన్ వర్క్ ఫ్లోను ప్రదర్శించే కార్యశాల ప్రాంప్ట్‌టు పేజ్, ఆ తరువాత ట్రెజర్ హంట్, సమస్యపరిష్కారాన్ని నిర్వహించారు. చివరగా, లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్ (ఎల్ఎల్ఎం)పై ఒక విజ్ఞానదాయక కార్యక్రమంతో ఎపోచ్ ముగిసింది. ఇందులో వాటి పరిమాణం, వినియోగం, ఓపెన్‌సోర్స్ ఏఐ పర్యావరణ వ్యవస్థలోని పోకడలపై దృష్టి సారించారు.ఉత్సాహభరితమైన వాతావరణానికి తోడు, ఈ కార్యక్రమం ఆసాంతం టెక్ ఆధారిత ఆటలు, సవాళ్లతో కూడిన ముఖాముఖి నేర్చుకునేలా స్టాళ్లను గిట్ హబ్ సభ్యులు ఏర్పాటు చేశారు. ఇది ఉత్సాహభరితమైన భాగస్వామ్యాన్ని ఆకర్షించడంతో, ఈ మూడు రోజులలో దాదాపు 200 మందికి పైగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. మొత్తంమీద, ఎపోచ్ 4.0 విద్యార్థులకు సాంకేతిక నైపుణ్యాలు, విశ్వాసాన్ని పెంపొందించడానికి, అభ్యాసం, పోటీ, సహకారం ద్వారా వాస్తవప్రపంచ సాఫ్ట్ వేర్ అభివృద్ధిపై ఆచరణాత్మక అవగాహనను ఏర్పరచుకోవడానికి ఒక చక్కని వేదికను అందించింది.



గ్రామస్థాయిలో రోడ్డు ప్రమాదాల నివారణలో సర్పంచుల పాత్ర కీలకం

- రోడ్డు భద్రత నియమాలపై సర్పంచులతో ప్రతిజ్ఞ.
- మెదక్ జిల్లా అదనపు ఎస్పీ మహేందర్.

ప్రతిపక్షం,మెదక్ టౌన్ జనవరి 22: మెదక్, హవెలిఘనపూర్, నార్సింగి మండలాలకు చెందిన 100 మంది నూతనంగా ఎన్నికైన సర్పంచుల కోసం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో భాగంగా, మెదక్ జిల్లా అదనపు ఎస్పీ ఎస్. మహేందర్ "Arrive Alive" రోడ్డు భద్రతా అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ..గ్రామ స్థాయిలో రోడ్డు ప్రమాదాలను నివారించడంలో సర్పంచుల పాత్ర అత్యంత కీలకమని తెలిపారు. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, చిన్న నిర్లక్ష్యమే పెద్ద ప్రమాదాలకు దారి తీస్తుందని తెలిపారు. హెల్మెట్ ధరించడం, సీటుబెల్ట్ వినియోగం, మద్యం సేవించి వాహనం నడపకూడదని, మొబైల్ ఫోన్ ఉపయోగిస్తూ డ్రైవింగ్ చేయరాదని, వేగ నియంత్రణ పాటించలని, ట్రాఫిక్ నియమాలు తప్పనిసరిగా పాటించాల్సిన అవసరం వంటి అంశాలపై సర్పంచులకు అవగాహన కల్పించారు. గ్రామాల్లో విద్యార్థులు, యువత, వాహనదారులలో రోడ్డు భద్రతపై అవగాహన పెంచేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు."Arrive Alive" కార్యక్రమం లక్ష్యం ఒక్క ప్రాణం కూడా రోడ్డు ప్రమాదంలో కోల్పోకుండా చూడటమేనని ఆయన తెలిపారు. చివరగా సర్పంచులతో రోడ్డు భద్రతా నియమాల పై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో మెదక్ డియస్పి ప్రసన్న కుమార్, జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య, జడ్పీ సీఈఓ ఎల్లయ్య, మెదక్ టౌన్ సీఐ మహేష్, నూతన సర్పంచులు,పోలీస్ సిబ్బంది, పాల్గొన్నారు.



ఉదారత చాటుకున్న అత్తు ఇమామ్

- బ్రెస్ట్ క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న రోగికి 10,000 రూపాయల సహాయం అందజేత


ప్రతిపక్షం బ్యూరో సిద్దిపేట జనవరి 22:
బ్రెస్ట్ క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న వివాహిత కు వైద్య ఖర్చుల నిమిత్తం 10,000 రూపాయలు అందజేసి సిద్దిపేట కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ తన ఉదారతను చాటుకున్నారు. సిద్దిపేట పట్టణం లోని 9వ వార్డుకు చెందిన గాయత్రి అనే వివాహిత మహిళా గత కొన్ని రోజులుగా బ్రెస్ట్ క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నది. వైద్య ఖర్చులకు డబ్బులు కూడా లేని దీన పరిస్థితిలో ఉండటంతో విషయాన్ని సిద్దిపేట కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే స్పందించిన సిద్దిపేట కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ వైద్య ఖర్చుల నిమిత్తం 10 వేల రూపాయలు అందజేశారు. ఈ సందర్భంగా సిద్దిపేట కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ మాట్లాడుతూ 9వ వార్డులో గాయత్రి అనే మహిళ కుటుంబం చాలా నిరుపేద కుటుంబం అని అన్నారు. కూలీ పనులు చేస్తూ ఇద్దరు పిల్లలు భర్తతో కలిసి జీవనం సాగిస్తున్నరు అని అన్నారు. కొన్నినెలలుగా బ్రెస్ట్ క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నరు అని అన్నారు. గాయత్రికి క్యాన్సర్ వ్యాధి సబంధించిన చికిత్స చేసుకునేందుకు డబ్బులు లేవు అని అన్నారు. గాయత్రికి వైద్య ఖర్చులు భరించేలా మా కాంగ్రెస్ ప్రభుత్వం ఇంచార్జ్ మంత్రి వివేక్ మంత్రి పొన్నం ప్రభాకర్,మంత్రి దామోదర్ రాజనర్సింహ, మల్కాజ్గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు,సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి దృష్టికి తీసుకువెళ్లేందుకు కృషి చేస్తా అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం గాయత్రి కుటుంబానికి అండగా ఉంటుంది అని అధైర్య పడొద్దు అని అన్నారు. మెరుగైన వైద్యం అందించేలా ప్రభుత్వం దృష్టికి తీసుకవెళ్తా అని అన్నారు. క్యాన్సర్ తో బాధపడుతున్న గాయత్రి కుటుంబానికి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు వచ్చేందుకు కలెక్టర్ హైమావతి కి వివరిస్తా అని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలకుంట మహేందర్ తప్పెట శంకర్ గ్యాదరి మధు గయాసుద్దీన్ సాయి.బాబా. ఫరీద్ సాదిక్ తదితరులు పాల్గొన్నారు.

నేడు రవీంద్రభారతిలో సంకల్ప యువ పురస్కారాల ప్రధానోత్సవం

ప్రతిపక్షం బ్యూరో సిద్దిపేట, జనవరి 22:









సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 23న రాష్ట్రస్థాయి సంకల్ప యువ పురస్కారాల ప్రధానోత్సవం కార్యక్రమాన్ని నేతాజీ సుభాష్‌చంద్రబోస్ 129వ జయంతి సందర్భంగా హైదరాబాద్ రవీంద్రభారతిలో ఘనంగా నిర్వహించనున్నట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు, రాష్ట్ర గవర్నర్ చేతుల మీదుగా రాష్ట్రస్థాయి సిల్వర్ గోల్డ్ అవార్డు గ్రహీత వలస సుభాష్ చంద్రబోస్ తెలిపారు.సిద్దిపేట జిల్లా కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ...తన తండ్రి వలస శంకరయ్య జ్ఞాపకార్థంగా రాష్ట్రంలో సామాజిక సేవా రంగంలో విశిష్ట సేవలు అందించిన యువకులు, మహిళలకు ఈ పురస్కారాలు అందజేయనున్నట్లు చెప్పారు. రెండు దశాబ్దాలు పూర్తిచేసుకున్న సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ వార్షికోత్సవాన్ని కూడా ఈ సందర్భంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సాంస్కృతిక కార్యక్రమాలు నృత్య కళాకారిణి రమ బృందం చే ప్రదర్శించబడతాయని, సామాజిక సేవా రంగంలో నిస్వార్థంగా సేవలందిస్తున్న 20 మందికి రాష్ట్రస్థాయి సంకల్ప యువ పురస్కారాలు ప్రదానం చేయనున్నట్లు ఆయన తెలిపారు. వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరవుతారని పేర్కొన్నారు.

సింగరేణి టెండర్ల ప్రక్రియపై సిట్ ద్వారా విచారణ జరపాలి

- బి ఆర్ఎస్ నాయకులు




ప్రతిపక్షం బ్యూరో సిద్దిపేట జనవరి 22:
రాష్ట్రానికి అతి పెద్ద ఆయువుపట్టు అయిన సింగరేణి ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన సంబంధికులకు కట్టబెట్టేందుకు చూస్తున్నారని బి.ఆర్.ఎస్ రాష్ట్ర నాయకులు పాల సాయిరాం, ఎడ్ల సోమిరెడ్డిలు ఆరోపించారు. సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బి ఆర్ ఎస్ నాయకులు కోలా రమేష్ గౌడ్ తో కలిసి వారు మాట్లాడారు. 137 ఏళ్ల చరిత్ర, 50 వేల మంది ఉద్యోగులు ఉన్న సింగరేణిని బొగ్గు కొనే ఔట్సోర్సింగ్ సంస్థ లాగా రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్నట్లు ఆరోపించారు. నైని కోల్ బ్లాక్ టెండర్ల వ్యవహారం అంతా తన బావమరిది సృజన్ రెడ్డికి కాంట్రాక్టు కట్టబెట్టడం కోసమేనని మండిపడ్డారు. ఈ టెండర్ల విషయంపై కేంద్ర బొగ్గు గాని శాఖ మంత్రి కిషన్ రెడ్డి సైట్ విజిటింగ్ చేసి టెండర్ల వ్యవహారం పై సుమోటో కేసు నమోదు చేసి విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందు రేవంత్ రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమయ్యారని,హామీల అమలు విషయాన్ని ప్రజల్లో ప్రశ్నిస్తున్నందుకే మాజీ మంత్రి హరీష్‌రావు పై అక్రమ కేసులు, అక్రమ విచారణలు చేస్తున్నారని అన్నారు. అంతేకాకుండా తన ప్రభుత్వంలో మంత్రులైన వారిపై మీడియాకు లీకులు ఇచ్చేది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని ఆరోపించారు. మాజీ మంత్రి హరీష్‌రావు పై ఎన్ని నిర్బంధ చర్యలు చేసినా హరీష్‌రావు ప్రజల పక్షాన పోరాటం చేస్తారని గుర్తు చేశారు. సింగరేణి టెండర్ల ప్రక్రియపై సిట్ ద్వారా విచారణ సాగిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం బాగోతం అంతా బయటపడుతుందన్నారు. ఇప్పటికైనా కోల్ బ్లాక్ టెండర్లపై ప్రజలకు స్పష్టత ఇవ్వాలని, తెలంగాణ ప్రజల ధనం లూటీ చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఈ మీడియా సమావేశంలో బి ఆర్ ఎస్ నాయకులు ఆంజనేయులు, శ్రీనివాస్ రెడ్డి పలువురు పాల్గొన్నారు.

సిద్దిపేటలో అంగరంగ వైభవంగా సీతారామచంద్రుల కళ్యాణం

ప్రతిపక్షం,సిద్దిపేట టౌన్, జనవరి 22:
లోక కళ్యాణార్థం సిద్దిపేట లో శ్రీ సీతారామచంద్రుల కళ్యాణం నిర్వహించామని కౌన్సిలర్ దీప్తి నాగరాజు, ఉత్సవ నిర్వాహక కమిటీ నాయకులు లక్ష్మీనాథం తెలిపారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని సుభాష్ రోడ్డులో శివ్వ కాంప్లెక్స్, సుభాష్ రోడ్డు దుకాణ సముదాయాల ఆధ్వర్యంలో సీతారాముల కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. కళ్యాణం అనంతరం భక్తులకు అన్న ప్రసాద వికరణ కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అయోధ్యలో బాల రాముడి ప్రాణ ప్రతిష్ట జరిగి రెండు సంవత్సరాలు నిండిన సందర్భంగా ద్వితీయ వార్షికోత్సవంలో భాగంగా సిద్దిపేటలో కళ్యాణం నిర్వహించామన్నారు. ఆ సీతారాముల చల్లని దీవెనలు ప్రజలందరిపై ఉండాలని.... వర్షాలు సమృద్ధిగా కురిసి పాడి పంటలు బాగుండాలని ఆకాంక్షించారు. కళ్యాణ మహోత్సవంలో పాల్గొని స్వామివారి ప్రసాదం స్వీకరించిన వారందరికీ ధన్యవాదాలు.



ప్రాంతీయం



జనసేనపై జరుగుతున్న దుష్ప్రచారాలను తీవ్రంగా ఖండించాలి. ఈ మధ్య కాలంలో వ్యక్తుల మధ్య జరుగుతున్న ఘర్షణలు, ఆర్థిక లావాదేవీలు, కుల విభేదాలను జనసేనకు ఆపాదించాలని కొందరు కిరాయి వక్తలు, మాధ్యమాలు కుట్రలు పన్నుతున్నాయి. వివాహేతర సంబంధాల రచ్చను కూడా రుద్దాలని చూస్తున్నాయి. అన్నివేళలా అప్రమత్తంగా ఉండాలి.
- పార్టీ నాయకులతో పవన్ కళ్యాణ్

ప్రాంతీయం

సుప్రీం మార్గదర్శకాలను ఉల్లంఘిస్తున్న విద్యాసంస్థల గుర్తింపు రద్దు చేయాలి

- సావుల ఆదిత్య, ఏబీవీపీ సిద్దిపేట జిల్లా కన్వీనర్

ప్రతిపక్షం బ్యూరో సిద్దిపేట జనవరి 22:



సుప్రీంకోర్టు మార్గదర్శకాలు, రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులను తుంగలో తొక్కుతూ వ్యవహరిస్తున్న సిద్దిపేట జిల్లా కేంద్రంలోని శ్రీ చైతన్య, నారాయణ, రావుస్, ఎస్సార్, ఆల్ ఫోర్స్ తదితర కార్పొరేట్ విద్యాసంస్థల గుర్తింపును తక్షణమే రద్దు చేయాలని ఏబీవీపీ సిద్దిపేట జిల్లా కన్వీనర్ సావుల ఆదిత్య డిమాండ్ చేశారు. గురువారం సిద్దిపేట జిల్లా విద్యాశాఖ అధికారికి ఫిర్యాదు అందజేసిన అనంతరం ఆదిత్య మాట్లాడుతూ...అక్టోబర్ 2025 వరకు 100 శాతం ఫీజు చెల్లించాలని విద్యార్థులపై ఒత్తిడి తెస్తూ, మానసికంగా వేధింపులకు గురిచేస్తున్నారని ఆరోపించారు.40 శాతం ఫీజు చెల్లించినా కూడా 100 శాతం ఫీజు కట్టలేదనే కారణంతో విద్యార్థులను అందరి ముందే అవమానిస్తూ, శారీరకంగా హింసించి, తరగతి బయట గంటల తరబడి నిలబెట్టడం, ప్రిన్సిపాల్ గది ముందు నిలబెట్టడం, పరీక్షలు రాయనీయకపోవడం వంటి చర్యలకు పాల్పడుతున్నారని తెలిపారు.30%, 40% లేదా 50% ఫీజు చెల్లించిన విద్యార్థులను మిగతా విద్యార్థులతో కలిసి కూర్చోనివ్వకుండా బయట వరండాల్లో నిలబెట్టడం ద్వారా వివక్ష చూపుతున్నారని విమర్శించారు.టార్గెట్ల పేరుతో విద్యార్థులను అందరి ముందు దూషించడం, అవమానపరచడం జరుగుతోందని, మార్కుల ఆధారంగా 'టాపర్ బ్యాచ్', 'డల్ బ్యాచ్'లుగా విభజించి విద్యార్థులను కించపరుస్తున్నారని అన్నారు. ఈ విధంగా కార్పొరేట్ విద్యాసంస్థలు "సెక్షన్ దందాలు" చేస్తున్నాయని, వీటిపై అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం విద్యార్థుల మానసిక ఆరోగ్య పరిరక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కఠినమైన నిబంధనలను అన్ని విద్యాసంస్థలు తప్పనిసరిగా అమలు చేయాలని తెలిపారు. అయితే, శ్రీ చైతన్య తదితర కార్పొరేట్ విద్యాసంస్థలు ఈ ఉత్తర్వులను పూర్తిగా ఉల్లంఘిస్తున్నాయని ఆరోపించారు.మానసిక ఆరోగ్య పాలసీని తమ వెబ్ సైట్లలో అప్డేట్ చేయకపోవడం, నోటీస్ బోర్డుల్లో ప్రదర్శించకపోవడం నిబంధనలకు విరుద్ధమని అన్నారు.సుప్రీంకోర్టు నిబంధనల ప్రకారం 100 మందికి పైగా విద్యార్థులు ఉన్న పాఠశాలల్లో తప్పనిసరిగా అర్హత కలిగిన సైకాలజిస్ట్ లేదా కౌన్సిలర్‌ను నియమించుకోవాల్సి ఉన్నప్పటికీ, కార్పొరేట్ విద్యాసంస్థలు దీనిని కూడా పాటించడం లేదన్నారు.ఈ అన్ని కారణాల వల్ల సుప్రీంకోర్టు నిబంధనలను ఉల్లంఘిస్తున్న కార్పొరేట్ విద్యాసంస్థల గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అవసరమైతే ఏబీవీపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా సంఘటన మంత్రి లక్ష్మీపతి, నగర కార్యదర్శి పరుశురాం, విభాగ్ హాస్టల్స్ కన్వీనర్ భాను, తదితర నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



యువత క్రీడల్లో రాణించాలి

ప్రతి పక్షం,దౌల్తాబాద్, జనవరి 22:

యువత క్రీడల్లో రాణించాలని సర్పంచ్ అనురాధ రమేష్ అన్నారు.బుధవారం మండల కేంద్రమైన దౌల్తాబాద్ లో నిర్వహించిన క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడలతో యువతకు మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దృఢత్వం కలుగుతుందని అన్నారు. పట్టుదలతో ఆటలలో పాల్గొనాలని, ఆటలలో గెలుపోటములు సహజమేనని పట్టుదలతో ముందుకు వెళ్తే దేనినైనా సాధించవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ ఎంపీడీవో సయ్యద్ గఫూర్ ఖాద్రి, మండల విద్యాధికారి కనకరాజు, ఉప సర్పంచ్ ఆది బాలకృష్ణ తో పాటు ఉపాధ్యాయులు, పీఈటీలు, వార్డు సభ్యులు పాల్గొన్నారు..



ఫార్మర్ రిజిస్ట్రేషన్‌ను వేగవంతం చేయాలి

- జిల్లా వ్యవసాయ అధికారి స్వరూప రాణి

ప్రతి పక్షం,దౌల్తాబాద్, జనవరి 22:

ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి స్వరూప రాణి అన్నారు. గురువారం దౌల్తాబాద్, దొమ్మాట, ముబారస్ పూర్ రైతు వేదికలో ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పీఎం కిసాన్, ఎరువుల బస్తాలు, పంట దిగుబడి కొనుగోళ్లకు మద్దతు ధర పంట రుణాల వంటి పథకాలకు ఫార్మర్ రిజిస్ట్రేషన్ కీలకమని తెలిపారు. రైతులు ప్రభుత్వ పథకాలు పొందడానికి వీలుగా తమ భూమి వివరాలను తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని అన్నారు. ఒక రైతు కూడా రిజిస్ట్రేషన్ నుంచి తప్పిపోకుండా గ్రామస్థాయిలో ప్రత్యేక చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. క్షేత్రస్థాయిలో వ్యవసాయ విస్తరణ అధికారులు రైతులకు అవగాహన కల్పిస్తూ రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలన్నారు. రైతులు కూడా నిర్లక్ష్యం చేయకుండా అవసరమైన ధ్రువీకరణ పత్రాలతో రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో దుబ్బాక ఏడిఏ మల్లయ్య, ఏవో సాయికిరణ్, ఏఈవోలు సంతోష్, రజనీకాంత్,నరేష్ రెడ్డి, ప్రవళిక తదితరులు పాల్గొన్నారు..

నేడే వసంత పంచమి, సాముహిక అక్షరాభ్యాసాలు

ప్రతిపక్షం,మెదక్ టౌన్ జనవరి 22





మెదక్ మండల పరిధిలోని పేరురూలోని గరుడ గంగ సర స్వతీ మాత ఆలయ 24వ వార్షికోత్సవం , జాతర వేడుకలకు ముస్తాబైంది. 23న వసంత పంచమి రోజున చిన్నారులకు సాముహిక అక్షరాభ్యాసాలు,ఒడి బియ్యం, రథోత్సవం, బండ్ల ఊరేగింపు తదితర కార్యక్రమాలు విశేషంగా నిర్వహిస్తామని చండీ ఉపాసకుడు, ఆలయ నిర్వాహకుడు దోర్బల రాజమౌళి శర్మ , మహేష్ శర్మ తెలిపారు. గరుడ గంగ (మంజీరా నది) తీరాన కొలువుదీరిన సరస్వతీ ఆలయం ఎంతో విశిష్టతను సంతరించకున్నది. పేరూరులో మంజీర తీరాన మహా సరస్వతీ రూపంలో ఆలయాన్ని నిర్మించారు. జనమేజయుడు సర్ప యాగం చేసిన గరుడ గంగ ఒడ్డున ఆలయం నిర్మితమైందని చెప్తారు. ఇక్కడి విబూది గుండం ఉంది. ఇప్పటికీ భూమి నుంచి విబూది రావడం విశేషం.



గౌడ సంఘం అధ్యక్షుడిగా ముత్యం నర్సింహాలు

ప్రతిపక్షం, కొమురవెల్లి, జనవరి 22:

కొమురవెల్లి మండలకేంద్రంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేసుకొని నూతన కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా గౌరవ అధ్యక్షులుగా దొమ్మాట సత్తయ్య గౌడ్,అధ్యక్షులుగా ముత్యం నర్సింహాలు గౌడ్, ఉపాధ్యక్షులుగా బత్తిని శివయ్య గౌడ్, శివలింగు రమేష్ లను, ప్రధాన కార్యదర్శిగా తాళ్లపల్లి రాజు గౌడ్, కోశాధికారిగా ముత్యం కనుకయ్య గౌడ్, కార్యదర్శి గా దొడ్ల విష్ణుమూర్తి లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ సంఘం బలోపేతానికి కృషి చేస్తానన్నారు.ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు దొడ్ల బిక్షపతి, ముత్యం ఉప్పలయ్య, ముత్యం యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



ఐద్వా జాతీయ మహాసభలను జయప్రదం చేయండి

- ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి జాలిగపు శిరీష పిలుపు

ప్రతిపక్షం బ్యూరో సిద్దిపేట జనవరి 22:

ఈనెల 25 నుండి 28 వరకు హైదరాబాద్ నగరంలో జరగనున్న అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) 14వ జాతీయ మహాసభల ప్రారంభ రోజు 25వ తేదీన నిర్వహించనున్న బహిరంగ సభను జయప్రదం చేయాలని ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి జాలిగాపు శిరీష పిలుపునిచ్చారు. గురువారం సిద్దిపేట అర్బన్ శ్రీనగర్ కాలనీలో ఐదవ 14 వ జాతీయ మహాసభ వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జాలిగాపు శిరీష మాట్లాడుతూ యువతీ,యువకులు దేశ భవిష్యత్తు భరించాల్సిన బాధ్యత ఉన్నదని, వారికి సరైన మార్గదర్శనం కోసం మహిళా సంఘం వివిధ ఉద్యమాలు, పోరాటాలు నిర్వహిస్తున్నదని పేర్కొన్నారు. విద్యపై దృష్టి పెట్టాలని, మత్తు పదార్థాలు,మద్యపానం వంటి చెడు అలవాట్లను విడనాడాలని యువతకు పిలుపునిచ్చారు.మహిళలపై జరుగుతున్న దాడులకు మద్యం, అశ్లీలత వంటి సామాజిక వ్యాధులే కారణమని పేర్కొంటూ, ప్రభుత్వాలు వీటిని నిరోధించడంలో గట్టి చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. ఐద్వా పోరాటాల ఫలితంగా మహిళలకు అనేక చట్టాలు, రక్షణలు లభించాయని , అయినప్పటికీ నేరాలు తగ్గకపోవడం తీవ్రమైన ఆందోళనకర విషయం అని వ్యాఖ్యానించారు.బిల్కిస్ బానో కేసు ఉదాహరణగా తీసుకుంటూ, నిందితులు ఎదేక్షగా తిరుగుతూ బాధితులు శిక్షపడుతున్న పరిస్థితి ప్రభుత్వాల వైఫల్యాన్ని చూపుతోందని విమర్శించారు. బిల్కిస్ కుటుంబానికి అండగా నిలిచి పోరాడి నిందితులను తిరిగి జైలుకు పంపించడంలో మహిళా సంఘం పాత్ర చారిత్రకమని ఆమె తెలిపారు. గృహ హింస చట్టం, ఆస్తి హక్కు చట్టం, మహిళలకు రిజర్వేషన్లు, ఇవన్నీ ఐద్వా ఉద్యమాల ఫలితమని ఆమె గుర్తు చేశారు. అయినప్పటికీ కేంద్ర ప్రభుత్వం 33% మహిళా రిజర్వేషన్ చట్టం అమలులో ఘోరంగా విఫలమైందని పేర్కొంటూ వెంటనే చట్టసభలలో మహిళలకు రిజర్వేషన్లు కల్పించాలని ఆమె డిమాండ్ చేశారు.మహిళల అభ్యున్నతి కోసం భవిష్యత్ ఉద్యమాలకు సంబంధించిన తీర్మానాలు జాతీయ మహాసభలలో ఆమోదించనున్నట్లు, దేశవ్యాప్తంగా 1000 మంది ప్రతినిధులు హాజరుకానున్నట్లు తెలిపారు. తెలంగాణలో ఐద్వా జాతీయ మహాసభలు జరగడం ఇదే మొదటిసారి అని ప్రత్యేకంగా పేర్కొన్నారు. ఈ సందర్భంగా యువత కవాతు, సాంస్కృతిక కార్యక్రమాలు, ఇతర ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు తెలిపారు .25న జరగనున్న బహిరంగ సభకు జాతీయ నాయకులు హాజరవుతారని, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యురాలు దండు లక్ష్మి, హరిత, సిరసనగండ్ల రజిని, మంజుల, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పెద్దమాసన్‌పల్లిలో రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం

- ముఖ్య అతిథిగా పాల్గొన్న కమిషనర్ రష్మీ పెరుమాల్..
- సర్పంచ్ ఆధ్వర్యంలో 100హెల్మెట్లు పంపిణి!

ప్రతిపక్షం,తొగుట, జనవరి 22



తొగుట మండల కేంద్రంలోని పెద్ద మాసన్ పల్లి గ్రామంలో అరైవ్అలైవ్ కార్యక్రమం లో భాగంగా సిద్దిపేట్ కమిషనర్ రష్మీ పెరుమాల్ ముఖ్య అతిథి గా పాల్గొన్నారు..ఈ సందర్భంగా కమిషనర్ రష్మీ పెరుమాళ్,ఐపీఎస్ మాట్లాడుతూ సిద్దిపేట జిల్లా కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత తాను సందర్శించిన మొదటి గ్రామం ఇదేనని, అందుకే పెద్దమాసన్‌పల్లి గ్రామస్తులందరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ జిల్లాలోనే ఒక 'ఆదర్శ గ్రామంగా' నిలవాలని ఆమె పిలుపునిచ్చారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ఇది కేవలం పోలీసుల కోసం కాదని, మీ కుటుంబ భద్రత కోసమని సూచించారు. గ్రామస్తులతో నేరుగా ముచ్చటించి, రహదారి భద్రతపై వారికి ఉన్న సందేహాలను నివృత్తి చేశారు....సామాజిక బాధ్యతగా 100 హెల్మెట్లను విరాళంగా ఇచ్చిన సర్పంచ్ పన్యాల ప్రవీణ్ కుమార్ రెడ్డి ని ఈ సందర్భంగా కమిషనర్ ప్రత్యేకంగా అభినందించారు.హెల్మెట్ల పంపిణీ అనంతరం హెల్మెట్లు ధరించిన వాహనదారులతో నిర్వహించిన బైక్ ర్యాలీని కమిషనర్ జెండా ఊపి ప్రారంభించారు. "హెల్మెట్ ధరించండి సురక్షితంగా ఇంటికి చేరండి" అనే నినాదంతో ఈ ర్యాలీ సాగింది.ఈ కార్యక్రమంలో గజ్వేల్ ఏసీపీ నర్సింలు, తొగుట సీఐ లతీఫ్, ఎస్సై రవికాంత్, గ్రామ ఉప సర్పంచ్ బోయిని శ్రీనివాస్ ప్రజా ప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.



ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

- సర్పంచ్ అనురాధ రమేష్

ప్రతి పక్షం,దౌల్తాబాద్, జనవరి 22:

గ్రామాల్లో నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని దౌల్తాబాద్ గ్రామ సర్పంచ్ అనురాధ రమేష్ పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రమైన దౌల్తాబాద్‌లో బాలాజీ న్యూరో హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రజలకు పెద్ద ఆసుపత్రులకు వెళ్లడం ఆర్థికంగా, రవాణా పరంగా కష్టంగా మారుతున్న నేపథ్యంలో ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని అన్నారు. చిన్న చిన్న ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా ప్రారంభ దశలోనే వైద్య పరీక్షలు చేయించుకోవడం వల్ల భవిష్యత్తులో తీవ్ర అనారోగ్యాల నుంచి బయటపడవచ్చని తెలిపారు.ఈ వైద్య శిబిరంలో వైద్యులు బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై వైద్య సేవలు పొందడం అభినందనీయమని సర్పంచ్ పేర్కొన్నారు.ప్రభుత్వంతో పాటు ప్రైవేటు ఆసుపత్రులు కూడా సామాజిక బాధ్యతతో గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి సేవలు అందించడం శుభపరిణామమని, భవిష్యత్తులో మరిన్ని వైద్య శిబిరాలను నిర్వహించేందుకు గ్రామపంచాయతీ తరఫున సహకారం అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఆది బాలకృష్ణ, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ వార్డు సభ్యులు పాల్గొన్నారు

విద్యకు పెద్దపీట వేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

- సిద్దిపేట కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్

ప్రతిపక్షం బ్యూరో సిద్దిపేట జనవరి 22:



తెలంగాణ రాష్ట్రంలో విద్యాభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారని సిద్దిపేట కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ అన్నారు. సిద్దిపేట మండలం మిట్టపల్లి గ్రామంలో ఉన్న తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలో 2026-27 విద్యాసంవత్సరానికి గాను 5వ తరగతి నుంచి ఇంటర్ వరకు అడ్మిషన్లను అత్తు ఇమామ్ అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని, అందులో భాగంగానే తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యారంగానికి అవసరమైన నిధులు కేటాయిస్తూ, హాస్టల్ విద్యార్థుల మెస్, కాస్మోటిక్ చార్జీలను పెంచిందని తెలిపారు.విద్యార్థులు కష్టపడి చదివి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో బకాయిపడిన ఫీజు రీయింబర్స్‌మెంట్ మొత్తాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెల్లిస్తున్నారని గుర్తు చేశారు.మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలో ఎలాంటి సమస్యలు లేదా ఇబ్బందులు ఉన్నా వాటి పరిష్కారానికి తాను కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని, రాబోయే రోజుల్లో విద్యార్థుల సంఖ్య పెంచేలా అధికారులు కృషి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ రియాజ్ , తప్పేట శంకర్, గ్యాదరి మధు, గయాసుద్దీన్, నజ్జు, ఫయాజ్ , బాబా ఫరీద్, సాదిక్ తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సాండ్ బజార్ ద్వారా ఇసుక అమ్మకం వేగం పెంచాలి

- మెదక్ సాండ్ బజార్ ను పరిశీలించిన కలెక్టర్ రాహుల్ రాజ్

ప్రతిపక్షం,మెదక్ టౌన్,జనవరి 22



మెదక్ సాండ్ బజార్ ను మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ గురువారం పరిశీలించారు.సాండ్ బజార్ ఇసుక అమ్మకాలు వేగంగా జరగాలని అధికారులకు సూచించారు. స్థానికుల అవసరాలు తీర్చేందుకే ఇసుక రీచ్ లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. తక్కువ ధరకు ఇసుకను అందించడమే తమ లక్ష్యమన్నారు. ఇసుక అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటామని,ఈ క్రమంలో ఆన్‌లైన్‌లో మన ఇసుక వాహనం వెబ్ సైట్ ద్వారా ఇసుకను బుక్ చేసుకున్న వినియోగదారులకు తక్కువ ధరలకు అధికారికంగా ఇసుకను అందిస్తున్నామన్నారు.కలెక్టర్ వెంట మెదక్ తాసిల్దార్ లక్ష్మణ్ బాబు, మైనింగ్ ఆర్ ఐ లక్ష్మీనారాయణతదితరులు ఉన్నారు.

ఉపాధి హామీ పథకంలో గాంధీ పేరు తొలగిస్తే మరో ఉద్యమం

- కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మహదేవుని శ్రీనివాస్.

ప్రతిపక్షం, కొమురవెల్లి, జనవరి 22 :



ఉపాధి హామీ పథకంలో మహాత్మా గాంధీ పేరు తొలగిస్తే మరో ఉద్యమం చేస్తామని కాంగ్రెస్ పార్టీ కొమురవెల్లి మండల అధ్యక్షుడు మహదేవుని శ్రీనివాస్ అన్నారు. గురువారం ఏఐసీసీ, పీసీసీ పిలుపులో భాగంగా జనగామ నియోజకవర్గ ఇన్చార్జ్ కొమ్మూరి ప్రతాప రెడ్డి, సిద్దిపేట జిల్లా డీసీసీ అధ్యక్షులు ఆంక్షరెడ్డి ఆదేశాలమేరకు గురువారం కొమరవెల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహదేవుని శ్రీనివాస్ ఆధ్వర్యంలో మండలంలోని గౌరాయపల్లి, అయినాపూర్, రసులాబాద్, రామ్ సాగర్ గ్రామాలలో ఉపాధి హామీ పనిచేసే వాళ్ళ దగ్గరికి వెళ్లి ఈ పథకం రద్దు చేస్తే వచ్చే నష్టాలను వారికి వివరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మహదేవుని శ్రీనివాస్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో బడుగు బలహీన వర్గాలకు ఉపాధి కల్పించేందుకు గాంధీ ఉపాధి హామీ పథకం పేరుతో అప్పటి యూపీఏ ప్రభుత్వం ఏర్పాటు చేస్తే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మహాత్మా గాంధీ పేరును తొలగిస్తే మరో ఉద్యమానికి కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు. దేశం కోసం శాంతియుతంగా ఉద్యమం చేసి స్వాతంత్రం తెచ్చిన జాతిపిత మహాత్మా గాంధీని ప్రపంచదేశాలు ఆదర్శంగా తీసుకొని పూజిస్తుంటే మనదేశంలో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ప్రభుత్వం మహాత్మా గాంధీ పేరు ఉనికి లేకుండా కుట్ర పన్నుతుందని అన్నారు. మహాత్మా గాంధీ స్వరాజ్యం ఇచ్చిన స్ఫూర్తితో కాంగ్రెస్ కార్యకర్తలు మహాత్మా గాంధీ పేరు మార్పు నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోకపోతే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో తీవ్ర ఆందోళనను చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు లింగంపల్లి శ్రీనివాస్, మండల కిసాన్ సెల్ అధ్యక్షులు బొచ్చు ఎల్లయ్య యాదవ్,ఐనాపూర్ సర్పంచ్ ఎరుపుల కళ్యాణి కృష్ణ నాయకులు మల్లం బాలయ్య,చెరుకు రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు....రసులాబాద్ లో ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు.

మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపే లక్ష్యం

- మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్
- మాదాసు శ్రీనివాస్

ప్రతిపక్షం, గజ్వేల్ , జనవరి 22:

గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో రానున్న మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ పిలుపునిచ్చారు. పట్టణంలోని పలు వార్డులో గురువారం నాడు బీఆర్ఎస్ జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మాజీ ముఖ్య మంత్రి కేసీఆర్ నాయకత్వంలో గజ్వేల్ మున్సిపాలిటీ దేశానికి ఆదర్శంగా నిలిచిందని అన్నారు. తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించి ప్రజల దాహార్తిని తీర్చిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక గజ్వేల్ మున్సిపాలిటీకి ఒక్క రూపాయి నిధులు కూడా కేటాయించలేదని విమర్శించారు. కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.ఈ కార్యక్రమంలో మాజీ వైస్ చైర్మన్ జఖి ఉద్దీన్, నాయకులు కళ్యాణ్, నర్సింగరావు, మామిడి శ్రీధర్, శంకర్, వార్డు ఇన్‌చార్జ్ మద్ది రాజిరెడ్డి, రమేష్‌గౌడ్, తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మూగజీవాలకు విషమిచ్చి చంపడం దారుణం. బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. రాష్ట్రంలో పలు చోట్ల వీధికుక్కలకు విషమిచ్చి చంపిన ఘటనలు నా దృష్టికి వచ్చాయి. సమస్యకు పరిష్కారం చట్టబద్ధంగా, శాస్త్రీయంగా జరగాలి, సొంత నిర్ణయాలు తీసుకోవద్దు.

- రాష్ట్ర మంత్రి సీతక్క

ప్రాంతీయం



ఎగిరిన డ్రోన్, పెరిగిన ఆత్మవిశ్వాసం

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, జనవరి 22 :

డ్రోన్ బూట్ క్యాంపు నాలుగో రోజు, గీతం విద్యార్థులు డ్రోన్ అసెంబ్లీపై స్వీయ అవగాహనను ఏర్పరచుకోవడంతో పాటు, వాటిని ఎగరవేయడంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. నిపుణుల మార్గదర్శనంలో, ఏడు క్వాడ్ ఎక్స్ కాప్టర్లను విజయవంతంగా పరీక్షించారు. డ్రోన్ నిర్మాణం, పనితీరు పరీక్షలో విలువైన ఆచరణాత్మక అనుభవాన్ని పొందారు. జీపీఎస్ ఆధారిత హెక్సాకాప్టర్ ను ఎగరవేయడానికి విద్యార్థులకు అవకాశం ఇచ్చారు. ఇది పరిశ్రమ స్థాయి డ్రోన్లలో ఉపయోగించే అధునాతన నావివేషన్, విమాన స్థిరీకరణ, నియంత్రణ వ్యవస్థలను తెలుసుకునే వీలు కల్పించింది. దీనికి అదనంగా, ప్రాథమిక విమాన నియంత్రణలు, యుక్తి పద్ధతులను అర్థం చేసుకుంటూ, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేలా బుల్లి (నానో) డ్రోన్ ఫ్లయింగ్ కార్యక్రమాలను నిర్వహించారు.రోజంతా, విద్యార్థులు డ్రోన్ అసెంబ్లీ, క్రమాంకనం, విమాన కార్యకలాపాలలో చురుకుగా పాల్గొన్నారు. అభివృద్ధి చెందుతున్న వైమానిక సాంకేతికతల పట్ల ఆసక్తి, సాంకేతిక ఉత్సుకత, ఉత్సాహాన్ని ప్రదర్శించారు. మొత్తంమీద, డ్రోన్ బూట్ క్యాంపు పరిశ్రమ ఆధారిత శిక్షణను అందించడమే గాక, డ్రోన్ సాంకేతికతలో సైద్ధాంతిక జ్ఞానాన్ని, వాస్తవప్రపంచ వినియోగం మధ్య ఉన్న అంతరాన్ని సమర్థవంతంగా తగ్గించింది.



సైన్స్ ఫెయిర్ లో ఆకర్షించిన "హోప్ ఎమర్జెన్సీ అలారం"

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, జనవరి 22 :

కొల్లూరు క్యాంపస్‌లోని గాడియం స్కూల్ లో నిర్వహించబడుతున్న సదర్న్ ఇండియా సైన్స్ ఫెయిర్ లో విద్యార్థులు, ఉపాధ్యాయులు మరియు సందర్శకుల ఉత్సాహభరితముగ పాల్గొని విజయవంతంగా కొనసాగింది. విద్యార్థులు తమ సృజనాత్మక సైన్స్ ప్రాజెక్టులను ప్రదర్శించడంతో విస్తృత ప్రజా ఆకర్షణ పొందింది. సందర్శక విద్యార్థులు తమ ఉపాధ్యాయులతో కలిసి ప్రదర్శనలను గమనించి, విశ్లేషించి, వాటి నుంచి నేర్చుకునేందుకు ఆసక్తి చూపించారు. విద్యార్థులు సృజనాత్మక ప్రశ్నలు అడగడంలో ముందుండి, ఇచ్చిన వివరణలతో సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ ఆసక్తి విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసింది. ఈ సైన్స్ ఫెయిర్‌లో స్పేస్ ఆన్ వీల్స్,మహిళల రక్షణ జాకెట్, బొటనవేలు ముద్రతో ఓటింగ్ విధానం, స్మార్ట్ వ్యవసాయం వంటి ఉత్సాహభరిత అంశాలతో కూడిన అద్భుతమైన ప్రాజెక్టులు ప్రదర్శించబడ్డాయి. ఎన్‌జీఓలు ఏర్పాటు చేసిన స్టాళ్లు కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఆకుల కళ (లీఫ్ ఆర్ట్), జన విజ్ఞాన వేదిక సభ్యుల బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన మూఢనమ్మకాలపై అవగాహన కల్పించే ప్రదర్శనలు ఇందులో భాగంగా ఉన్నాయి. "హోప్ ఎమర్జెన్సీ అలారం" అనే అత్యంత ఉపయోగకరమైన ప్రాజెక్ట్ కూడా ప్రత్యేకంగా ఆకట్టుకుంది. సెంట్ పీటర్స్ స్కూల్‌కు చెందిన ప్రశస్తి మాట్లాడుతూ, "హోప్ ఎమర్జెన్సీ అలారం" ప్రాజెక్ట్ తనకు చాలా నచ్చిందని తెలిపింది. ఒంటరిగా నివసించే వ్యక్తులకు ఇది ఎంతో ఉపయోగపడుతుందని, ఎవరికైనా నేలపై పడిపోయినప్పుడు ఇది ఆటోమేటిక్‌గా పోలీసులకు అలారం పంపుతుందని వివరించింది.ఈ ప్రదర్శనలు శాస్త్రీయ ఆలోచన, సృజనాత్మకత మరియు సమస్యల పరిష్కార నైపుణ్యాలపై బలమైన దృష్టిని ప్రతిబింబించాయి. వాస్తవ జీవన సవాళ్లకు పరిష్కారాలను చూపించే భావనలు ఇందులో ప్రధానంగా కనిపించాయి.నాలుగో రోజు కూడా ప్రశంసనీయమైన స్పందనతో ముగిసింది. తెలంగాణ రాష్ట్రంలోని దాదాపు ఆరు జిల్లాల నుంచి సుమారు 11,000 మంది విద్యార్థులు ఈ కార్యక్రమాన్ని సందర్శించారు. విద్యార్థుల ఊహాశక్తిని పెంపొందిస్తూ, అద్భుతమైన ప్రాజెక్టుల ద్వారా అనుభవాత్మక అభ్యాసాన్ని మరింత బలపరిచింది.



శ్రీకేతకి సంగమేశ్వర స్వామి జాతరను సమన్వయంతో విజయవంతం చేయాలి

- కలెక్టర్ ప్రావీణ్య

ప్రతిపక్షం ప్రతినిధి , సంగారెడ్డి జనవరి 22 :

మహాశివరాత్రి సందర్భంగా ఫిబ్రవరి 12 నుంచి 20 వరకు జరగనున్న ఝరాసంగం శ్రీ కేతకి సంగమేశ్వర స్వామి జాతరను అన్ని శాఖల సమన్వయంతో విజయవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. జాతర నిర్వహణ ఏర్పాట్లపై గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, జహీరాబాద్ శాసనసభ్యులు మాణిక్ రావుతో కలిసి సంబంధిత శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు చేపట్టనున్న ఏర్పాట్లను కలెక్టర్‌కు వివరించారు. భక్తులు భారీగా తరలివచ్చే అవకాశం ఉన్నందున ఎలాంటి అసౌకర్యం కలగకుండా టాయిలెట్లు, తాగునీరు, స్నాన సదుపాయాలు ఏర్పాటు చేయాలని, దేవస్థానం వరకు రోడ్ల మరమ్మతులు, సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. జాతర ప్రాంతంలో పారిశుద్ధ్య పనులు నిరంతరం నిర్వహించాలని, వైద్య శిబిరాలు, అంబులెన్స్, అగ్నిమాపక సదుపాయాలు సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. భద్రతా దృష్ట్యా గుడి పరిసరాలు, పార్కింగ్ ప్రాంతాల్లో పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని, మహిళా భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని తెలిపారు. భక్తుల రాకపోకలకు తగిన బస్సులు, హెల్ప్‌డెస్క్, వీల్‌చైర్స్ అందుబాటులో ఉంచాలని సూచించారు.ఈ సమావేశంలో ఎమ్మెల్యే మాణిక్ రావు, అడిషనల్ ఎస్పీ రఘునందన్ రావు, జడ్పీ సీఈవో జానకి రెడ్డి, ఆర్డీవో, దేవస్థానం ఈవో శివ రుద్రప్పతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సంగారెడ్డి డ్రగ్స్ రహిత జిల్లా కావాలి

- అదనపు కలెక్టర్

ప్రతిపక్షం ప్రతినిధి, సంగారెడ్డి, జనవరి 22:

డ్రగ్స్ రహిత సమాజం కోసం అన్ని శాఖలు కలసి కృషి చేయాలని అదనపు కలెక్టర్ పాండు, అడిషనల్ ఎస్పీ రఘునందన్ రావు సూచించారు. నార్కోటిక్స్ కోఆర్డినేషన్ (ఎన్‌సిఒఆర్‌డీ) జిల్లా స్థాయి సమావేశంలో యువత మాదక ద్రవ్యాల బారిన పడకుండా కఠిన చర్యలు తీసుకోవాలని, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. పోలీసులు, విద్యాసంస్థలు, ఇతర శాఖలతో సమన్వయం చేసుకుని డ్రగ్స్ వినియోగ, రవాణా, సాగును నియంత్రించాలని ఆదేశించారు.

ఆర్థిక దోపిడీలో సీఎం సైబర్ నేరగాలకంటే ఘనుడు

- ప్రశ్నిస్తే అందరి పై కేసులు పెడుతున్నాడు
- జిల్లాలో నాలుగు మున్సిపాలిటీలలో గులాబీ జెండా ఎగురుతుంది
- మాజీ మంత్రి హరీష్ రావు సమక్షంలో కాంగ్రెస్ నాయకులు చేరిక

ప్రతిపక్షం ప్రతినిధి మెదక్ జనవరి 22 :-





గత పాలనలో భారత రాష్ట్ర సమితి చేసిన అభివృద్ధి రెండు సంవత్సరాల పాలనలో కాంగ్రెస్ చేసిన అభివృద్ధి మోసాలను ప్రజలకు వివరించి ఓట్లు అడగాలని ప్రతి ఒక్కరూ నీతిగా నిజాయితీగా మున్సిపాలి ఎన్నికలలో పార్టీ కోసం పని చేయాలని మాజీ మంత్రి హరీష్‌రావు అన్నారు ఈరోజు మెదక్ జిల్లా కేంద్రంలోని సాయి బాలాజీ గార్డెన్ లో కాంగ్రెస్ పార్టీ మాజీ మున్సిపల్ చైర్మన్ సావిత్రి వివిధ పార్టీ కౌన్సిలర్లు మాజీ మంత్రి హరీష్‌రావు సమక్షంలో పార్టీలో చేరారు ముందుగా భారత రాష్ట్ర సమితి పార్టీ కార్యాలయం నుండి పెద్ద ఎత్తున సుమారు వెయ్యి మంది కార్యకర్తలతో బైక్ ర్యాలీ నిర్వహించారు పార్టీ కార్యాలయం నుండి గార్డెన్ వరకు సాగిన ఈ బైక్ ర్యాలీ పట్టణ ప్రజలను ఆకర్షించింది. అనంతరం గార్డెన్ లో జరిగిన కార్యక్రమంలో హరీష్ రావు మాట్లాడుతూ ఉమ్మడి మెదక్ జిల్లా ఉండాలంటే బిఆర్ఎస్ మెదక్ జిల్లా రద్దు కావాలంటే కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని ఆయన తెలిపారు గత పది సంవత్సరాల టిఆర్ఎస్ పాలనలో పట్టణాన్ని ఎంతో అభివృద్ధి పరచడం జరిగిందని ప్రధానమంత్రి ఇంద్ర గాంధీ చెయ్యని జిల్లా కేంద్రాన్ని కెసిఆర్ జిల్లా కేంద్రంతో పాటు రైలుకు రాష్ట్ర వాటన్ని తీసుకురావడం మెదక్ పట్టణ రూపురేఖలు మార్చింది భారత రాష్ట్ర సమితి అని ఆయన తెలిపారు ఘనపూర్ కాలువల ఆధునికరణ చేయడం జరిగిందని హల్దీ వాగు పై. మంజీరా నదులపై చెక్ డ్యాములను నిర్మించింది సాగునీటికి నీరు అందించింది మన ప్రభుత్వమని మెదక్ పట్టణానికి మంజీర నీళ్లు అందించడం జరిగిందని ఆయన గుర్తు చేశారు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మెదక్ చేసిన అభివృద్ధి ఏమిటో తెలపాలని ఆయన డిమాండ్ చేశారు. మెదక్ లో మైనారిటీల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం రూపాయి ఖర్చు చేయలేదని మైనార్టీల కోసం మన ప్రభుత్వం మైనార్టీ లకు షాదీ ఖానా తో పాటు అన్ని రకాల అభివృద్ధి పరచడం జరిగిందని ఆయన తెలిపారు మెదక్ జిల్లా కేంద్రంలో ఎస్సీ ఎస్టీ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేయడం జరిగిందని మెదక్ లో రెండుసార్లు రా భారత రాష్ట్ర సమితి పార్టీ అభ్యర్థులు చైర్మన్గా గెలిచి ఎంతో అభివృద్ధి పట్టడం జరిగిందని ఆయన గుర్తు చేశారు రామాయపేటలో రెవెన్యూ డివిజన్ ను ప్రకటించాలని ప్రజల డిమాండ్ మేరకు కేసిఆర్ ప్రభుత్వం వెంటనే ఆర్డిఓ రెవెన్యూ డివిజన్ గా ప్రకటించిందని ఆయన గుర్తు చేశారు ప్రజల పక్షాన నిలబడి ప్రజల కోసం మాట్లాడితే కేసులు పెడుతున్నారని భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఎవరు భయపడడానికి సిద్ధంగా లేరని ఆయన తెలిపారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సైబర్ నేరగాల కంటే ఎక్కువగా ఆర్థిక దోపిడీ చేస్తున్నారని ఆయన అన్నారు మెదక్ అభివృద్ధి చెందాలంటే మెదక్ మున్సిపల్ పై గులాబీ జెండా ఎగరాలని మెదక్ జిల్లాలో నాలుగు మున్సిపాలిటీలలో బిఆర్ఎస్ గెలుస్తుందని ఆయన తెలిపారు కార్యకర్తలు ఐక్యమత్యంతో ఉండి ఒకరి కోసం ఒకరు పనిచేయాలని సీటు ఎవరికి కేటాయిస్తే వారు గెలుపు కోసం అందరం పనిచేయాలని ఆయన తెలిపారు ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షురాలు పద్మ దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ మెదక్ పట్టణాన్ని అభివృద్ధిలో ఆమడ దూరంలో ఉంచడం జరిగిందని స్థానిక ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ కు ఇసుక దందా బెదిరింపులకు పాల్పడుతున్నాడని పరిపాలన చేయడంలో పూర్తిగా అవగాహన లేదని మెదక్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు మాజీ ఎమ్మెల్యే పద్మ దేవేందర్ రెడ్డి తెలిపారు రాష్ట్రంలో గాని. నియోజకవర్గంలో గాని పరిపాలనలో ఎలాంటి మార్పులు లేవని ప్రజలను ప్రజల సమస్యలపై అవగాహన లేని ముఖ్యమంత్రి స్థానిక ఎమ్మెల్యే ఉన్నారని ఆమె అన్నారు

అహంకారానికి-ఆత్మ గౌరవానికి జరుగుతున్న పోరు

మెదక్ నియోజకవర్గంలో స్థానిక ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ అహంకారానికి మెదక్ పట్టణ ప్రజల ఆత్మ గౌరవానికి జరుగుతున్న పోరు మెదక్ మున్సిపల్ పోరు అని మెదక్ మున్సిపల్ పై గులాబీ జెండా ఎగరడం ఖాయమని బిఆర్ఎస్ నేతలు తెలిపారు ఈ సందర్భంగా బిఆర్ఎస్ నేతలు తిరుపతిరెడ్డి మాజీ మున్సిపల్ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్ పట్టణ అధ్యక్షులు ఆంజనేయులు బిఆర్ఎస్ నేత జీవన్ రావు మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే అభివృద్ధి విషయాన్ని మరిచి ఇసుక దందా ప్రశ్నించిన వారిపై బెదిరింపులకు పాల్పడుతున్నారని వారు ఆరోపించారు గత రెండు సంవత్సరాల నుండి మెదక్ పట్టణ అభివృద్ధి ప్రజలు ఏనాడో మర్చిపోయారని వారు తెలిపారు జరగబోవు మున్సిపల్ ఎన్నికలు ఆత్మగౌరవానికి అహంకార అహంకారానికి జరుగుతున్న ఎన్నికలుగా భావించి పట్టణ ప్రజలు గులాబీ పార్టీకి మద్దతు పలికే పలకాలని వారు పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి. మాజీ ఎమ్మెల్సీ మెదక్ మున్సిపల్ ఇంచార్జ్ ఫారుక్. నగేష్. మాజీ ఎమ్మెల్సీ సుభాష్ రెడ్డి. రాష్ట్ర నాయకుడు తిరుపతిరెడ్డి తదితరులు మాట్లాడారు ఈ సందర్భంగా మాజీ మంత్రి హరీష్ రావు మాజీ మున్సిపల్ చైర్మన్ సావిత్రి సురేందర్ గౌడ్ . కౌన్సిలర్లు సురేందర్ గౌడ్ బొద్దుల సంతోష్‌గోదల జ్యోతి కృష్ణ. ఉమా రాజశేఖర్ శ్రీనివాస్ యాదవ్ గొడుగు సునీతలను కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు ఈ కార్యక్రమంలో భారత రాష్ట్ర సమితి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పట్టణంలో బైక్ ర్యాలీ ప్రజలను ఆకర్షించింది

మాజీ మున్సిపల్ చైర్మన్ సావిత్రి సురేందర్ గౌడ్. పార్టీలో రావడంతో పార్టీ ప్రధాన కార్యాలయం నుండి సాయి బాలాజీ గార్డెన్ వరకు సుమారు 1000 మందితో బైక్ ర్యాలీ నిర్వహించారు తెలంగాణ ఉద్యమ పాటలు ప్రజలను ఆకర్షించే పాటలతో సుమారు 1000 మంది కార్యకర్తలతో జిల్లా అధ్యక్షురాలు పద్మ దేవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ కొనసాగింది పట్టణం లోని కలెక్టర్ కార్యాలయం హౌసింగ్ బోర్డ్ డిపో రాందాస్ చౌరస్తా ఆటోనగర్ మీదుగా గార్డెన్ కు. ఈ బైక్ ర్యాలీతో ప్రజలను ఆకట్టుకున్నారు

పటాన్ చెరులోనే జీహెచ్‌ఎంసీ విధులు నిర్వహించాలి

- పటాన్ చెరు కార్పొరేటర్మెట్టు కుమార్ యాదవ్

ప్రతిపక్షం ప్రతినిధి, సంగారెడ్డి, జనవరి 22 :



పటాన్ చెరు డివిజన్‌కు చెందిన జీహెచ్‌ఎంసీ అధికారులు పటాన్ చెరు సర్కిల్ కార్యాలయాన్ని వీడి తెల్లాపూర్ కార్యాలయం నుంచి విధులు నిర్వహించడం వల్ల స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పటాన్ చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు. పేద ప్రజలకు సత్వర సేవలు అందాలంటే జీహెచ్‌ఎంసీ అధికారులు తప్పనిసరిగా పటాన్ చెరు సర్కిల్ కార్యాలయం నుంచే విధులు నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమస్యకు నిరసనగా గురువారం పటాన్ చెరులోని ఫ్రీడమ్ పార్క్ వద్ద కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో ఒకరోజు నిరవధిక నిరాహార దీక్ష నిర్వహించారు. ఈ దీక్షకు స్థానిక ప్రజలు భారీగా హాజరై సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పటాన్ చెరు ఇండస్ట్రియల్ ఏరియా కావడంతో పాటు ఇటీవల డిలిమిటేషన్ ద్వారా ముత్తంగి ప్రాంతం కలవడంతో జనాభా విపరీతంగా పెరిగిందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కార్యాలయాన్ని దూరంగా తరలించడం వల్ల పటాన్ చెరు, జేపీ కాలనీ, ముత్తంగి ప్రాంతాల ప్రజలు చిన్న సమస్యలకే తెల్లాపూర్ వెళ్లాల్సి వస్తోందని విమర్శించారు.ఈ సమస్యను జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వి కర్ణన్ దృష్టికి తీసుకెళ్లామని, సమస్య పరిష్కారం అయ్యే వరకు ప్రజలతో కలిసి పోరాడుతానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మందుముల సపనా దేవ్, మాజీ సర్పంచ్ విటల్ రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సురక్షిత ప్రయాణానికే అరైవ్ అలైవ్

- సీఐ. శ్రీనివాస్

ప్రతిపక్షం దుబ్బాక జనవరి 22:



వాహనదారుల సురక్షిత ప్రయాణానికే పోలీస్ శాఖ అరైవ్ అలైవ్ కార్యక్రమాన్ని చేపట్టిందని దుబ్బాక సీఐ పి. శ్రీనివాస్ అన్నారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా రోడ్డు సురక్ష అభియాన్, రహదారి భద్రత అభియాన్2026ను పురస్కరించుకొని గురువారం దుబ్బాక సర్కిల్ కార్యాలయం పరిధిలో పోలీస్ శాఖ వారు స్థానిక యువత, విద్యార్థులు, ప్రజలకు శివాజీ చౌరస్తా వద్ద ట్రాఫిక్, రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అంతకుముందు హెల్మెట్లు ధరించి స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి యువతతో కలిసి పురవీధుల గుండా పోలీసులు ద్విచక్రవాహన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు భద్రత, రోడ్డు ప్రమాదాల నివారణలో విద్యార్థులు, యువకులు తప్పనిసరి భాగస్వామ్యంతోపాటు రోడ్డు ప్రమాదాల నివారణ ప్రతి ఒక్కరి లక్ష్యం కావాలన్నారు. ప్రయాణాల సమయంలో అందరూ రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ను ధరించాలని సూచించారు.మద్యం తాగి వాహనాలు నడపవద్దని, వాహనాలకు అన్ని అనుమతి పత్రాలు కలిగి ఉండాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని, ఇస్తే తల్లిదండ్రులతోపాటు ఇచ్చిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దుబ్బాక, భూంపల్లి ఎస్సైలు కె.కీర్తి రాజు, వి.హరీష్, స్థానిక యువకులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బైక్ దొంగ అరెస్టు, రిమాండ్ తరలింపు

ప్రతిపక్షం ప్రతినిధి మెదక్ జనవరి22:



మెదక్ జిల్లా కేంద్రంలోని ఆజంపుర వీధిలో బైక్ దొంగతనం చేసిన వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించడం జరిగిందని పట్టణ సిఐ మహేష్ ఒక ప్రకటనలో తెలిపారు. పాత బస్టాండ్ ఆజంపుర వీధిలో మెదక్ మున్సిపాలిటీలో ఉద్యోగం చేస్తున్న పుట్టి బాబు తన ఇంటి ముందు పార్క్ చేసిన ప్యాషన్ పిల్యా బైక్ No.AP13M5446 ని ఎవరో దొంగతనం చేసారని కేసు 32/2026 us305 BNSలో కేసు నమోదు చేయడం జరిగింది. గురువారం రాందాస్ చౌరస్తా లో వెహికల్ చెకింగ్ చేస్తుండగా ఒక వ్యక్తి అనుమానస్పదంగా బైక్ తో పాటు తిరుగుతుంటే పట్టుకుని విచారించగా చేసిన నేరం ని ఒప్పుకున్నాడు తన పేరు దొంతలా బాలలింగు అని నిన్న రాత్రి అజంపుర లో ఒక బైక్ దొంగతనం చేసినాను అని ఒప్పుకోవడం జరిగింది గతంలో కూడా అనేక దొంగతనాలు చేసి జైలుకు పోయి వచ్చాడు అతని పై మొత్తం 10 కేసులు నమోదు అయినవి పట్టణ సీఐ తెలిపారు.అతని వద్ద నుండి దొంగతనం చేసిన బైక్ ని స్వాదీన పరుచుకుని నిందితుడిని జుడీష్యల్ రేమండ్ కి పంపడం జరిగింది. గతంలోకూడా హవేలీ ఘనపూర్ పోలీస్ స్టేషన్ పరిదిలో మేకల దొంగతనం చేసి జైలు కి పోవడం జరిగింది అలా 2024 ఒక మహిళ చేతిలో నుండి బలవంతంగా ఫోన్ లాక్కోగా రాబరీ కేసు నమోదు చేసి జైలు కి పంపడం జరిగింది నేరస్తు డి పై మెదక్ టౌన్ ,మెదక్ రూరల్,హవేలీ ఘనపూర్, లింగంపేట్ పోలీస్ స్టేషన్ కేసులు నమోదు చేయడం జరిగిందని పట్టణ సిఐ తెలిపారు.

మహిళా డిగ్రీ కళాశాలలో "అరైవ్ అలైవ్"

ప్రతిపక్షం, గజ్వేల్, జనవరి 22:



యువతలో రోడ్డు భద్రతపై అవగాహన పెంచే లక్ష్యంతో గజ్వేల్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (గర్ల్స్ హబ్)లో గురువారం "అరైవ్ అలైవ్" రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు. విద్యార్థినులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించడం, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండటం, అతివేగాన్ని నివారించడం ఎంతో ముఖ్యమని అన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపకూడదని, డ్రైవింగ్ సమయంలో సెల్ ఫోన్ వాడకూడదని హెచ్చరించారు. ట్రాఫిక్ సిగ్నల్స్ పాటించడం బాధ్యతాయుతమైన పౌరుల లక్షణమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గజ్వేల్ ఏసిపి నర్సింలు, పోలీస్ ఇన్స్పెక్టర్ రవి కుమార్, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ మురళి, వైస్ ప్రిన్సిపాల్ కమల క్రిస్టియన, అధ్యాపకులు, పోలీస్ అధికారులు మరియు విద్యార్థినులు పాల్గొన్నారు.

కార్మికులను బానిసలుగా మార్చే లేబర్ కోడ్స్ రద్దు చేయాలి

- సిఐటియు

ప్రతిపక్షం ప్రతినిధి, సంగారెడ్డి, జనవరి 22 :



కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్స్ ను తక్షణమే రద్దు చేయాలని కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు అతిమేల మాణిక్ అన్నారు. ఫిబ్రవరి 12 దేశవ్యాప్త సమ్మెలో కాంట్రాక్ట్ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని, కనీస వేతనాలు, బోనస్, ఈఎస్ఐ, పిఎఫ్, సెలవులు, సురక్షిత వర్కింగ్ పరిస్థితులు వంటి డిమాండ్లను కేంద్ర ప్రభుత్వ ముందు ఉంచాలని కోరారు. సమ్మె నోటీసు డిప్యూటీ లేబర్ కమిషనర్ రవీందర్ రెడ్డి కు అందజేశారు.


"



నా కెరీర్‌లో కష్టపడి రాసుకున్న స్క్రిప్ట్‌లలో బాలకృష్ణతో చేసిన 'భగవంత్ కేసరి' ఒకటి. ఈ మూవీ భారీ విజయం సాధించాల్సింది. విడుదలైన సమయంలో చంద్రబాబు జైలులో ఉండటంతో బాలయ్య ఫ్యాన్స్ నిరాశకు గురయ్యారు. సాధారణ ప్రేక్షకులు మూవీని హిట్ చేశారు. పరిస్థితులు బాగుంటే మరింతగా హిట్ అయ్యేది.

- ఓ ఇంటర్వ్యూలో డైరెక్టర్ అనిల్ రావిపూడి

సజ్జన్ కుమార్‌కు భారీ ఊరట..




ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, జనవరి 22: సిక్కు వ్యతిరేక అల్లర్లకు సంబంధించిన మరో రెండు కేసులలో కాంగ్రెస్ మాజీ ఎంపీ సజ్జన్ కుమార్‌కు ఊరట లభించింది. ఆయనను నిర్దోషిగా ఢిల్లీ కోర్టు గురువారం ప్రకటించింది. ప్రత్యేక న్యాయమూర్తి దిగ్ వినయ్ సింగ్ ఈ తీర్పును వెల్లడించారు. మాజీ ప్రధాని ఇందిరా గాంధీ హత్య తర్వాత సిక్కు వ్యతిరేక అల్లర్లు జరిగాయి. 1984 నవంబర్ 1న ఢిల్లీలోని జనక్‌పురిలో జరిగిన హింసలో సోహన్ సింగ్, ఆయన అల్లుడు అవతార్ సింగ్ హత్యకు గురయ్యారు. నవంబర్ 2న వికాస్‌పురిలో గురుచరణ్ సింగ్‌ను నిప్పంటించి చంపారు.కాగా, నాడు ఢిల్లీలో కీలక కాంగ్రెస్ నేత, ఎంపీ అయిన సజ్జన్ కుమార్ సిక్కు వ్యతిరేక అల్లర్లకు కారణమని ఆరోపణలు వచ్చాయి. 2015 ఫిబ్రవరిలో ఈ రెండు కేసుల దర్యాప్తు కోసం సిట్ ఏర్పాటు చేశారు. 2023 ఆగస్టులో అల్లర్లకు పాల్పడటం, శత్రుత్వాన్ని ప్రోత్సహించడం వంటి అభియోగాలను కోర్టు సమర్థించింది. అయితే హత్య, నేరపూరిత కుట్ర నేరాల నుంచి ఆయనకు విముక్తి కల్పించింది. తాజాగా ఈ రెండు కేసుల్లో సజ్జన్ కుమార్ నిర్దోషిగా ఢిల్లీ కోర్టు పేర్కొంది.మరోవైపు ఢిల్లీలోని సరస్వతి విహార్ ప్రాంతంలో 1984 నవంబర్ 1న జస్వంత్ సింగ్, ఆయన కుమారుడు తరుణ్‌దీప్ సింగ్ హత్యలకు సంబంధించిన కేసులో గత ఏడాది ఫిబ్రవరి 25న ట్రయల్ కోర్టు సజ్జన్ కుమార్‌కు జీవిత ఖైదు విధించింది. అలాగే ఢిల్లీలోని పాలం కాలనీ ప్రాంతంలో జరిగిన సిక్కు వ్యతిరేక అల్లర్లలో ఐదుగురి మరణానికి కారణమైనందుకు సజ్జన్ కుమార్‌ను దోషిగా ఢిల్లీ హైకోర్టు నిర్ధారించింది. 2018 డిసెంబర్ 17న జీవిత ఖైదు విధించింది. దీంతో ప్రస్తుతం ఆయన జైలు శిక్ష అనుభవిస్తున్నారు. హైకోర్టు తీర్పుపై ఆయన దాఖలు చేసిన అప్పీల్ సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్నది.

విశ్వ వీక్షణం



షుగర్ ఉన్న వాళ్లు పిల్లలను కనొచ్చా?

నేటికాలంలో సరైన ప్రణాళిక, కట్టుబాటైన జీవనశైలి మార్పులు, వైద్య పర్యవేక్షణతో.. మధుమేహం ఉన్న మహిళలు సురక్షితమైన, ఆరోగ్యకరమైన గర్భధారణను సాధించవచ్చని నిపుణులు గట్టిగా చెబుతున్నారు. అయితే సరైన తయారీ లేకుండా గర్భం దాల్చడం వలన పుట్టబోయే బిడ్డ, తల్లి ఇద్దరికీ ప్రమాదాలు పెరుగుతాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. మధుమేహం ఉన్న స్త్రీలకు.. గర్భధారణ ప్రణాళిక అనేది సాధారణం కంటే ఎక్కువ శ్రద్ధ, వైద్య సంరక్షణను కోరుతుంది. గర్భం దాల్చడానికి ముందు రక్తంలో చక్కెర స్థాయిలను అద్భుతంగా నియంత్రించడం వలన సమస్యల ప్రమాదాన్ని గణనీయంగా తగ్గించవచ్చని, సంతానోత్పత్తి గర్భధారణ ఫలితాలు రెండింటినీ మెరుగు పరచవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. కుటుంబం ప్రారంభించాలని ఆలోచిస్తున్న మధుమేహంతో బాధపడుతున్న మహిళలకు ఆ శుభవార్త గురించి కొన్ని విషయాలు ఈ ఆర్టికల్‌లో తెలుసుకుందాం.



వైద్య నిపుణుల సలహాలు:

అత్యంత ముఖ్యమైన చర్య గర్భధారణ ప్రయత్నాలకు ముందు బ్లడ్ గ్లూకోజ్ నియంత్రణను మెరుగుపరచడమేనని నిపుణులు అంటున్నారు. హైపోగ్లైసీమియాను నివారించడానికి వ్యక్తిగతంగా సర్దుబాటు చేయబడినప్పటికీ.. HbA1cని 06.5% వద్ద ఉంచడానికి లక్ష్యంగా పెట్టుకోవాలని వైద్యులు అంటున్నారు. గర్భధారణకు కనీసం మూడు నెలల ముందు రక్తంలో చక్కెర స్థాయిలను స్థిరీకరించడం వలన గర్భస్రావం, పుట్టుకతో వచ్చే లోపాలు ప్రీఎక్లాంప్సియా వంటి ప్రమాదాలు తగ్గుతాయని నిపుణులు అంటున్నారు. కంటిన్యూయస్ గ్లూకోజ్ మానిటరింగ్ వంటి సాధనాలను ఉపయోగించడం ద్వారా రక్తంలో చక్కెర టైమ్‌ఇన్‌రేంజ్‌ను, భద్రతను మెరుగుపరచడంలో సహాయపడుతుందని అంటున్నారు.

మందుల సమీక్ష-ఫోలిక్ యాసిడ్ ప్రాధాన్యత:

గర్భధారణకు ముందు చేయవలసిన మరో కీలకమైన పని మందులు ఉన్నాయి. వాటిల్లో కొన్ని మధుమేహం మందులు గర్భధారణలో సురక్షితం కావు. SGLT2 ఇన్హిబిటర్లు, GLP1 రిసెప్టర్ అగోనిస్ట్‌లు, స్టాటిన్స్, ACE ఇన్హిబిటర్లు, ARBs వంటి ఔషధాలను సాధారణంగా గర్భధారణకు సురక్షితమైన ప్రత్యామ్నాయాలకు మళ్లించడానికి ఆపవలసి ఉంటుందని వైద్యులు అంటున్నారు. అంతేకాకుండా గర్భం దాల్చడానికి కనీసం మూడు నెలల ముందు రోజుకు 5 mg/day ఫోలిక్ యాసిడ్ తీసుకోవడం ప్రారంభించాలి. మధుమేహం ఉన్న మహిళలకు న్యూరల్ ట్యూబ్ డిఫెక్ట్స్) వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. కాబట్టి ముందుగా సప్లిమెంట్ తీసుకోవడం రక్షణను అందిస్తుందని నిపుణులు చెబుతున్నారు.

జీవనశైలి మార్పులు-బరువు నియంత్రణ:

జీవనశైలి వ్యూహాలు వైద్య సంరక్షణకు అత్యంత తోడ్పాటునిస్తాయని వైద్యులు అంటున్నారు. తృణధాన్యాలు, కూరగాయలు, ఆరోగ్యకరమైన కొవ్వులు, లీన్ ప్రోటీన్లు ఉన్న సమతుల్య ఆహారం రక్తంలో చక్కెరను స్థిరంగా ఉంచుతుంది, ఆకస్మిక పెరుగుదలను తగ్గిస్తుందని అంటున్నారు. శుద్ధి చేసిన చక్కెరలు, అతిగా తినడం, అర్ధరాత్రి భోజనం మానుకోవడం వలన గ్లూకోజ్ స్థాయిలు స్థిరంగా ఉంటాయి. అయితే గర్భధారణకు ముందు ఆరోగ్యకరమైన బరువును నిర్వహించడం చాలా ముఖ్యమైనది. వైద్యుల అభిప్రాయం ప్రకారం.. కేవలం 5% నుంచి 10% బరువు తగ్గడం కూడా అండోత్సర్గము రేటును, ఇన్సులిన్ స్థాయిలను మెరుగుపరుస్తుంది, గర్భధారణ అవకాశాలను పెంచుతుంది. నడక, స్ట్రెంగ్త్ ట్రైనింగ్ లేదా యోగా వంటి రెగ్యులర్ వ్యాయామం బరువు, గ్లూకోజ్ నియంత్రణకు అత్యంత ప్రభావవంతమైన మార్గమని చెబుతున్నారు.

పాలిసిస్టిక్ ఓవరీ సిండ్రోమ్ ఉన్న మహిళల్లో మధుమేహం సర్వసాధారణం కాబట్టి.. దానిని నిర్వహించడం కూడా సంతానోత్పత్తికి అవసరం. ధ్యానం, సరైన నిద్ర, శ్వాస వ్యాయామాలు వంటి పద్ధతుల ద్వారా ఒత్తిడిని నిర్వహించడం వలన హార్మోన్ల సమతుల్యత మెరుగుపడి.. గర్భం దాల్చే అవకాశాలు పెరుగుతాయి. తల్లి, బిడ్డ భద్రత కోసం గర్భధారణకు ముందు కొన్ని వైద్యపరమైన పరీక్షలు తప్పనిసరిగా చెపించుకోవాలి. వాటిల్లో మధుమేహం ఉన్న మహిళలకు హైపోథైరాయిడిజం వంటి థైరాయిడ్ సమస్యలు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది.. ఇది సంతానోత్పత్తిపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. అందుకే థైరాయిడ్ స్క్రీనింగ్ అవసరం. అంతేకాకుండా గర్భధారణ సమయంలో కొన్ని సమస్యలు (రెటినోపతి, న్యూరోపతి, నెఫ్రోపతి, హైపర్‌టెన్షన్) తీవ్రతరం అయ్యే అవకాశం ఉంది. కాబట్టి వీటి కోసం కూడా మహిళలు స్క్రీనింగ్ చేయించుకోవాలి. గర్భస్రావం, పుట్టుకతో వచ్చే ప్రమాదాలను తగ్గించడానికి సిఫార్సు చేయబడిన టీకాలు వేయించుకోవడం, ధూమపానం మానేయడం, మద్యం సేవించడాన్ని పరిమితం చేయడం చాలా ముఖ్యం.

ప్రణాళికతోనే గర్భం:

మధుమేహం ఉన్న మహిళల్లో ప్రణాళిక లేని గర్భాలు ఎక్కువ ప్రమాదాన్ని కలిగిస్తాయని వైద్యులు స్పష్టం చేస్తున్నారు. రక్తంలో చక్కెర, మందులు సరైన స్థాయికి చేరుకునే వరకు విశ్వసనీయ గర్భనిరోధకాన్ని ఉపయోగించాలని నిపుణులు సలహా ఇస్తున్నారు. ముందస్తు ప్రణాళిక, సరైన జీవనశైలి మార్పులు, డయాబెటాలజిస్ట్, గైనకాలజిస్ట్ మధ్య సమన్వయంతో కూడిన సంరక్షణతో.. మధుమేహం ఉన్న మహిళలు సురక్షితంగా గర్భం దాల్చవచ్చు, ఆరోగ్యకరమైన ప్రెగ్నెన్సీని ఆస్వాదించవచ్చు. మధుమేహంతో గర్భం దాల్చడం నిషేధం కాదు.. కానీ దానికి తయారీ.. పర్యవేక్షణ, జాగ్రత్తతో కూడిన ప్రణాళిక అవసరమని నిపుణులు చెబుతున్నారు.



విజయ్ పార్టీకి 'విజిల్'..

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, చెన్నై, జనవరి 22: తమిళనాడు అసెంబ్లీకి కొన్ని నెలల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో నటుడు విజయ్ పార్టీ తమిళగ వెట్రి కళగం (టీవీకే)కు ఎన్నికల సంఘం గురువారం విజిల్ గుర్తును కేటాయించింది. అలాగే మరో నటుడు కమల్‌హాసన్ పార్టీ మక్కల్ నీది మయ్యం (ఎంఎన్ఎం)కు 'బ్యాటరీ టార్చ్' గుర్తును కేటాయించినట్లు వెల్లడించింది. తమ పార్టీకి ఎన్నికల గుర్తు కేటాయించాలని కోరుతూ టీవీకే నవంబర్ 11న ఈసీని ఆశ్రయించింది. శాసనసభ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో గుర్తింపుపొందని రాజకీయ పార్టీలు గుర్తు కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎన్నికల కమిషన్ సూచించిన నేపథ్యంలో వినతిని సమర్పించింది. అలాగే కమల్ పార్టీ నవంబర్‌లో వినతి పత్రం అందించింది. ఈ రెండు పార్టీలు కొన్ని చిహ్నాలు ఉన్న జాబితాను అందించి, వాటిలో ఒకదానిని కేటాయించాలని విజ్ఞప్తి చేశాయి. 2019 లోక్‌సభ ఎన్నికలు, 2021 అసెంబ్లీ ఎన్నికల్లో ఎంఎన్ఎం ఈ బ్యాటరీ టార్చ్ గుర్తుపైనే పోటీ చేసింది. తమిళంతో పాటు తెలుగులోనూ ఫ్యాన్ ఫాలోయింగ్‌ను సొంతం చేసుకున్న కథానాయకుడు విజయ్. ఆయన నటించిన సినిమాలు తెలుగులోనూ విడుదల అవుతుంటాయి. ఫుట్‌బాల్ ఆట నేపథ్యంలో అట్లీ దర్శకత్వం వహించిన బిగిల్ సినిమా.. మన దగ్గర 'విజిల్ పేరుతో రిలీజ్ అయిన సంగతి తెలిసిందే. ఈ సినిమా ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. ఇప్పుడు ఇదే పేరుతో ఉన్న గుర్తుతో విజయ్ తొలిసారి ఎన్నికల బరిలోకి దిగుతుండటం ప్రాధాన్యం సంతరించుకుంది.



ఐరాసకు సవాల్‌గా ట్రంప్ శాంతి మండలి

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గాజా శాంతి మండలిని ప్రారంభించారు దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సులో దీనిని అధికారికంగా ప్రకటించారు. ''ప్రతిఒక్కరు ఈ మండలిలో భాగం కావాలని కోరుతున్నాను. ఐరాసతో సహా అందరితో కలిసి పనిచేస్తాను'' అని ఈ సందర్భంగా ఆయన వ్యాఖ్యానించారు. మండలి సభ్య దేశాల్లో పాకిస్థాన్ ఉండటం గమనార్హం. గాజా పునర్నిర్మాణాన్ని, పాలనను పర్యవేక్షించడం కోసం కొన్నిరోజుల క్రితం అధ్యక్షుడు దీని ఏర్పాటు గురించి ప్రకటన చేసిన సంగతి తెలిసిందే.ఈ మండలికి ట్రంప్ ఛైర్మన్. ఆ హోదాలో ఆయన కొంత మంది సభ్యులను మాత్రమే నియమిస్తారని తొలుత అంతా భావించారు. కానీ ఇప్పటివరకు ఆయన 50 మందికిపైగా దేశాధినేతలకు ఆహ్వానాలు పంపారు. ఇందులో భారత ప్రధాని నరేంద్ర మోదీ, రష్యా అధ్యక్షుడు పుతిన్, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ సహా పలు దేశాల అధినేతలు ఉన్నారు. ఐరాస స్థానంలో ట్రంప్ ఈ గాజా శాంతి మండలిని తీసుకువస్తున్నారనే చర్చ నడుస్తోంది. '''ఐరాస ఎంతో చేయాల్సి ఉందన్నది నా భావన. అలా చేసుంటే ఈ శాంతి మండలి అవసరమే ఉండేది కాదు'' అని ఆయన చేసిన వ్యాఖ్యలతో ఇది గాజాకు పరిమితమైన మండలి కాదన్న విషయం స్పష్టమవుతోంది. ఇందులో శాశ్వత సభ్యత్వం పొందాలనుకునే దేశం ఒక బిలియన్ డాలర్లు (రూ.9వేల కోట్లకు పైగానే) చెల్లించాల్సి ఉంటుంది.



ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు?

ఉక్రెయిన్ యుద్ధం ముగింపు దిశగా అమెరికా చేస్తున్న ప్రయత్నాల్లో కీలక పరిణామం. రష్యా, ఉక్రెయిన్, అమెరికాలు తొలిసారి త్రైపాక్షిక భేటీకి సిద్ధమయ్యాయి. యూఏఈ వేదికగా మూడు దేశాల ప్రతినిధులు సమావేశంలో పాల్గొననున్నారు. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ దావోస్ వేదికగా ఈ విషయాన్ని ప్రకటించారు. శుక్రవారం నుంచి రెండు రోజులపాటు ఈ భేటీ జరుగుతుందన్నారు. తాము మాత్రమే కాదు.. రష్యన్లు కూడా రాజీకి సిద్ధంగా ఉండాలని, ఇది తమకు చాలా ముఖ్యమని పేర్కొన్నారు.అంతకుముందు దావోస్ వేదికగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ జెలెన్‌స్కీలు భేటీ అయ్యారు. అనంతరం ట్రంప్ మాట్లాడుతూ.. ఈ సమావేశం చక్కగా జరిగిందన్నారు. ''ఈ యుద్ధం ముగియాలి. ఇప్పటికే చాలామంది చనిపోయారు. గత నెలలో 30 వేలమంది ప్రాణాలు కోల్పోయారు. అందులో చాలావరకు సైనికులే. ఈ యుద్ధాన్ని ముగించకపోతే మనందరికీ అవమానకరమే'' అంటూ రష్యా అధ్యక్షుడు పుతిన్‌ను ఉద్దేశించి పేర్కొన్నారు. అమెరికా బృందం త్వరలో ఆయనతో భేటీ కానుందని తెలిపారు.





ఆటలు

@prathipaksham
prathipaksham tv telugu


ప్రపంచకప్ నుంచి బంగ్లాదేశ్ అవుట్?



బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (బీసీబీ) ఐసీసీ హెచ్చరికను ఖాతరు చేయలేదు. భారత్‌లో ఆడకూడదన్న తమ నిర్ణయాన్ని మార్చుకోకుంటే టీ20 ప్రపంచకప్‌లో మరో జట్టుకు అవకాశం ఇస్తామని ఐసీసీ స్పష్టం చేసినా పట్టువీడలేదు. భద్రత కారణాల దృష్ట్యా తమ జట్టును భారత్‌కు పంపే ప్రసక్తే లేదని బీసీబీ తేల్చిచెప్పింది. భారత్‌లో తమ మ్యాచ్‌ల్ని శ్రీలంకకు మార్చాలన్న అభ్యర్థనను ఐసీసీ తిరస్కరించిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంది. బంగ్లాదేశ్ ప్రభుత్వం, క్రికెటర్లతో చర్చించిన అనంతరం ఐసీసీకి తమ నిర్ణయాన్ని తెలియజేసింది. పోటీ కప్పునకు బంగ్లా దాదాపుగా దూరమవడంతో.. ర్యాంకింగ్స్ ఆధారంగా ఆ జట్టు స్థానంలో స్కాట్లాండ్‌కు అవకాశం లభిస్తుంది. మరి ఐసీసీ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో చూడాలి. "ప్రపంచకప్‌కు అర్హత సాధించడానికి మా ఆటగాళ్లు ఎంతో కష్టపడ్డారు. అయితే భారత్‌లో మాకు భద్రత ముప్పు పొంచి ఉంది. ఇది కేవలం ఊహాజనిత ఆందోళన కాదు. మొత్తం జట్టు, విలేకరులు, అభిమానుల భద్రతపై మాకు నమ్మకం కలగడం లేదు. ఐసీసీ ముప్పు అంచనా నివేదిక ఆమోదయోగ్యంగా లేదు. అయినా మేమింకా ఆశలు వదులుకోలేదు. ప్రపంచకప్‌లో ఆడేందుకు మా జట్టు సిద్ధంగా ఉంది. భద్రత సమస్యను వాస్తవికంగా పరిగణలోకి తీసుకుని శ్రీలంకలో ఆడేలా ఐసీసీ న్యాయం చేస్తుందని ఆశిస్తున్నాం. ప్రభుత్వ నిర్ణయానికి గల కారణాలు, అందుకు దారితీసిన పరిస్థితుల్ని ఆటగాళ్లకు వివరించాం. వాళ్లు అర్థం చేసుకున్నట్లు అనిపించింది. క్రికెట్‌ను అభిమానించే సుమారు 20 కోట్ల జనాభా కలిగిన దేశం బంగ్లా. ఒకవేళ ఐసీసీ మాకు అవకాశం ఇవ్వడంలో విఫలమైతే అది ప్రపంచ క్రికెట్‌కు తీరని నష్టం.

యూపీపై గుజరాత్ ఘనవిజయం

డబ్ల్యూపీఎల్‌లో గుజరాత్ మళ్లీ గెలుపుబాట పట్టింది. బంతితో అదరగొట్టిన ఆ జట్టు 45 పరుగుల తేడాతో యూపీ వారియర్స్‌ను ఓడించింది. గురువారం మొదట గుజరాత్ 8 వికెట్లకు 153 పరుగులు చేసింది. సోఫీ డివైన్ (50 నాటౌట్; 42 బంతుల్లో 2×4, 3×6) టాప్‌స్కోరర్. బెత్ మూనీ (38; 34 బంతుల్లో 5×4) కూడా రాణించింది. క్రాంతి గౌడ్ (2/18), ఎకిల్‌స్టోన్ (2/22) ఆకట్టుకున్నారు. ఛేదనలో రాజేశ్వరి గైక్వాడ్ (3/16), సోఫీ డివైన్ (2/16) రేణుక సింగ్ (2/20) ధాటికి యూపీ 17.3 ఓవర్లలో 108 పరుగులకే ఆలౌటైంది. లిచ్‌ఫీల్డ్ (32; 27 బంతుల్లో 5×4), ట్రయాన్ (30 నాటౌట్; 22 బంతుల్లో 3×4, 1×6) మాత్రమే రాణించారు. హ్యాట్రిక్ పరాజయాల తర్వాత గుజరాత్‌కు ఇదే తొలి విజయం కావడం విశేషం. యూపీకి రెండు విజయాల తర్వాత ఇదే తొలి ఓటమి.ఛేదనలో తడబడి..: లక్ష్యం మరీ పెద్దది కాకపోయినా యూపీ తడబడింది. ఆరంభంలోనే వికెట్లు చేజార్చుకుని ఒత్తిడికి గురైంది. తొలి ఓవర్లోనే కిరణ్ నవ్‌గిరె డకౌట్ అయింది. ఈ స్థితిలో ఫోబి లిచ్‌ఫీల్డ్, కెప్టెన్ మెగ్ లానింగ్ (14) కాసేపు ఇన్నింగ్స్‌ను నడిపించారు. లానింగ్‌ను కష్వీ ఔట్ చేయడంతో యూపీ 5 ఓవర్లకు 39/2తో నిలిచింది. లిచ్‌ఫీల్డ్ అడపాదడపా బౌండరీలు కొట్టి సాధించాల్సిన రన్‌రేట్ మరీ పెరగకుండా చూసింది. ఎనిమిదో ఓవర్లో లిచ్‌ఫీల్డ్‌ను ఆష్లీ గార్డ్‌నర్ ఔట్ చేసి ప్రత్యర్థిని గట్టి దెబ్బ తీసింది. హర్లీన్ డియోల్ (3), దీప్తి శర్మ (4) సైతం వెనుదిరగడంతో యూపీ 11 ఓవర్లకు 68/5తో ఓటమి దిశగా సాగింది. ట్రయాన్ కొన్ని షాట్లు ఆడినా.. సమీకరణం (48 బంతుల్లో 75) క్లిష్టంగా మారింది. దీంతో ట్రయాన్ పోరాటం పరుగుల అంతరాన్ని మాత్రమే తగ్గించగలిగింది. గుజరాత్ కట్టడి: 2 ఓవర్లకు 20.. 5 ఓవర్లకు 43/2 ఆరంభంలో గుజరాత్ ఇన్నింగ్స్ సాగిన తీరిది. మొదట దూకుడుగా ఆడిన ఆ జట్టు.. తర్వాత వికెట్లు కోల్పోయి ఓ మోస్తరు స్కోరుకే పరిమితమైంది. మొదట ఓపెనర్లు బెత్ మూనీ, డానీ వ్యాట్ (14) దూకుడుగా ఆడి గుజరాత్‌కు మెరుపు ఆరంభం అందించారు. వ్యాట్‌తో పాటు అనుష్క శర్మ (14)ను ఔట్ చేసిన క్రాంతి గౌడ్.. గుజరాత్‌ను దెబ్బ కొట్టింది. ఆష్లీ గార్డ్‌నర్ (5) సైతం నిలవలేకపోయింది. ఈ స్థితిలో సోఫీ డివైన్, బెత్ మూనీ జంట ఇన్నింగ్స్‌ను నడిపించింది. 12 ఓవర్లకు గుజరాత్ 86/3తో కాస్త మెరుగైన స్థితిలో నిలిచింది. అయితే మూనీని ఎకిల్‌స్టోన్ ఔట్ చేయడం.. తర్వాత యూపీ బౌలర్లు కట్టుదిట్టంగా బంతులు వేయడంతో గుజరాత్ రన్‌రేట్ పడిపోయింది. ఆఖరిదాకా నిలిచిన డివైన్.. స్కోరు 150ను దాటించింది. చివరి ఓవర్లో శిఖ నోబాల్ వేయడంతో ఔటయ్యే ప్రమాదం నుంచి తప్పించుకున్న డివైన్.. ఆ తర్వాత ఫ్రీ హిట్‌ను సిక్స్ కొట్టడమే కాక.. మరో సిక్స్ కూడా బాదింది. ఈ క్రమంలో అర్ధసెంచరీ అందుకుని.. గుజరాత్‌కు పోరాడే స్కోరు సాధించిపెట్టింది. ఆఖరి ఓవర్లో గుజరాత్ 16 పరుగులు రాబట్టింది.గుజరాత్ జెయింట్స్: 153/8 (సోఫీ డివైన్ 50 నాటౌట్, బెత్ మూనీ 38; క్రాంతి గౌడ్ 2/18, ఎకిల్‌స్టోన్ 2/22);యూపీ వారియర్స్: 17.3 ఓవర్లలో 108 ఆలౌట్ (లిచ్‌ఫీల్డ్ 32, ట్రయాన్ 30 నాటౌట్; రాజేశ్వరి గైక్వాడ్ 3/16, సోఫీ డివైన్ 2/16, రేణుక సింగ్ 2/20)



సింధు చారిత్రక రికార్డు

భారత స్టార్ షట్లర్ పి.వి.సింధు అరుదైన ఘనత సాధించింది. ప్రపంచ బ్యాడ్మింటన్ మహిళల సింగిల్స్‌లో 500 మ్యాచ్‌ల్లో విజయాలు సాధించిన ఆరో క్రీడాకారిణిగా ఘనత అందుకుంది. ఈ రికార్డు నమోదు చేసిన తొలి భారత షట్లర్‌గా చరిత్ర సృష్టించింది. ఇండోనేసియా మాస్టర్స్ ప్రపంచ టూర్ సూపర్ 500 టోర్నీలో సింధు ఈ చిరస్మరణీయ విజయంతో క్వార్టర్‌ఫైనల్లో అడుగు పెట్టింది. గురువారం ప్రిక్వార్టర్స్‌లో భారత స్టార్ 2119, 2118తో లైన్ హోయ్‌మార్క్ (డెన్మార్క్)పై గెలుపొందింది. మహిళల సింగిల్స్‌లో సింధు కంటే ముందు ఇంతానన్ రచనోక్ (థాయ్‌లాండ్), తై జు యింగ్ (చైనీస్ తైపీ), అకానె యమగూచి (జపాన్), కరోలినా మారిన్ (స్పెయిన్), పెత్యా నెదెల్చెవా (బల్గేరియా) మాత్రమే 500 విజయాలు నమోదు చేశారు. డబుల్స్ మ్యాచ్‌లను జోడీస్తే సింధు ఖాతాలో మొత్తం 516 విజయాలున్నాయి. ఇక పురుషుల సింగిల్స్‌లో మరో స్టార్ క్రీడాకారుడు లక్ష్యసేన్ క్వార్టర్స్‌లో అడుగుపెట్టాడు. ప్రిక్వార్టర్స్‌లో లక్ష్యసేన్ 2110, 2111తో జేసన్ గునవాన్ (హాంకాంగ్)పై నెగ్గాడు. కిదాంబి శ్రీకాంత్ 1121, 1021తో చౌ తీన్ చెన్ (చైనీస్ తైపీ) చేతిలో ఓడాడు. మహిళల సింగిల్స్‌లో అన్మోల్ ఖరబ్ 2116, 615 (రిటైర్డ్)తో నొజొమి ఒకుహర (జపాన్) చేతిలో పరాజయం చవిచూసింది. పురుషుల డబుల్స్ ప్రిక్వార్టర్స్‌లో హరిహరన్ అర్జున్ జోడీ 1721, 219, 1621తో వీ చాంగ్ వున్ తీ (మలేసియా) జంట చేతిలో పోరాడి ఓడింది.



ఆదర్శ కుటుంబంలో నారా రోహిత్

అగ్ర తార వెంకటేశ్ కథానాయకుడిగా... త్రివిక్రమ్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'ఆదర్శ కుటుంబం హౌస్ నెం.47'. శ్రీనిధిశెట్టి కథానాయిక. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై ఎస్.రాధాకృష్ణ (చినబాబు) నిర్మిస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ చేసుకుంటోన్న ఈ సినిమాలో మరో కథానాయకుడు నారా రోహిత్ ఓ కీలక పాత్రని పోషిస్తున్నారు. ప్రస్తుతం రోహిత్‌తోపాటు, ఇతర ప్రధాన తారాగణంపై కీలక సన్నివేశాల్ని తెరకెక్కిస్తున్నట్టు సమాచారం. త్రివిక్రమ్ సినిమాల్లో యువ కథానాయకులు కీలక పాత్రల్లో మెరవడం కొత్త కాదు. నారా రోహిత్ ఎలాంటి పాత్రలో సందడి చేస్తారో చూడాలి. ఈ ఏడాది వేసవిలోనే ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.

రీ రిలీజ్‌కి చైతూ 'లవ్‌స్టోరీ'




గత 2, 3 సంవత్సరాలుగా టాలీవుడ్ సినీ ఇండస్ట్రీలో రీ రిలీజ్ చిత్రాల హవా ఎక్కువగా కొనసాగుతున్న విషయం తెలిసిందే. ముఖ్యంగా అభిమాన హీరోలకు సంబంధించిన స్పెషల్ అకేషన్ ఏదైనా ఉన్నప్పుడు లేదా మరేదైనా స్పెషల్ డే ఉన్నప్పుడు ఆయా సందర్భాలలో ఆయా హీరోల కెరియర్లో బ్లాక్ బాస్టర్ గా నిలచిన చిత్రాలను మళ్లీ రిలీజ్ చేసి సందడి చేస్తున్నారు అభిమానులు. అలా మహేష్‌బాబు 'పోకిరి' సినిమాతో మొదలైన ఈ ట్రెండ్ ఇప్పటికీ మరింత జోరుగా సాగుతోంది. ఈ క్రమంలోనే ఫిబ్రవరి నెల రాబోతున్న నేపథ్యంలో ప్రేమికుల రోజు సందర్భంగా కొన్ని కొత్త సినిమాలు విడుదల అవుతుండగా.. మరికొన్ని రీ రిలీజ్ అవుతున్నాయి.

అందులో భాగంగానే ప్రేక్షకులను మరోసారి థియేటర్లలో మెప్పించడానికి కల్ట్ క్లాసిక్ రొమాంటిక్ 'లవ్ స్టోరీ' రీ రిలీజ్ కి సిద్ధమవుతోంది. యూత్ ఫుల్ ఎంటర్టైన్మెంట్ చిత్రాలకు కేరాఫ్ అడ్రస్ గా నిలిచిన శేఖర్ కమ్ముల దర్శకత్వంలో శ్రీ వెంకటేశ్వర సినిమాస్ బ్యానర్లో శ్రీ నారాయణదాసు నారంగ్, పి రామ్మోహన్రావు సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రంలో అక్కినేని నాగచైతన్య హీరోగా, సాయి పల్లవి హీరోయిన్గా నటించారు. 2020 ఏప్రిల్ 2న విడుదల కావాల్సిన ఈ సినిమా కరోనా సెకండ్ వేవ్ కారణంగా వాయిదా పడి.. 2021 సెప్టెంబర్ 24న విడుదల అయింది. ప్యూర్ రొమాంటిక్ లవ్ స్టోరీ గా వచ్చిన ఈ లవ్ స్టోరీ మూవీ ఊహించని విజయాన్ని సొంతం చేసుకుంది.అలాంటి ఈ మూవీ ఇప్పుడు రీ రిలీజ్ కి సిద్ధమవుతోంది. ఫిబ్రవరి 14వ తేదీన రీ రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా నాగచైతన్య ఈ విషయాన్ని ట్విట్టర్ ద్వారా అధికారికంగా ప్రకటిస్తూ.. "లవ్ స్టోరీ సినిమా నా మనసుకు దగ్గరైన చిత్రం. అలాంటి ఈ సినిమా ఇప్పుడు ఫిబ్రవరి 14వ తేదీన మళ్లీ విడుదల కాబోతోంది. మరోసారి మీ అందరితో కలిసి ఈ సినిమాను థియేటర్లలో సెలబ్రేట్ చేసుకుందాం" అంటూ పోస్ట్ చేశారు నాగ చైతన్య. ప్రస్తుతం ఈ పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్ గా మారడంతో అభిమానులు తెగ సంతోషం వ్యక్తం చేస్తున్నారు..మరోవైపు లవ్ స్టోరీ సినిమా రీ రిలీజ్ కి సిద్ధమవుతున్న నేపథ్యంలో ఈ సినిమాకు సంబంధించిన కొన్ని విషయాలు కూడా వైరల్ గా మారుతున్నాయి. అందులో భాగంగానే ఈ సినిమా క్రియేట్ చేసిన రికార్డ్స్ కూడా వైరల్ అవుతున్నాయి. ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా దాదాపు 100 కోట్ల గ్రాస్ వసూలు సాధించి పోస్ట్ కోవిడ్ కాలంలో అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రాలలో ఒకటిగా నిలిచింది. అలాగే అమెరికాలో వన్ మిలియన్ డాలర్ మార్క్ అధిగమించి రికార్డు సృష్టించింది. కరోనా తర్వాత థియేటర్లు తిరిగి తెరవబడినప్పుడు అత్యధిక ఓపెనింగ్ డే కలెక్షన్స్ సాధించిన చిత్రాలలో ఒకటిగా నిలిచింది.అంతేకాదు రెండు తెలుగు రాష్ట్రాలలో కలిపి 10.3 కోట్ల గ్రాస్ వసూలు చేసింది . ఒకరకంగా చెప్పాలి అంటే కరోనా సమయంలో ఇది చాలా పెద్ద కలెక్షన్. ఈ సినిమా విడుదలైన 16వ రోజు కూడా అత్యధిక కలెక్షన్ల సాధించి రికార్డు సృష్టించింది. అలాంటి ఈ సినిమా ఇప్పుడు మళ్లీ రీ రిలీజ్ అవుతోంది. మరి ఇప్పుడు ఎలాంటి రికార్డ్స్ క్రియేట్ చేస్తుందో చూడాలి. ఇకపోతే వీరిద్దరి కాంబినేషన్లో మళ్ళీ తండేల్ సినిమా వచ్చి మంచి సక్సెస్ అందుకున్న విషయం తెలిసిందే.

ఆ తప్పు నేను అస్సలు చేయను..

టాలీవుడ్ సక్సెస్‌ఫుల్ డైరెక్టర్ అనిల్ రావిపూడికి తన స్ట్రెంత్ ఏంటో, తన మార్కెట్ పరిధి ఎంతో చాలా క్లియర్ గా తెలుసు. వరుసగా కమర్షియల్ హిట్లు కొడుతున్నా, ఆయన ఎప్పుడూ లేనిపోని ప్రయోగాలకు పోకుండా తనదైన శైలిలో దూసుకుపోతుంటారు. తాజాగా ఒక ఇంటర్వ్యూలో ఆయన చేసిన వ్యాఖ్యలు చూస్తుంటే, సినిమా మేకింగ్ మార్కెట్ ట్రెండ్స్‌పై ఆయనకు ఎంతటి అవగాహన ఉందో అర్థమవుతోంది. ముఖ్యంగా రీమేక్‌లు పాన్ ఇండియా సినిమాలపై ఆయన ఇచ్చిన క్లారిటీ ఇప్పుడు ఫిలిం సర్కిల్స్‌లో హాట్ టాపిక్‌గా మారింది.అనిల్ రావిపూడి రాసే కథలు, అందులోని కామెడీ టైమింగ్ వేరే భాషల్లోకి రీమేక్ అవ్వడం ఆయనకు సంతోషమే. కానీ, అదే సినిమాలను వేరే భాషల్లో నన్నే డైరెక్ట్ చేయమంటే మాత్రం తాను అస్సలు ఒప్పుకోనని ఆయన ఖరాకండిగా చెప్పారు. ఇప్పటికే ఆయన దర్శకత్వంలో వచ్చిన 'భగవంత్ కేసరి', 'సంక్రాంతికి వస్తున్నాం' వంటి చిత్రాలను ఇతర భాషల్లో రీమేక్ చేసే ఆఫర్లు వచ్చినా ఆయన సున్నితంగా తిరస్కరించారట. ఒకసారి తీసిన సినిమాను మళ్ళీ తీయడంలో తనకు ఆసక్తి లేదని స్పష్టం చేశారు.దీని వెనుక ఒక బలమైన కారణం కూడా ఉందని అనిల్ వివరించారు. ఆయన తీసే సినిమాలు ఎక్కువగా ఎంటర్టైన్మెంట్ మీద ఆధారపడి ఉంటాయి. ఇలాంటి కామెడీ సినిమాలను పాన్ ఇండియా ప్రాజెక్టుల్లా ఒకేసారి అన్ని భాషల్లో తీయడం అసాధ్యమని అభిప్రాయపడ్డారు. ఎందుకంటే, ఒక ప్రాంతంలోని ఆడియన్స్ ఎంజాయ్ చేసే కామెడీ, మరో ప్రాంతం వారికి నచ్చకపోవచ్చు. రీజియన్ బట్టి ఆడియన్స్ పల్స్ మారిపోతుందని, అందుకే కామెడీ సినిమాలకు పాన్ ఇండియా అప్పీల్ ఇవ్వడం పెద్ద రిస్క్ అని అన్నారు.ఈ విషయంలో అనిల్ రావిపూడి ఇండస్ట్రీలోని మిగతా డైరెక్టర్ల కంటే భిన్నంగా ఆలోచిస్తున్నారు. ప్రస్తుతం అందరూ పాన్ ఇండియా మంత్రం జపిస్తుంటే, ఆయన మాత్రం తన బలాన్ని నమ్ముకుని రీజినల్ మార్కెట్ లోనే సత్తా చాటాలని చూస్తున్నారు. తన మార్కెట్ మీద తనకు ఉన్న ఈ క్లారిటీ వరుస విజయాల వైపు నడిపిస్తోంది. నిర్మాతలకు సేఫ్ బిజినెస్ గా మారుస్తోంది. తన లిమిట్స్ ఏంటో తెలిసి ప్రవర్తించడం వల్లే రావిపూడి సక్సెస్ రేటు స్థిరంగా కొనసాగుతోంది. ఏదేమైనా అనిల్ రావిపూడి ఒక ప్రాక్టికల్ డైరెక్టర్ అని మరోసారి నిరూపించుకున్నారు. తనకు ఏది వస్తుందో అది మాత్రమే చేస్తానని, రాని దానికోసం ఆరాటపడనని చెప్పిన విధానం ఒప్పుకోదగినదే. బాక్సాఫీస్ దగ్గర తనదైన ముద్ర వేస్తూనే, తన నేటివిటీ సినిమాలతో తెలుగు ఆడియన్స్‌ను అలరించడమే తన ఫస్ట్ ప్రయారిటీ అని క్లారిటీ ఇచ్చేశారు. మరి అనిల్ మార్క్ ఎంటర్టైన్మెంట్ లో రాబోయే తదుపరి చిత్రాలు బాక్సాఫీస్ దగ్గర ఎలాంటి వండర్స్ క్రియేట్ చేస్తాయో వేచి చూడాలి.





పెద్ది రిలీజ్‌పై సరికొత్త గందరగోళం..

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న లేటెస్ట్ చిత్రం 'పెద్ది'(Peddi) ఇప్పటికే ప్రేక్షకుల్లో సాలిడ్ బజ్ క్రియేట్ చేసింది. దర్శకుడు బుచ్చిబాబు సానా డైరెక్ట్ చేస్తున్న ఈ రూరల్ స్పోర్ట్స్ డ్రామా మూవీలో రామ్ చరణ్ మాస్ లుక్‌తో ఇరగదీసేందుకు రెడీ అయ్యాడు. ఇక ఈ సినిమా నుంచి ఇప్పటికే రిలీజ్ అయిన ఫస్ట్ సింగిల్ సాంగ్ 'చికిరి చికిరి'కి ప్రేక్షకుల నుంచి అదిరిపోయే రెస్పాన్స్ దక్కింది. ఈ చిత్రాన్ని 2026 మార్చి 27న రిలీజ్ చేస్తున్నట్లు చిత్ర యూనిట్ ఇప్పటికే ప్రకటించిన సంగతి తెలిసిందే.అయితే, ఇప్పుడు ఈ రిలీజ్ విషయంపై సినీ సర్కిల్స్‌లో సరికొత్త గందరగోళం నెలకొంది. 'పెద్ది' చిత్రాన్ని పాన్ ఇండియా మూవీగా గ్రాండ్ రిలీజ్ చేసేందుకు మేకర్స్ రెడీ అవుతున్నారు. కానీ, మార్చి 19న బాలీవుడ్ బ్లాక్‌బస్టర్ చిత్రం 'ధురంధర్' సీక్వెల్ చిత్రం 'ధురంధర్ 2'.. రాక్‌స్టార్ యష్‌నటిస్తున్న 'టాక్సిక్' చిత్రాలు రిలీజ్ కానున్నాయి. ఈ చిత్రాలపై నార్త్ బెల్ట్‌లో అదిరిపోయే అంచనాలు క్రియేట్ అయ్యాయి. దీంతో అక్కడి డిస్ట్రిబ్యూటర్లు ఈ చిత్రాల కోసం థియేటర్లను బ్లాక్ చేసే పనిలో పడ్డారు.దీంతో 'పెద్ది' రిలీజ్‌ను వాయిదా వేసుకుని తర్వాత వస్తే, ఈ చిత్రానికి లాంగ్ రన్‌తో పాటు ఎక్కువ కలెక్షన్స్ వచ్చే పరిస్థితి ఉందంటూ పలువురు నార్త్ డిస్ట్రిబ్యూటర్లు సూచిస్తున్నారట. మరి నిజంగానే వారి సూచనలతో పెద్ది చిత్రం మార్చి రిలీజ్‌ను వాయిదా వేస్తుందా.. లేక చెప్పిన తేదీనే వచ్చేస్తుందా..? అనే గందరగోళం సినీ సర్కిల్స్‌లో నెలకొంది. మరి ఈ విషయంపై పెద్ది మేకర్స్ ఏదైనా క్లారిటీ ఇస్తారేమో చూడాలి.

Printed, Published and Owned by MOHAMMED AZIZ UR RAHAMAN, Printed at KRK PRINTERS, H.No. 2-3-703/7, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana - 500013.
Published at h.no. 8-1-284/OU/521/7/9, OU Colony, Tolichowki, Golconda, Hyderabad, Telangana - 500008. Editor: FAZUL RAHAMAN MOHAMMED. 040-4390 2732, email: editor@prathipaksham.in, RNI No. APTEL/2007/19200